# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 293 | శుక్రవారం,మే 15 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## కేరళం సీఎంగా వీడీ సతీశన్

**- కేరళం సీఎంగా సతీశన్ పేరును ప్రకటించిన హైకమాండ్**



**తిరువనంతపురం(భారత శక్తి)** కేరళం ముఖ్యమంత్రిగా వీడీ సతీషన్ పేరును కాంగ్రెస్ హై కమాండ్ గురువారం ప్రకటించింది. ఎర్నాకుళం జిల్లా నెట్టూరు జన్మించిన సతీష్ ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. సోషల్ వర్క్ మాస్టర్స్, ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం చదివారు. కేరళం హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసారు. కాంగ్రెస్ విద్యార్థి విభాగం నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2001లో తొలిసారి పరవూరు నుంచి ఎమ్మెల్యే అయ్యారు. పరవూరు నియోజకవర్గం నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2026లో పరవూరులో కేఎం దినకరన్, 2011లో సీపీఎం నేత పన్నయన్ రవీంద్రన్పై విజయం సాధించారు. 2016లో శారదా మోహన్పై 20,634 ఓట్ల తేడాతో గెలుపొందారు. 12వ అసెంబ్లీలో భారత జాతీయ కాంగ్రెస్ చీఫ్ విప్గా బాధ్యతలు నిర్వహించారు. 2021లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబర్గా నియామకం అయ్యారు. 2026 కేరళం ఎన్నికల్లో గెలుపులో అయన కీలక పాత్ర పోషించారు.

## తెలంగాణ అభివృద్ధికి మెగా గ్రోత్ కారిడార్లు కీలకం

**- సీఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్ (భారత శక్తి)**వరంగల్, కరీంనగర్, ఖమ్మంకు ఔటర్ రింగ్ రోడ్లు 25 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, ప్రధాన పట్టణాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల కోసం మెగా గ్రోత్ కారిడార్లను ఏర్పాటు చేసి ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల గ్రోత్ కారిడార్లు అత్యంత కీలకమని పేర్కొంటూ, ఆయా నగరాలకు ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదిత గ్రోత్ కారిడార్ల అభివృద్ధి ప్రణాళికలపై సమగ్ర చర్చ జరిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కనీసం వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.మహబూబ్నగర్, భూత్పూర్, జడ్చర్ల ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక గ్రోత్ కారిడార్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. అలాగే కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే కారిడార్ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.నల్గొండ నుంచి యాదగిరిగుట్ట వరకు టెంపుల్ కారిడార్ అభివృద్ధి చేయాలని, ఆదిలాబాద్,నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను అనుసంధానిస్తూ ప్రత్యేక టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని

2లో..

## ఆ యూనిఫాం కనిపిస్తే ప్రజలకు ధైర్యం

**ఎన్డీఆర్ఎఫ్పై అమిత్ షా ప్రశంసలు**

- ఎన్డీఆర్ఎఫ్కు దక్కిన ప్రతిష్ఠాత్మక 'ప్రెసిడెంట్స్ కలర్' పురస్కారం
- ఘజియాబాద్లో జరిగిన వేడుకలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- 20 ఏళ్లలో 140 కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని ఎన్డీఆర్ఎఫ్ గెలుచుకుందని ప్రశంస
- ఆపత్కాలంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని చూస్తే ప్రజలకు ధైర్యం వస్తుందని వ్యాఖ్య



**ఘజియాబాద్(భారత శక్తి)** జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) తన 20 ఏళ్ల సేవలకు గానూ అత్యున్నత గౌరవాన్ని అందుకుంది. ఉత్తరప్రదేశ్లోని ఘజియా బాద్లో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఎన్డీఆర్ఎఫ్ ప్రతిష్ఠాత్మక 'ప్రెసిడెంట్స్ కలర్' పురస్కారాన్ని స్వీకరించింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. గడిచిన రెండు దశాబ్దాలుగా నిస్వార్థ సేవతో ఎన్డీఆర్ఎఫ్ దేశ ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూరగొందని కొనియాడారు. ఈ వేడుకలో భాగంగా అమిత్ షా.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

2లో..

## బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన వి.హనుమంతరావు



**హైదరాబాద్ (భారత శక్తి)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి హనుమంతరావు గురువారం బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ సలహాదారు గా బాధ్యతలు స్వీకరించిన వి.హనుమంతరావు కు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు గా నియమితులైన సీనియర్ నాయకులు హనుమంతరావు శుభాకాంక్షలు. బలహీన వర్గాలకు న్యాయం చేయలని ముందుకు వెళ్తున్న సందర్భంలో వారి బలహీన వర్గాల సంక్షేమం కోసం

2లో..

## పద్మశ్రీ వన జీవి రామయ్య జ్ఞాపకార్థం జూన్ నెలలో స్మారక చిహ్నానికి శంకుస్థాపన

**- ఏదులాపురం ప్రజా దర్బార్లో వన జీవి రామయ్య భార్య జానమ్మకు హామీ**




**ఖమ్మం (భారత శక్తి)** ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ లోని సత్యనారాయణపురం క్లస్టర్ పరిధిలో గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించారు. ప్రజాదర్బార్ కు వచ్చిన ఏదులాపురం మున్సిపాలిటీ 15 డివిజన్లకు సంబంధించిన ప్రజలు నుంచి అప్లికేషన్లు తీసుకుని, వారి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పద్మశ్రీ వన జీవిరామయ్య జ్ఞాపకార్థం జూన్ నెలలో స్మారక చిహ్నానికి శంకుస్థాపన చేస్తాం. రామయ్య భార్య జానమ్మకు తప్పకుండా పింఛన్ అందజేస్తామని ప్రజాదర్బార్ కు వచ్చిన ఆమెకు హామీ ఇచ్చారు.ప్రకృతి ప్రేమికుడు, వన సంరక్షకుడు, వృక్షోరక్షితి రక్షిత: అని చెట్ల పెంపకం కోసం కృషి చేస్తూ 1 కోటి పైగా మొక్కలు నాటి, జీవితాన్నే చెట్ల కోసం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి పద్మశ్రీ వనజీవి రామయ్య స్మారకాన్ని ఏర్పాటు చేసుకుని వారిని గౌరవించుకోవాల్సిన అవసరం ఉంది.ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా, మున్సిపాలిటీని రెండు క్లస్టర్లుగా, కార్పొరేషన్ ను ఒక క్లస్టర్ గా ఏర్పరచుకొని పాలేరు నియోజకవర్గాన్నిమొత్తం 14 క్లస్టర్లుగా విభజించు కోవడం జరిగింది. ఇప్పటివరకు 11

2లో..

## కేటీఆర్ తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ



**హైదరాబాద్ (భారత శక్తి)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సల్ జనరల్ హిల్లరీ మెక్గీచీ తో ఈరోజు సమావేశమయ్యారు. నందినగర్ లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు మరియు వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, మరియు విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, మరియు ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై... తెలంగాణ మరియు ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జా తీయ అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాయి.భారత్ మరియు ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు మరియు సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు.

## దేశ సమగ్ర ప్రగతికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకం



**హైదరాబాద్ (భారత శక్తి)** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు చేసిన '7 విజ్ఞప్తుల'పై రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో 'జన్ భాగీదారీ' (ప్రజా భాగస్వామ్యం) అనేది అత్యంత ఆవశ్యకమని నేను స్పష్టం చేశాను. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా

2లో..

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం



**ఖమ్మం(భారత శక్తి)** రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరస రఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం

2లో..

## బండి భగీరథ్ పిటిషన్పై హైకోర్టులో విచారణ




**హైదరాబాద్ (భారత శక్తి):** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, మధ్యంతర బెయిల్పై నిర్ణయాన్ని రేపటికి (శుక్రవారం) వాయిదా వేయగా, ముందస్తు బెయిల్ పిటిషన్పై విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక అంశాలను లేవనెత్తారు. కరీంనగర్లో బాధితురాలిపై తప్పుడు కేసు నమోదు చేశారని కోర్టుకు తెలిపారు. బాధితురాలి తల్లి పేట్బషీరాబాద్ పోలీస్ స్టేషన్కు వెళ్లిన సమయంలో, కరీంనగర్

2లో..

## నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన

- పేపర్ లీక్ తో నీట్ పరీక్ష రద్దు
- పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి
- పోటీ పరీక్షలు విద్యార్థుల జీవితాలను నాశనం చేయకూడదని వ్యాఖ్య




**హైదరాబాద్ (భారత శక్తి)** నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పేపర్ లీక్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్రం పారదర్శకమైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దు నిర్ణయంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇలాంటి ఘటనలు పరీక్షల వ్యవస్థపై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు మళ్లీ ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పోటీ పరీక్షలు అనేవి విద్యార్థుల ప్రతిభకు వేదిక కావాలి తప్ప, వారి జీవితాలను నాశనం చేసే సాధనాలుగా మారకూడదని ఆయన హితవు పలికారు. ఇదే సమయంలో ఆయన రాజకీయంగా కూడా విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనల విషయంలో గత ప్రభుత్వ తీరు, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ వైఖరి ఒకేలా ఉందంటూ రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

# సైలెన్సర్ల 'సౌండ్' తీశారు!

**- మల్కాజిగిరి పోలీసుల మెరుపు దాడులు: ఒక్కరోజే 451 కేసులు**

**- రూ. 6.14 లక్షల జరిమానా.. 76 వాహనాల సైలెన్సర్లు స్పాట్‌లోనే తొలగింపు**

మల్కాజిగిరి, మే 13: భారత శక్తి బైక్ రేసింగ్ లాంటి శబ్దాలతో రోడ్లపై రచ్చ చేస్తున్న 'సైలెన్సర్' బ్యాచ్‌పై మల్కాజిగిరి పోలీసులు ఉక్కుపాదం మోపారు. సామాన్యుల చెవులకు చిల్లులు పడేలా, గుండెలు అదిరిపోయేలా వికృత శబ్దాలు చేస్తూ వాహనాలు నడిపేవారిని చెక్ పెట్టేందుకు బుధవారం కమిషనరేట్ వ్యాప్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు మార్పులు చేసిన (Modified Silencers) వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు.


TELANGANA POLICE
MALKAJGIRI POLICE COMMISSIONERATE
CRACKDOWN ON VEHICLES AGAINST EMITTING SOUND POLLUTION USING SILENCER
REPORT ON SPECIAL DRIVE CONDUCTED ON 13-05-2026 IN TRAFFIC POLICE ZONES- I & II

| S.No. | Tr.PS/Div./Zone | Emitting Sound Pollution Using Silencer: Cases | Amount (₹) | Number Of Removed Silencers |
|---|---|---|---|---|
| 1 | Malkajgiri Tr. PS | 31 | 44000 | 15 |
| 2 | Gopalpuram Tr. PS | 52 | 73000 | 1 |
| 3 | Jawaharnagar Tr. PS | 21 | 30000 | 0 |
| 4 | Begumpet Tr PS | 74 | 103000 | 6 |
| 5 | Alwal Tr PS | 41 | 52000 | 7 |
| 6 | Trimulgherry Tr PS | 76 | 98000 | 7 |
| | Zone I Total | 295 | 400000 | 36 |
| 1 | LB Nagar Tr. PS | 47 | 70000 | 11 |
| 2 | Vanasthalipuram Tr. PS | 40 | 57000 | 29 |
| 3 | Uppal Tr. PS | 28 | 35000 | 0 |
| 4 | Kushaiguda Tr. PS | 24 | 32000 | 0 |
| 5 | Ghatkesar Tr. PS | 17 | 20000 | 0 |
| | Zone II Total | 156 | 214000 | 40 |
| | Traffic Zone – I & II | 451 | 614000 | 76 |

Sections: Emitting Sound Pollution Using Silencer: CMVR 120 r/w 190(2) MVA

A TOTAL OF (451) AND (76) MODIFIED SILENCERS WERE REMOVED CASES WERE BOOKED AGAINST EMITTING SOUND POLLUTION USING SILENCER



నగరంలో 'ధ్వని' గర్జన.. పోలీసుల యాక్షన్!






మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ పర్యవేక్షణలో బుధవారం ఉదయం నుంచే పోలీసులు రంగంలోకి దిగారు. కమిషనరేట్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. దడ పుట్టించే శబ్దాలతో దూసుకుపోతున్న యువతను అడ్డుకుని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

### నివేదికలో ముఖ్యాంశాలు:

మొత్తం కేసులు: 451 వాహనాలపై కేసులు నమోదు.

వసూలైన జరిమానా: రూ. 6,14,000 (ఆరు లక్షల పద్నాలుగు వేలు).

స్పాట్ యాక్షన్: నిబంధనల విరుద్ధంగా ఉన్న 76 సైలెన్సర్లనుపి ఘటనా స్థలంలోనే విడదీసి స్వాధీనం చేసుకున్నారు.

### "ఆరోగ్యంతో చెలగాటమాడొద్దు"

"మోటారు వాహన చట్టం ప్రకారం అనుమతించిన సైలెన్సర్లను మాత్రమే వాడాలి. వికృత శబ్దాల వల్ల వృద్ధులు, రోగులు, చిన్న పిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఇది కేవలం ట్రాఫిక్ ఉల్లంఘన మాత్రమే కాదు.. ప్రజా శాంతికి భంగం కలిగించడమే. నిబంధనలు పాటించని వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి."
మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్

### ముప్పు తప్పదు.. జాగ్రత్త!

అనధికారిక సైలెన్సర్ల వల్ల వచ్చే భారీ శబ్దాలు రహదారి భద్రతకు ముప్పుగా మారుతున్నాయని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు వెంటనే తమ వాహనాలకు ఉన్న అదనపు సైలెన్సర్లను తొలగించుకోవాలని, లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

**- తిమ్మాపూర్‌లో బడి బాట కార్యక్రమం ప్రారంభం**

**- తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్**




సిద్దిపేట , మే 14 ( భారత శక్తి ) : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రయివేట్ పాఠశాలలకు బదులుగా సర్కార్ బడుల్లోకే వారి పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లితండ్రులకు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, పెంటయ్య సూచించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, పెంటయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారం అని పేర్కొంటూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి విద్య ప్రాముఖ్యతపై ప్రజలకు చైతన్యం కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలు, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై ఉపాధ్యాయులు గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వన్నెల విజయ్ కుమార్, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, కవిత, రాములు, సరిత, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు నియోజకవర్గం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించండి..

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



పటాన్‌చెరు మే 14 భారత శక్తి పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం సంగారెడ్డి లోని కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా 2025-2026 సంవత్సరానికి సంబంధించిన స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని వడకపల్లి కోట అభివృద్ధి కోసం హెచ్ఎండిఏ అధికారులతో చర్చించడం జరిగిందని.. రెవెన్యూ శాఖ తరపున ఎన్ఓసి జారీ చేయాలని కోరారు. హెచ్ఎండిఏ నిధులతో కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. ప్రజోపయోగ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ సమావేశంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆగస్టు 16న గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయం రాజ గోపురాల ప్రారంభోత్సవం..

- సాలహారం పనులను వేగవంతం చేయండి..
- గణేష్ గడ్డ దేవాలయం అభివృద్ధికి కృషి..
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..
- ఒక కోటి 50 లక్షల రూపాయల సొంత నిధులతో రాజగోపురాల నిర్మాణం..



పటాన్‌చెరు మే 14 భారత శక్తి గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయం ఆవరణలో నిర్మించిన మూడు రాజగోపురాలను ఆగస్టు 16వ తేదీన ప్రారంభించబోతున్నట్లు పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అదే రోజు ఆలయ శిఖర ప్రతిష్టాపన సైతం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం గణేష్ గడ్డ దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలక వర్గం, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, ఆలయ ధర్మకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు,అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధి పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడికి నాలుగు వైపుల నిర్మిస్తున్న రాజ గోపురాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఒక కోటి 50 లక్షల రూపాయల సొంత నిధులతో వీటిని నిర్మించినట్లు తెలిపారు. ఆలయంలో నిర్మిస్తున్న సాలహారం పనులు మందకొడిగా కొనసాగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ పురోహితులు, పాలకవర్గం సూచనలతో ప్రారంభోత్సవ తేదీని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గుడిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆలయానికి అదనపు ఆదాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీలు గాయత్రి పాండు, శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, నరసింహారెడ్డి, వెంకన్న, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు చర్యలపై ప్రచార కార్యక్రమాలు

**అమరావతి(భారత శక్తి)** గురువారం నాడు రాష్ట్ర సచివాయలంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పొదుపు చర్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. నాదేశం - నా బాధ్యత పేరుతో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కొన్నాళ్ల పాటు మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు అవుతాయి. వారానికి ఒకరోజు నో వెహికల్ డే.. ప్రత్యామ్నాయ రవాణాపై దృష్టిపెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల పర్యటనలలోనూ కాస్ట్ కటింగ్ పాటించాలి. మెజారిటీ మీటింగ్స్ వర్చువల్ గా నిర్వహించాలని ఆదేశం ఇచచారుజ ప్రెజెన్స్ అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ కల్పించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల టెంపరేచర్ ను 24 నుంచి 27 మధ్య నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఖర్చులు తగ్గించాలి . మంత్రుల నుంచి అధికారుల వరకు వాహనాల సంఖ్యను, వినియోగాన్ని తగ్గించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

## కల్లు కంపౌండ్ మాకొద్దు

**- ఖైరతాబాద్ లో మహిళల నిరసన**

**హైదరాబాద్(భారత శక్తి)** ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్ నగర్లో చింతల్ బస్తి నుండి సాయిబాబా గుడి రోడ్డులో కల్లు కాంపౌండ్ ఓపెన్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బస్తీ మహిళలు, యువకులతో కలిసి భారీ స్థాయిలో ధర్నా నిర్వహించారు. ఈ రహదారి ఆనంద్ నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రజలకు ప్రధాన మార్గం కావడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు, సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కల్లు కాంపౌండ్ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఖైరతాబాద్ నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొని స్థానిక ప్రజలకు మద్దతు తెలిపారు. అలాగే బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ చైర్మన్ విప్లవ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, నవీన్, శ్రీధర్ యాదవ్, ప్రవీణ్, శివరాజ్, నరేష్ తదితర స్థానిక నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి మెగా గ్రోత్ కారిడార్లు కీలకం

అలంపూర్ జోగులాంబ ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. సింగరేణి పరిధిలోని అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానిక ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని సూచించారు. గ్రోత్ కారిడార్లలో ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఎస్టీపీలు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలు వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుతో ఆ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని పేర్కొన్న సీఎం, విమానాశ్రయానికి అవసరమైన నీటి వనరుల ప్రణాళికలను కూడా ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కానుందని వెల్లడించారు. నగరాల్లో ఖర్చును తగ్గించేందుకు ఈవీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని, ప్రభుత్వ అవసరాల కోసం లీజుకు తీసుకునే వాహనాలు కూడా ఈవీలే ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

## బీసీ సంక్షేమ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన వి.హనుమంతరావు

వారి సలహాలు సూచనలు స్వీకరిస్తాం. బలహీన వర్గాల హక్కుల కోసం అందరం కలిసి పని చేస్తామని అన్నారు.

## ఆ యూనిఫాం కనిపిస్తే ప్రజలకు ధైర్యం

నుంచి గౌరవ వందనం స్వీకరించి, పరేడ్‌ను సమీక్షించారు. దేశవ్యాప్తంగా విపత్తు ప్రతిస్పందన, సహాయక చర్యలు, మానవతా సేవలో ఆ దళం అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. "ప్రెసిడెంట్స్ కలర్ పురస్కారం అందుకోవడం ఏ దళానికైనా గర్వకారణం. ఎన్డీఆర్ఎఫ్ తన 20 ఏళ్ల సేవ, ధైర్యం, పరాక్రమం, అంకితభావంతో ఈ గౌరవానికి సంపూర్ణంగా అర్హత సాధించింది. ఈ 20 ఏళ్ల ప్రస్థానం కేవలం విజయాలు, గుర్తింపులకు మాత్రమే పరిమితం కాలేదు. మీ కర్తవ్య దీక్షతో ఈ పురస్కారానికి మీరు న్యాయం చేశారు" అని అమిత్ షా అన్నారు. "ఎక్కడ విపత్తు జరిగినా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తమ యూనిఫాంలో అక్కడికి చేరుకోగానే, ప్రజలు ఊపిరి పీల్చుకుంటారు. తమను రక్షిస్తారనే నమ్మకం వారిలో కలుగుతుంది. కేవలం 20 ఏళ్లలోనే ఈ దళం 140 కోట్ల మంది ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంది" అని షా ప్రశంసించారు. ఎన్డీఆర్ఎఫ్ కేవలం మనుషుల ప్రాణాలనే కాకుండా, జంతువులను కూడా రక్షిస్తోందని, ప్రాణ, ఆస్తి నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గించడం తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణపై హోం మంత్రిత్వ శాఖ విస్తృతంగా పనిచేస్తోందని, వడగాల్పులు వంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 నుంచి విపత్తు నష్టాలను తగ్గించడమే కాకుండా సన్నద్ధత, ప్రతిస్పందన వ్యవస్థలను మెరుగుపరిచేందుకు కృషి జరుగుతోందన్నారు. "విపత్తుల్లో మరణాల సంఖ్యను సున్నాకు చేర్చే లక్ష్యం దిశగా మనం ఇప్పుడు అడుగులు వేయగల స్థితిలో ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏదైనా సైనిక లేదా పారామిలటరీ దళం అందించిన అసాధారణ సేవ, అంకితభావానికి గుర్తింపుగా 'నిషాన్' అని పిలిచే ఈ 'ప్రెసిడెంట్స్ కలర్' అవార్డును ప్రదానం చేస్తారు. ఈ చిహ్నాన్ని అధికారులు తమ యూనిఫాం ఎడమ చేతి స్లీవ్‌పై ధరిస్తారు. భవిష్యత్తులోనూ ఎన్డీఆర్ఎఫ్ మరింత శక్తితో దేశ ప్రజలను అన్ని రకాల విపత్తుల నుంచి రక్షిస్తుందన్న నమ్మకాన్ని అమిత్ షా వ్యక్తం చేశారు.

## దేశ సమగ్ర ప్రగతికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకం

వ్యవహరించి ఈ జాతీయ యజ్ఞంలో తమ వంతు కృషి చేయాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచనలకు ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. అవి దేశ ఆర్థిక భద్రత, సామాజిక బాధ్యత మరియు దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలకు ముడిపడి ఉన్న అంశాలు. 'వోకల్ ఫర్ లోకల్' అనే స్ఫూర్తితో.. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, మన దేశీయ ఆర్థిక వ్యవస్థను రక్షించుకోవడంతో పాటు దాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ప్రజలు అనవసర ఖర్చుల విషయంలో సంయమనం పాటించాలి. తన కాన్వాయ్లోని వాహనాల సంఖ్యను తగ్గించుకోవడం ద్వారా స్వయంగా ప్రధానమంత్రే మనందరికీ గొప్ప ఆదర్శంగా నిలిచారు. గౌరవ ప్రధాని ఇచ్చిన ఈ పిలుపును స్ఫూర్తిగా తీసుకుని, జాతి నిర్మాణంలో చురుకుగా పాల్గొనాలని తెలంగాణ ప్రజలందరికీ నేను మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. దేశ సమగ్ర ప్రగతికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. .

## పద్మశ్రీ వన జీవి రామయ్య జ్ఞాపకార్థం జూన్ నెలలో స్మారక చిహ్నానికి శంకుస్థాపన

క్లస్టర్లో ప్రజాదర్బార్ లో 16 వేల పైచిలుకు అప్లికేషన్లు వచ్చాయి. దాదాపు న్యాయమైన సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని మంత్రి అన్నారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు, ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్, అడిషనల్ కలెక్టర్, 15 వార్డుల కౌన్సిలర్లు, జిల్లాలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, క్లస్టర్ పరిధిలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారని వివరించారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసులో సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని పీపీ వాదించారు. అయితే, దీనిపై స్పందించిన హైకోర్టు.. 'ప్రతిసారీ నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడని పదే పదే చెప్పాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించింది. భగీరథ్ తరపున అడ్వకేట్ కృష్ణకాంత్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో భగీరథ్‌పై 'పోక్సో' (గూజూూ) చట్టం వర్తించదని, ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించామని తెలిపారు. యువతి మైనర్ అనే నెపంతో విచారణకు వెళ్లే సమయంలో భగీరథ్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. 'బండి సంజయ్ కుమారుడు కావడంతోనే నిరాధారంగా పోక్సో చట్టాన్ని ప్రయోగించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పొలిటికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. నిందితుడిని సామాన్యుడిలాగే పరిగణించి న్యాయం చేయాలి' అని ఆయన కోరారు. ఇక, తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని బాధితురాలి తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు రేపు మధ్యంతర బెయిల్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. కాగా, ముందస్తు బెయిల్ రావడానికి వారం సమయం పట్టేలా ఉండటంతో, ఆ వారం లోపు అరెస్టు కాకుండా ఉండేందుకు బండి భగీరథ్ న్యాయవాది మధ్యంతర బెయిల్ కోరారు. దీనిపై రేపు కోర్టు ఇచ్చే ఆదేశాలు బండి భగీరథ్‌కు కీలకం కానున్నాయి.

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం

కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

## వైఎస్ జగన్ను కలిసిన మామిళ్ళపల్లి రైతులు

**తాడేపల్లి (భారత శక్తి)** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ను మామిళ్ళపల్లి రైతులు కలిసారు. తాము పంట నిల్వ చేసుకున్న గోడౌన్పై టీడీపీ శ్రేణులు దాడి చేయడం, రాడ్లతో గోడౌన్ తాళాలు పగలగొట్టి అరాచకం చేయడం, అడ్డుకున్న తమపై దౌర్జన్యం చేసిన తీరును జగన్కు వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మిళ్ళపల్లిలో విధ్వంసం సృష్టించిన విషయాన్ని ఫోటోలు, వీడియోలుజగన్కు చూపించారు.

## అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు బీభత్సం

**- యువకుడికి గాయాలు**

**సికింద్రాబాద్ (భారత శక్తి)** సికింద్రాబాద్ రేతి ఫైల్ బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ప్రయాణికులపైకి దూసుకెళ్లడంతో వారంతా పరుగులు తీసారు. దాంతో పెను ప్రమాదం తప్పింది. . బస్సు ఢీకొట్టడంతో యువకుడు గాయాల పాలైయాడు. తోటి ప్రయాణికులు 108 కి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది యువకుడికి ప్రాథమిక చికిత్స అందించి గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## పొదుపు బాటలో 40 దేశాలు

ఒక ఏడాది పాటు ఖర్చులు తగ్గించుకోండి. బంగారం కొనుగోలు చేయకండి. విలాసవంతమైన వస్తువుల కోసం డబ్బులు వెచ్చించకండి.. ఇటీవల హైదరాబాద్ సభలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు ఇది. సహజంగానే ప్రధానమంత్రి పిలుపునకు వక్రీకరణలు చేసేస్తుంది కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు కూడా అదే పని చేసింది.. వాస్తవానికి పొదుపు అనేది మన జీవితంలో ఒక భాగం అయితే అది చాలా బాగుంటుంది.. ఉదాహరణకు మనకు జ్వరం వస్తే డాక్టర్ మాంసాహారం తినవద్దని చెబుతుంటారు. దానివల్ల ఆరోగ్యానికి ఇబ్బంది కలుగుతుందని డాక్టర్ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తారు. దానిని మనం సానుకూలంగా తీసుకోవాలి. అంతేతప్ప వ్యతిరేకంగా తీసుకుంటే మన ఆరోగ్యమే పాడవుతుంది. ఇదే విషయాన్ని నరేంద్ర మోడీ పరోక్షంగా చెప్పారు. దేశ ప్రధాని సూచించిన పొదుపు మంత్రాన్ని మనలో చాలామంది వ్యతిరేకంగా చూస్తున్నారు గాని.. మన మాదిరిగానే ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాలు పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నాయి.పశ్చిమాసియా సంక్షోభం ఇప్పుడు ప్రపంచానికి కొత్త పాఠాలు నేర్పుతోంది. అయితే దీని నుంచి తేరుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాలు పొదుపు చర్యలను పాటిస్తున్నాయి.. ఇంతకీ ఆ జాబితాలో ఎటువంటి దేశాలు ఉన్నాయంటేమన పక్కనే ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంక, పెరూ వంటి దేశాలు పాఠశాలలకు సంబంధించిన పని దినాలను పూర్తిగా తగ్గించాయి. రిమోట్ లెర్నింగ్ విధానాన్ని పెంచేశాయి.. శ్రీలంకలో అయితే బుధవారాలలో కార్యాలయాలకు సెలవులు ప్రకటిస్తున్నారు. జోర్డాన్, పాకిస్తాన్ దేశాలలో ప్రభుత్వ అధికారులకు సంబంధించిన అంతర్జాతీయ ప్రయాణాలను పూర్తిగా నిషేధించాయి. విదేశాలకు సంబంధించిన ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వడాన్ని జోర్డాన్ పూర్తిగా తగ్గించింది. ప్రభుత్వ భవనాలలో ఏసీల వినియోగాన్ని కూడా తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. బంగ్లాదేశ్లో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, మసీద్ ప్రాంతాలలో ఏసీల వినియోగాన్ని కనీసం 25ఔ లేదా అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతకు సెట్ చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శ్రీలంక, మలేషియా, థాయిలాండ్ ప్రాంతాలలో కూడా ఇటువంటి ఆదేశాలు అమలులో ఉన్నాయి.ఆస్ట్రేలియాలో ఎవరీ లిటిల్ బీట్ హెల్ప్స్ ప్రచారం మొదలైంది. ఇది ఇంధన వీడియో గాని స్వచ్ఛందంగా ప్రోత్సహిస్తూ ఉంటుంది.బ్రిటన్ దేశంలో చిన్న చిన్న వ్యాపారులు ఎలక్ట్రిక్ హీటింగ్ విధానానికి మారిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. దానికోసం ఆర్థిక సహాయం పొందడానికి బాయిలర్ ఆఫ్ గ్రేడ్ పథకాన్ని ఇటీవల మొదలుపెట్టారు.. విద్యుత్ వినియోగాన్ని తగ్గించడానికి శ్రీలంక ప్రభుత్వం బిల్ బోర్డులపై లైట్లు ఆపివేస్తోంది. ఫిలిప్పీన్స్, పాకిస్తాన్ దేశాలలో ప్రభుత్వ అధికారులకు నాలుగు రోజుల పని దినాలు అమలులో ఉన్నాయి. ఇందులో 50% రిమోట్ వర్క్ విధానాన్ని అక్కడి ప్రభుత్వాలు అందుబాటులో తీసుకొచ్చాయి. ఇండోనేషియాలో ప్రభుత్వ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు శుక్రవారం ఇంటి వద్ద నుంచి పనిచేస్తున్నారు.. మయన్మార్ దేశంలో బుధవారం రిమోట్ వర్క్ విధానం అమలులో ఉంది. వియత్నాం కూడా ఇదే విధానాన్ని అమలు చేసే పనిలో ఉంది. మరో వైపు బంగారం ఎలా అయితే మెరుస్తుందో.. దీని ఆధారంగా సాగే రంగాలు అదే స్థాయిలో దూసుకుపోతుంటాయి. అయితే బంగారం వినియోగం స్థాయిలో ఉత్పత్తి లేకపోవడంతో భారత్ లాంటి దేశం దిగుమతుల మీద ఆధారపడుతూ ఉంటుంది. ఈ దిగుమతులే ఇప్పుడు భారత్ కు గుదిబండ లాగా మారిపోయాయి.. అందువల్లే భారత ఆర్థిక వ్యవస్థ బంగారం వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. అంతర్జాతీయంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. అయినప్పటికీ బంగారం దిగుమతులు మనదేశంలో తగ్గడం లేదు. బంగారం దిగుమతికి అధికంగా ఫారెక్స్ నిల్వలను ఖర్చు చేయడం వల్ల ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో భారత్ సుంకం పెంచుతూ నిర్ణయం తీసుకుంది.సుంకం పెంచడం వల్ల మనదేశంలో ఉన్న బంగారం, వెండి ధరలు పెరుగుతాయి. పాత బంగారం రీసైక్లింగ్ కు వచ్చేస్తూ ఉంటుంది. దీనివల్ల దిగుమతులు చాలా వరకు తగ్గుతాయి. అదే సమయంలో పన్నులు అధికంగా ఉన్నప్పుడు.. అక్రమ మార్గంలో బంగారం దేశానికి దిగుమత అయ్యే ప్రమాదం లేకపోలేదు.. దీనిని ఏ విధంగా అడ్డుకుంటారనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే మన దేశంలో ఉన్న ప్రధాన విమానాశ్రయాలలో ప్రతిరోజు కస్టమ్స్ అధికారులు విదేశాల నుంచి అక్రమంగా వస్తున్న బంగారాన్ని పట్టుకుంటున్నారు. అయితే ఇప్పుడు బంగారం మీద సుంకం పెంచిన నేపథ్యంలో.. అధికారులు దాడులను మరింత తీవ్రం చేసే అవకాశం ఉంది.ఇక మనదేశంలో బంగారం మీద సుంకం విధించడం ఇదే తొలిసారి కాదు. 2022లో బంగారం మీద సుంకం 10.75 శాతం ఉండేది. అప్పుడు దానిని 15% కి పెంచారు. 2024 లో మనదేశంలో ఆభరణాల పరిశ్రమలను ప్రోత్సహించేందుకు సుంకం మొత్తాన్ని ఆరు శాతానికి తగ్గించారు.. మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం వల్ల సుంకం మొత్తాన్ని ఆరు శాతం నుంచి 15% పెంచారు. 2012 కంటే ముందు కూడా బంగారం పై దిగుమతి సుంకం ఉండేది. అయితే బంగారం విలువతో సంబంధం ఉండేది కాదు. 10 గ్రాములకు కేవలం 300 రూపాయలు చొప్పున సుంకం వసూలు చేసేవారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యాట్ అనే విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది.

అప్పుడు బంగారం విలువలో రెండు శాతం కస్టమ్స్ టాక్స్ విధించేవారు. దీంతో నాడు బంగారం మీద ఒక శాతంగా ఉన్న దిగుమతి సుంకం డబుల్ అయింది. బడ్జెట్లో అయితే దానిని నాలుగు శాతం పెంచేశారు.2013లో రూపాయి విలువ దారుణంగా పతనమైంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు దారుణంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ సంవత్సరం ప్రభుత్వం ఏకంగా మూడుసార్లు సుంకాన్ని పెంచేసింది. 2013లో జనవరిలో నాలుగు శాతం నుంచి ఆరు శాతానికి పెంచింది. జూన్ నెలలో ఏకంగా 6 నుంచి 8 శాతానికి పెంచింది. ఆగస్టులలో 8 నుంచి 10 శాతానికి పెంచింది. 2014 అంటే నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2018 వరకు దాదాపు 10 శాతం దిగుమతి సుంకం మాత్రమే వసూలు చేసేవారు. 2019లో 12.5% పెంచేశారు. 2021 కేంద్ర బడ్జెట్లో 12.5% నుంచి 10.75% తగ్గించారు. తాజాగా 15% సుంకం పెంచిన నేపథ్యంలో.. దాని విలువలను కేంద్రం బయటపెట్టింది. 10 శాతాన్ని ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీగా.. ఐదు శాతం అగ్రికల్చర్ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ సెస్ గా ప్రకటించింది.

## రాజంపేట మండలంలో జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే14:** రాజంపేట మండలంలో నిర్వహిస్తున్న సెన్సస్--2027 జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు, డేటా సేకరణ ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి ఇంటిని కవర్ చేస్తూ ఎటువంటి కుటుంబం మిగలకుండా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి సహకారం పొందాలని తెలిపారు.జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు కీలకమని పేర్కొన్న కలెక్టర్, అధికారులు నిర్దేశిత గడువులోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సర్వే చేస్తున్న ఇంటిని దగ్గరుండి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

**- టీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎనగందుల కొమురయ్య**



ములుగు జిల్లా ప్రతినిధి, మే14 (భారత శక్తి): ములుగు జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో నేడు నిర్వహించనున్న జిల్లా మహాసభను విజయవంతం చేయాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎలగందుల కొమురయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.దాదాపు 65 ఏండ్ల ఏపీయూడబ్ల్యూజే ఇచ్చిన స్ఫూర్తితో నిరంతరం వర్కింగ్ జర్నలిస్టులకు సేవలందించే లక్ష్యంతో టీయూడబ్ల్యూజే 2014న ఆవిర్భవించింది. ఏప్రిల్ 19 2017 లో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ లోని లలిత కళాతోరణం లో 6వేల మంది వర్కింగ్ జర్నలిస్టులతో టీయూడబ్ల్యూజే ప్రథమ మహాసభను నిర్వహించుకోవడం జరిగింది. 2019లో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ద్వితీయ మహాసభ జరిగింది. జూన్ 19,20- 2024లో ఖమ్మంలోని కామ్రేడ్ అమరనాథ్ హాల్లో (హరి కన్వెన్షన్) టియుడబ్ల్యూజే తృతీయ మహాసభను ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. అదే విధంగా జర్నలిస్టుల హక్కుల సాధనలో పాత్రికేయుల సంక్షేమంలో అందరం ఐక్యతగా టీయూడబ్ల్యూజే ములుగు జిల్లా యూనియన్ ద్వారా పనిచేద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆశ చూపి మోసం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు ఇప్పుడున్న ప్రభుత్వంతో కొట్లాడి, టీయూడబ్ల్యూజే యూనియన్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. టీయూడబ్ల్యూజే(ఐజేయు) లో జిల్లా కేంద్రం తో పాటు అన్ని మండలాల్లోని మీడియాలో పాత్రికేయులుగా పని చేస్తున్న గత జిల్లా బాడీతో పాటు గతంలో ఐజేయు లో పనిచేసిన సీనియర్, జూనియర్ నాయకులు, నూతన సభ్యులు, యూనియన్ అభిమానులు ప్రతి ఒక్కరు మహాసభకు కృషి చేయాలని, టీయూడబ్ల్యూజే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు ఎన్ శేఖర్, ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు ల ఆధ్వర్యంలో నేడు జరగబోయే ములుగు జిల్లా మహాసభకు హాజరై విజయవంతం చేయాలని ములుగు జిల్లా శాఖ యూనియన్ తరపున మీడియా మిత్రులను ఆయన కోరారు.

## ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం

**- వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం**

**- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి**



భారతశక్తి ప్రతినిధి మే 14 :తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి నాణ్యమైన విద్యను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి విజ్ఞప్తి చేశారు. కాశి నాయన మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెడ్డి కొట్టాల నందు ఉపాధ్యాయులతో కలిసి బడి ఈడు పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థులను ఊరి బడికి పంపాలని ప్రభుత్వ పాఠశాల గొప్పతనం గురించి పరిమళ జ్యోతి రాసిన , పాడిన ప్రచార గీతం ను రెడ్డి కొట్టాల గ్రామస్తులందరికీ వినిపిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిమళ జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్కూల్ కు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, అనుభవం గల ఉపాధ్యాయులు ఉన్నారని ఐ.ఎఫ్.పి ప్యానెల్స్, డిజిటల్ బోధన, ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాలు వంటి విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. పేదింటి బిడ్డలను ప్రభుత్వ పాఠశాలకు పంపితే ఆ విద్యార్థికి అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. అమ్మలాంటి శిక్షణ, నాన్న లాంటి రక్షణ మన ప్రభుత్వ బడులలోనే దొరుకుతుంది. పదవ తరగతి ఫలితాలలో పరిమళ జ్యోతి వద్ద విద్యను అభ్యసించిన పంగా భవ్య శ్రీ 590 మార్కులు సాధించి పోరుమామిళ్ల పట్టణంలో రెండవ స్థానాన్ని, కేతగాని నవ్య శ్రీ పోరుమామిళ్ల కస్తూర్బా గాంధీ పాఠశాలలో టాపర్ గా నిలవడం సగర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రతిరోజు బడికి పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పరిమళ జ్యోతి పిలుపునిచ్చారు. రెడ్డి కొట్టాల గ్రామంలోని తల్లిదండ్రులు ప్రవేటు పాఠశాలలకు పంపే తమ విద్యార్థులను ఊరి బడిలో చేర్పించడానికి ముందుకు వచ్చారు.

## నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలి

**రాజన్న సిరిసిల్ల** జిల్లాలో నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎఫ్ సీఐ, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎస్ డబ్ల్యూసీ,నాబార్డ్, పరిశ్రమల శాఖ, ఎల్ డీ ఎం తహసీల్దార్లు, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.ఎఫ్ సీఐ, ఎస్ డబ్ల్యూసీ, మార్క్ ఫెడ్ తదితర శాఖల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. స్థలాలు గుర్తించాలని, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మార్క్ ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, నాబార్డ్ డీడీఎం దిలీప్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు,ఎస్ డబ్ల్యూసీ,ఎఫ్ సీ ఐ అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే14: యాసంగి 2025-26 సీజన్లో జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్ , జిల్లా సహకార అధికారి (డిసిఓ), జిల్లా మార్కెటింగ్ అధికారి (డిఎమ్ఓ), డి.ఎం. మార్క్ ఫెడ్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (టీజిఎస్ డబ్ల్యూ సీ) రీజినల్ మేనేజర్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తీసుకువస్తున్న మొక్కజొన్నను వేగవంతంగా కొనుగోలు చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార అధికారి మండలాల వారీగా కొనుగోలు చేయాల్సిన మొక్కజొన్న నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సొసైటీ స్థాయిలో హమాలీల సంఖ్యను పెంచి, కొనుగోలు చేసిన మొక్కజొన్నను ప్రతిరోజూ గిడ్డంగులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజినల్ మేనేజర్కు ఇప్పటికే గుర్తించిన గోడౌన్లను వెంటనే స్వాధీనం చేసుకొని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే అన్లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల సంఖ్యను పెంచి, ప్రతిరోజూ వాహనాలు పూర్తిస్థాయిలో అన్లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.లారీ రవాణా కాంట్రాక్టర్ అవసరమైన లారీల సంఖ్యను పెంచి, మొక్కజొన్న రవాణా ప్రక్రియ ఎటువంటి ఆలస్యం లేకుండా నిరంతరాయంగా కొనసాగించేలా చూడాలని సూచించారు.అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం గల గోడౌన్లను గుర్తించి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అలాగే డి.ఎం. మార్క్ ఫెడ్, అదనపు కలెక్టర్ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## జనగణన-2027 ఇంటి గణన, ఇంటి జాబితా తయారీపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే14: జనగణన- 2027లో భాగంగా మొదటి దశలో చేపడుతున్న ఇంటి గణన, ఇంటి జాబితా తయారీ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడిఓలు), మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నియమించబడిన ఎన్యూమరేటర్లు అందరూ తమకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ (హెచ్ఎల్ బిఎస్) పరిధిలో హెచ్ఎల్ఓ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయాలని సూచించారు.క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అధికారులు, బిల్ కలెక్టర్లు ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో టామ్టామ్, శానిటేషన్ వాహనాల ద్వారా జనగణనపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ), మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు.ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వివరాల సేకరణ చేపట్టాలని సూచించారు.జనగణనలో భాగంగా ప్రజలు ఎన్యూమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి, దేశ అభివృద్ధికి అవసరమైన గణాంకాల సేకరణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ చేసిన వార్డు కౌన్సిలర్లు



**జగిత్యాల, మే 14 (భారత శక్తి ప్రతినిధి):** ధర్మపురి పట్టణంలోని 13వ మరియు 12వ వార్డులకు చెందిన అంగన్వాడీ కేంద్రాల్లో 13వ వార్డు కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్, 12వ వార్డు కౌన్సిలర్ చుక్క సంధ్య భీమరాజ్ పాల్గొని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## నూతన డిఆర్ఓ ను కలిసిన టి జి ఓ లు



హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)మే14 హనుమకొండ జిల్లా నూతన డి.ఆర్.ఓ. గా బాధ్యతలు స్వీకరించిన కె. శ్రీనివాస్ ని ఐడిఓసి లోని వారి చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కతో హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్ మోహన్ రావు, జిల్లా అధ్యక్షులు ఆకవరం శ్రీనివాస్ కుమార్, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, వరంగల్ జిల్లా కార్యదర్శి ఫణి కుమార్, కోల రాజేష్ కుమార్, మాధవరెడ్డి, రవి ప్రసాద్, సురేష్ కుమార్, రవీందర్ లు పాల్గొన్నారు.

## రైతులు నాణ్యత గల విత్తనాలను ఎంచుకొని అధికదిగుబడి పొందాలి.

**- ఏ ఎస్ ఎం మక్బుల్.**




రేగొండ,మే14 (భారత శక్తి) రైతులు ఖరీఫ్ సీజన్లో నాణ్యమైన మిరప విత్తనాల రకాలను ఎంచుకొని అధిక దిగుబడి పొందేందుకే విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందని స్టార్ ఫీల్డ్ క్రాప్ సైన్స్ కంపెనీ వారి షార్ప్ వన్ ఎండి మక్బూల్ కోరారు. విత్తనాల సరఫరా లో భాగంగా గురువారం రేగొండ మండలంలో స్టార్ ఫీల్డ్ క్రాప్ సెన్స్ కంపెనీ తరపున ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏరియా సేల్స్ మేనేజర్ మక్బుల్ రైతులతో సమావేశమై విత్తన పని విధానాలను వివరించారు. స్టార్ ఫీల్డ్ క్రాప్ సైన్స్ వారి మిరప, విత్తనాల దిగుబడిపై రైతులకు విపులంగా వివరించారు. మిరప, పంటలకు వైరస్ రసం పీల్చు పురుగు ల భారీ నుంచి తట్టుకుంటాయని, మిరప లో అధిక కారం గుణం కలిగి, మంచి రంగు, అధిక బరువు గల కాయలు కాస్తుంటాయని, చక్కని కాపు, కోయుటకు సులభంగా, పెట్టుబడికి తగ్గ ఫలితం ఇస్తాయి అన్నారు.ఈ కంపెనీని రైతులు ఆదరించాలని సేల్స్ మేనేజర్ మక్బుల్ కోరారు. ఈ కార్యక్రమంలో పలు రైతులతో పాటు టి ఎస్ ఎం డి రాజు, వరంగల్ డిస్ట్రిబ్యూటర్ భారత్ సీడ్స్ కంపెనీ సిబ్బంది మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## KK-5 గని లోపలికి దిగిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**- కార్మికులు పని చేసే పని ప్రదేశాలను పరిశీలించి కార్మికులతో ముచ్చటించిన మంత్రి.**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 14 ( భారత శక్తి): మందమర్రిలోని కేకే సింగరేణి బొగ్గు బావిని బుధవారం రోజున రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సందర్శించి,ఎన5 గని లోపలికి దిగి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ,కార్మికులందరూ ప్రేక్స్ పై ఇన్ కాం ట్యాక్స్ ,సొంతింటి కల సమస్య లను పరిష్కరించాలని గనిలోపల కార్మికులు కోరుతున్నారు అని అన్నారు .గత ప్రభుత్వం హయంలో సింగరేణి సంస్థను పట్టించుకోలే,ఆర్థికంగా వాడుకున్నారె తప్ప ఒక్క గని నీ కూడా ప్రారంభించలేదు.కొత్త గనులు,కొత్త ఉద్యోగాలు తీసుకొచ్చి సింగరేణీ కి పూర్వ వైభవం తీసుకువచ్చేలా.ప్రజా పాలన ప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు.సింగరేణి సంస్థ కార్మికులకు రక్షణ కల్పిస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలి అని తెలిపారు.

## సాఫ్ట్ బాల్ క్రీడకు స్లగ్గర్ వితరణ.




హనుమకొండ (భారత శక్తి) మే 14 హన్మకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో జరుగుతున్న వేసవి క్రీడా శిబిరంలో భాగంగా సాఫ్ట్ జిల్లా సెక్రటరీ రాజేందర్ 45 వేల రూపాయల విలువగల క్రీడా పరికరం కోచ్ వినయ్ కుమార్ కు గురువారం అందజేశారు . ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వానికి చదువులో ఎదుగుదలకు ఉన్నత స్థాయి లో రాణించడానికి క్రీడలు సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. సాఫ్ట్ బాల్ క్రీడా అభివృద్ధికి గాను ఎల్లవేళలా తోడ్పడుతానని ఈ సందర్భంగా తెలిపారు., మునుముందు అంతర్జాతీయ స్థాయిలో మన వరంగల్ క్రీడాకారులు రాణించాలని నేను కోరుకుంటున్నాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సాంబమూర్తి , క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ లోపంతో నిలువు దోపిడీ.!

-వంట గ్యాస్ పక్కదారి పడుతున్న చలనం లేదా.?

-గ్యాస్ కోసం పడరానిపాట్లు పడుతున్న వినియోగదారులు

-సామాన్యులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్న వైనం

-బుకింగ్ లేకుండానే ఫాస్ట్ ఫుడ్, హోటళ్ళు, రెస్టారెంట్లకు సరఫరా.!

-కొరత లేదన్న ప్రకటనలతో చేతులు దులిపేసుకుంటున్న అధికారులు

-బ్లాక్ మార్కెట్ కు తరలిపోతున్న కట్టడి చేసే నాధుడు కరువాయే.!

-అక్రమాలకు చెక్ పెట్టాల్సిన సార్లు కాసుల కక్కుర్తితో మిన్నకుండిన వైనం

-పబ్బం గడుపుకునేందుకు పాస్ట్ ఫుడ్ నిర్వహాకుడికి కొంతమంది ఉచిత సలహాలు

-విలేకరిని భయబ్రాంతులకు గురిచేస్తున్న వైనం







భద్రాద్రి జిల్లా బ్యూరో, మే14 (భారతశక్తి): అధికారుల అచేతన్వం గ్యాస్ ఏజెన్సీలకు వరంగా మారిందా.? అంటే పరిస్థితులు అవుననే చెబుతున్నాయి. గ్యాస్ కృత్రిమ కొరత సృష్టించడంలోనూ, అందరిలో ఆందోళన కలిగించడంలోనూ గ్యాస్ ఏజెన్సీలు సఫలీకృత మయ్యాయన్న వాదనలు మిన్నంటాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలో ఇతర మండలాలకు చెందిన గ్యాస్ ఏజెన్సీలు అక్రమాలకు ఆజ్యంపోస్తున్నారు. పౌరసరఫరాల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ సిలెండర్లు. బ్లాక్ మార్కెట్ ద్వారా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో దర్శనమిస్తున్నాయి. గృహ వినియోగదారులు బుకింగ్ చేసి ఓటిపిలు చెప్పిన సిలెండర్లు అందనిద్రాక్ష గా మారి గ్యాస్ ఏజెన్సీలు ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ల చుట్టూ కాళ్ళ చెప్పులు అరిగేలా తిప్పించుకుంటున్నారు. బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు వచ్చిన డొమెస్టిక్ సిలెండర్లు వాళ్ళకు సరఫరా చేయకుండా రూ. 2500 నుండి రూ.3 వేలకు బ్లాక్ మార్కెట్లో విక్రయించి కాసులు గడిస్తున్నారు. గృహ వినియోగదారులకు మాత్రం స్టాక్ లేదు వచ్చిన సిలెండర్లు అయిపోయాయి అంటూ కుంటి సాకులు చెపుతూ రోజుల తరబడి తిప్పించుకుంటున్నారు. దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక గృహ వినియోగదారులు పడరాని కష్టాలు పడుతున్నారు.

### మీడియాను అవహేళనగా మాట్లాడుతున్న ఫాస్టఫుడ్ నిర్వాహకుడు

మణుగూరు పట్టణంలోని పూల మార్కెట్ సమీపంలోని శ్రీ కనకదుర్గ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో డొమెస్టిక్ సిలెండర్ వినియోగిస్తున్నారని పత్రికలో 'బ్లాక్ మార్కెట్లో వంట గ్యాస్' కథనం వ్రాస్తే ఆ విలేకరిపై ఫాస్టఫుడ్ నిర్వాహకులు దుష్ప్రచారం చేస్తున్నారు. అంతే కాకుండా మీడియాను అవహేళన చేస్తూ చులకన భావంతో మాట్లాడుతున్నారు. అక్రమంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో కళ్ళ ముందు డొమెస్టిక్ సిలెండర్ వినియోగిస్తున్నా.. అది సక్రమమే అంటూ కొంతమంది జోగుడు బ్యాచ్ అడుగులో మడుగులు వత్తుతూ వారి వ్యక్తిగత అవసరాలు తీర్చుకుంటూ చులకన భావంగా మాట్లాడుతున్నారు. కందకు లేని దురద కత్తిపీటకెందుకు అన్న చందంగా పబ్బం గడుపుకునేందుకు జోగుడు బ్యాచ్ తయారైందని పలువురు బాహాటంగా చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా విలేఖరి పై తప్పుడు ప్రచారం చేసి మీడియా అంతా ఇంతే అంటూ వక్రీకరిస్తూ అవహేళన చేస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఫొటోతో కథనం వచ్చిందని మరో సీనియర్ విలేఖరికి అతనితో మాట్లాడమని చెప్పి శునకానందం పొందుతూ మేకపోతు గాంభిర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అక్రమంగా డొమెస్టిక్ సిలెండర్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో వినియోగిస్తున్న విషయాన్ని సదరు విలేఖరి బహిర్గతం చేస్తే ఆ విలేఖరిపై కేసులు నమోదు చేయించాలని కొంతమంది ఉచిత సలహాలు, కుట్రలు చేస్తూ వ్యక్తిగత పబ్బం గడుపుకుంటూ.. సదరు విలేఖరిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

### కృత్రిమ కొరత సృష్టిస్తున్న ఏజెన్సీలు


కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్న ఏజెన్సీలపై చర్యలకు ఉపక్రమించాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. దురదృష్టమేంటంటే ఇపుడున్న పరిస్థితుల్లో మణుగూరు మండలానికి దిగుమతి అవుతున్న గ్యాస్ సిలెండర్లు ఎన్ని.? వినియోగదారులకు చేరుతున్నవి ఎన్ని.? అన్న విషయాన్ని ఆడిట్ చేసే నాధుడే కరువయ్యారు. దీంతో కృత్రిమ కొరత సృష్టిస్తోన్న ఏజెన్సీలు వెండర్ల సహాయంతో తమకు నచ్చిన ధరలకు సిలెండర్లను విక్రయిస్తున్న పరిస్థితి. గ్యాస్ ఏజెన్సీ లకు అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లక్షలు గడిస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్యాస్ కొరత లేదని ఉత్తుత్తి ప్రకటనలు జారీ చేయడం మానుకొని సాధారణ పరిస్థితుల్లో మాదిరి గానే గ్యాస్ సిలెండర్లు సరఫరా అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అదే సమయంలో నిజంగా గ్యాస్ కొరత వుంటే చిత్తశుద్ధితో ఆ వాస్తవాన్ని ప్రజలకు చేరవేసి పరిస్థితిని అదుపులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

# రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**- ధాన్యం బస్తాల అన్లోడ్, మిల్లింగ్ ప్రక్రియల పరిశీలన**



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి మే 14 : జోగిపేట లోని రామకృష్ణ రైస్ మిల్లు, , పుల్కల్ మండలం కోదూరు లోని ఎస్ బి ఎం రైస్ మిల్లును అడిషనల్ కలెక్టర్ పాండు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని అన్లోడ్ చేసుకున్నారా, ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని ఆరా తీశారు. ఎక్కువగా ఏ రకం ధాన్యం వస్తోందని వివరాలు సేకరించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని వెంటదివెంట అన్లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే అకాల వర్షాల వల్ల తడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు.అవసరమైతే ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ చేయాలని హితవు పలికారు.ధాన్యం నిల్వ చేసేందుకు సమీపంలోని రైతు వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం బస్తాలను అన్లోడ్ చేసుకునే విషయంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు.

# కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నీట్ పరీక్షా పేపర్ లీకేజ్

**- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 14 ( భారత శక్తి ) : కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నీట్ పరీక్షా పేపర్ లీకేజ్ ను నిరసిస్తూ బుధవారం రోజున మంచిర్యాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు ఐబీ చౌరస్తా వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ మాట్లాడుతూ పేపర్ లీక్ విషయంలో మోదీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్య పూరితంగా వ్యాహరిస్తుందని అన్నారు. నీట్ పరీక్షలు రద్దు చేయడం సిగ్గు చేయడానికి అన్నారు,అదేవిధంగా పేపర్ లీక్ చేసిన దోషులను వెంటనే చట్ట పరంగా శిక్షించి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం చేయవద్దని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,మాజీ కౌన్సిలర్లు, సర్పంచ్లు , ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ మండల ,పట్టణ అధ్యక్షులు , నాయకులు, మహిళా నాయకురాలు,యువజన కాంగ్రెస్ నాయకులు, NSUI నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



## ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యే జి ఎస్ ఆర్



భూపాలపల్లి జిల్లా ప్రతినిధి మే 14 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం,.ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, జూన్ 2న నిర్వహించనున్న మాస్ గృహప్రవేశాలు, ఇల్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల అంశాలపై గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్, ఎంపీడీవోలు తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇండ్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జూన్ 2న మాస్ ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలు నిర్వహించాల్సి ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. అలాగే గృహ నిర్మాణ శాఖకు చెల్లించాల్సిన ఉపాధి హామీ పథకం నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని డిఆర్డీఓకు సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, గృహ నిర్మాణ శాఖ డిఈ శ్రీకాంత్, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖ ఏఈలు డీఈలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పశువుల రవాణాపై పటిష్ట నిఘా కొనసాగుతోంది : మంచిర్యాల డీసీపీ

**- గూడెం చెక్‌పోస్టులను తనిఖీ**



మంచిర్యాల జిల్లా ప్రతినిది మే 14 ( భారత శక్తి) : బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మంచిర్యాల జోన్‌లో గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను బుధవారం రోజున మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు.చెక్‌పోస్టుల వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించిన డీసీపీ, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని,సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు.ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.అక్రమ పశువుల రవాణాపై పటిష్ట నిఘా కొనసాగుతోందని, నిబంధనలకు విరుద్ధంగా జరిగే రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని,అనుమానాస్పద రవాణా గమనించినట్లయితే స్థానిక పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని,భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి,ఎస్సై సురేష్,దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## కోటంచ చెరువు అక్రమ మట్టి దందాను అరికట్టాలి డివైఎఫ్ ఐ అధ్యక్షులు తిరుపతి



రేగొండ మే 14 (భారత్ శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ: మండలంలోని కోటంచ చెరువు నుంచి తీస్తున్న అక్రమ మట్టి దందాను వారి కట్టాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. తిరుపతి డిమాండ్ చేశారు. మండలంలోని వేసవిలో పలు గ్రామాల్లో చెరువుల్లో కుంటలు లో ఏదేచ్ఛగా మట్టిదందా జరుగుతున్న ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని, ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, కొంతమంది అక్రమ మట్టి దందా వ్యాపారులు దీన్ని ఆసరాగా చేసుకొని ఇష్టానుసారంగా చెరువులు కుంటల నుంచి అనుమతి లేకుండానే మట్టిని తీస్తూ అధిక ధరలకు అమ్ముకుంటున్నారని, ఇందులో అధికారులకు కూడా వాటాలు వెందుతున్నాయని, అందువల్లే స్పందించడం లేదని, ఏదైనా మట్టి తీయాలంటే ప్రభుత్వ అనుమతి పొందాలని నిబంధనలు ఉన్నప్పటికీ , అవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా, పగటి , రాత్రి వేళలో మట్టిని తీస్తూ అమ్ముకుంటున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని తిరుపతి డిమాండ్ చేశారు.

## మహిళా మండలి ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు



ఎల్బీనగర్, మే 14 (భారత శక్తి): సరూర్నగర్ డివిజన్లోని వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ వెంకటేశ్వర దేవాలయంలోని పద్మావతి కళ్యాణ మండపంలో కాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమూర్తులకు పాద పూజ నిర్వహించి సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి అనంతరం తంబోలా లాంటి ఆటలు ఆడి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఆండాళ్, నీరజమ్మ, పద్మ, రమాదేవి, వెంకటసుబ్బమ్మ, ధనలక్ష్మి , అనురాధ, అరుణ, రాజ్యలక్ష్మి, రజని ,వసంతలక్ష్మి ,శ్రీ వేణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో జిల్లా కలెక్టర్ సమావేశం





కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే14: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో గురువారం రాజంపేట మండలంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజంపేట మండలంలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ శాలువాలతో సన్మానించి అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో క్లాస్ రూమ్‌ల నిర్మాణ అవసరాన్ని , మారమ్మత్తుల అదనపు తరగతి గదుల నిర్మాణానికి సంబంధించి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఎఈ పిఆర్ ను వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామ సర్పంచ్ గ్రామపంచాయతీ నిధుల నుంచి 50 శాతం నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, మిగితా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యా వారోత్సవాల ద్వారా విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడం, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రాజు, ఎమ్మార్వో, హెచ్ ఎమ్ ఈశ్వర్, సర్పంచ్ శ్రీకాంత్, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి పూర్వ వైభవం తీసుకొస్తాం

**- మంత్రి వివేక్ వెంకటస్వామి**

**- కొత్త గనులు - కొత్త ఉద్యోగాలే ప్రభుత్వ లక్ష్యం**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 14 (భారత శక్తి) : సింగరేణి కార్మికులతో కాకా కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు కార్మిక గనుల శాఖ మంత్రి డా. జి వివేక్ వెంకటస్వామి అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు, అధికారులు సమిష్టిగా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోనీ మందమర్రి సింగరేణి ఏరియాలోని కేకే-5 గని లో బుధవారం రోజున పర్యటించి సింగరేణి సంస్థకు రూ.400 కోట్ల నిధులు ఇప్పించి లక్ష ఉద్యోగాలను కాపాడిన వ్యక్తి కాకా వెంకటస్వామి అని మంత్రి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కోల్ బ్లాక్ టెండర్లలో సింగరేణి సంస్థ పాల్గొనేలా చర్యలు తీసుకుంటోందన్నారు.ప్రేక్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు రూ.10 వేల పెన్షన్ వచ్చేలా ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.కొత్త గనులు ప్రారంభమైతే కొత్త ఉద్యోగాలు వస్తాయని, ఆర్కేపీ ఓపెన్‌కాస్ట్ ఫేజ్-2 ద్వారా సుమారు 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు

ఫారెస్ట్ అనుమతులు వచ్చిన వెంటనే గనిని ప్రారంభిస్తామని వెల్లడించారు.కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల పెంపు అంశాన్ని ముఖ్యమంత్రి అధ్యక్షతన త్వరలో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మందమర్రి సింగరేణి ఏరియాలోని కేకే-5 గనిపై శ్రమశక్తి అవార్డు గ్రహీత ఏడుకోల పవన్ కుమార్ సన్మాన కార్యక్రమానికి మంత్రి వర్యులు ముఖ్య అతిథిగా హాజరై శ్రమశక్తి అవార్డు గ్రహీతలు పవన్ కుమార్, పుల్లూరి లక్ష్మణ్‌లను మంత్రి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.అనంతరం కార్మికులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

**-పశువుల తరలింపులో నిబంధనలు పాటించకుంటే చర్యలు -శాంతి సమావేశంలో డిఎస్పీ రవీందర్ రెడ్డి**






మణుగూరు మే 14 (భారతశక్తి): బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపు కోవాలని మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మణుగూరు మండల కేంద్రంలోని డిఎస్పీ కార్యాలయంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ

మణుగూరు సబ్ డివిజన్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నందుకు అన్ని మతాల పెద్దలను, ప్రజలను అభినందించారు. బక్రీద్ పండుగ పురస్కరించుకొని గోవులను, లేగదూడలను అక్రమ రవాణా చేయొద్దని సూచించారు. పశువులను ఒకచోట నుంచి మరొక చోటుకు తరలించేటప్పుడు సంబంధిత పశువుల డాక్టర్ ధ్రువపత్రం తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్యప్రచారాలను నమ్మవద్దన్నారు. అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులతో సహకరించాలని ఆయన సూచించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులపై, వారి కదలికలపై నిఘా పెట్టామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ మణుగూరు పట్టణ ప్రజలు ఎల్లప్పుడూ శాంతిని కోరుకుంటారని, ఇప్పటి వరకు ఎక్కడ శాంతిభద్రతలకు విఘాతం కలుగలేదన్నారు. అన్ని పండుగలు జరుపుకొన్నంటే ఈ పండుగను కూడా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పశువుల డాక్టర్, మణుగూరు సిఐ నాగబాబు, ఈ బయ్యారం సిఐ వెంకటేశ్వర్లు, అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి, ఎస్సై నగేష్ కుమార్, ముస్లిం మత పెద్దలు, బిజేపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిస్ట్ ఫ్యాషన్ క్రికెట్ లీగ్ కు తేదీలు ఖరారు..

**ఆరు టీములతో జూన్ 9, 10 తేదీలలో బరిలో దిగనున్న కళాకారులు...**



హైదరాబాద్ : భారత శక్తి (మే 14) హైదరాబాద్ బిఎస్ఆర్ క్రికెట్ గ్రౌండ్ లో కళాకారులు తొలిసారి నిర్వహిస్తున్న ఆర్టిస్ట్ ఫ్యాషన్ క్రికెట్ లీకు జూన్ 9, 10 తేదీలు ఖరారు అయినాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి వస్తున్న సింగర్స్, టీవీ, స్టేజ్ మరియు వివిధ రంగాల కళాకారులకు ఒకే వేదికగా ఈ క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది.

ఈ టోర్నమెంట్లో ఆరు టీంలు పాల్గొంటున్నట్లు టీం ఆర్గనైజేషన్స్ టీమ్ తెలిపారు.

## కార్పొరేషన్ల చైర్మన్లకు శివచరణ్ రెడ్డి శుభాకాంక్షలు



హైదరాబాద్: మే 14 భారత శక్తి తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య (షీప్స్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఛైర్మన్‌గా నియమితులైన 'సరిత తిరుపతయ్య, రజక సహకార సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన దాసరిరాజు అజయ్ కుమార్,బుధవారం తమ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇరువురు ఛైర్మన్లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

### సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి

తమ పదవీ కాలంలో ఆయా సామాజిక వర్గాల సంక్షేమానికి, కార్పొరేషన్ల బలోపేతానికి వారు నిరంతరం కృషి చేయాలని శివచరణ్ రెడ్డి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ వికాస్ మహతోను

## - కలిసిన మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి




హయత్‌నగర్, మే 14: భారత శక్తి ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన వికాస్ మహతోను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకలగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రజా సమస్యలే ప్రాధాన్యత కావాలి

జోన్ పరిధిలో పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి కోరారు. ముఖ్యంగా హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

### సమిష్టి కృషితో అభివృద్ధి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. జోనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందచారి తదితరులు ఉన్నారు.

## రోడ్డు పనుల్లో జాప్యంపై ఆగ్రహం

**నెలలు గడుస్తున్నా పూర్తికాని పనులు**

**ప్రజల ఇబ్బందులు పట్టవా? అధికారులపై**

**మాజీ కార్పొరేటర్ మండిపాటు**



ఎల్బీనగర్, మే 14: భారత శక్తి బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ గణేష్ ఆలయం సమీపంలో సాగుతున్న రోడ్డు పనుల జాప్యంపై మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు.

### నెలలు గడుస్తున్నా పట్టించుకోరా?

రోడ్డు పనులను ప్రారంభించి నెలలు గడుస్తున్నా, నేటికీ పూర్తి చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు. పనులు అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఆయన, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

**నాణ్యత పాటించాలి**

కేవలం వేగమే కాకుండా, రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కూడా పాటించాలని అధికారులకు సూచించారు. కాలయాపన చేయకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు ముగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్, సుధీర్ కుమార్, చిన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


## సంగారెడ్డిలో 650 కోట్ల పెట్టుబడితో

# 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీ

**- నేడు శంకుస్థాపన చేయనున్న పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**- జగ్గారెడ్డి,నిర్మల కృషితో ముందుకు వచ్చిన ప్రాజెక్ట్**

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి మే 14 : సంగారెడ్డి నియోజకవర్గంలో మహిళలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు



కల్పించే మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. కే జే ఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలంతొగర్‌పల్లి-అలియాబాద్ ప్రాంతంలో "కేజేఎస్ యూనిట్--××" పేరుతో సమగ్ర ఆహార ౘ పానీయాల తయారీ కేంద్రానికి నేడు మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి లు భూమిపూజ చేయనున్నారు. సుమారు రూ.650 కోట్ల



పెట్టుబడితో 44 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 1,500 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం పాశమైలారం యూనిట్‌లోనే వందలాది మహిళలు పనిచేస్తుండటం విశేషం.సంగారెడ్డి నియోజకవర్గం లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇక్కడే పరిశ్రమ నెలకొల్పాలని టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి , టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి లు కోరారని, వారి కృషి తోనే పరిశ్రమ స్థాపన కు ముందుకు వచ్చామని పరిశ్రమ ప్రతినిధులు తెలియజేశారు.తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రోత్సాహంతో, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి ల




సహకారంతో పరిశ్రమ స్థాపనకు వేగం చేకూరిందన్నారు.

**- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**




సంగారెడ్డి నియోజకవర్గం లో 1500 మహిళలకు ఈ పరిశ్రమ ద్వారా ఉపాధి లభిస్తుండటం సంతోషంగా ఉంది. ఒక మహిళగా ఇది నాకు గర్వ కారణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకట స్వామి ల సహకారం వల్లనే ఇది సాధ్యమైంది.

## తారా ప్రభుత్వ కళాశాలలో

# విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

**- ఉచిత వైద్య, డెంటల్ శిబిరాలు - పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి మే14:ప్రజా పాలన - ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి లోని తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల నాలుగవ రోజు వివిధ అవగాహన, ఆరోగ్య మరియు విద్యా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ తెలిపారు.విద్యా వారోత్సవాల సందర్భంగా పేరెంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో పేరెంట్స్ - స్టూడెంట్స్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం. ప్రవీణ మాట్లాడుతూ కళాశాలలో నాలుగు ఏఐడీపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరితే డిగ్రీ పూర్తయ్యే లోపే మెరుగైన ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు.అదేవిధంగా ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు కళాశాల తరపున సన్మాన కార్యక్రమం నిర్వహించారు.విద్యా వారోత్సవాల సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఎమ్మెన్నార్ డెంటల్ కళాశాల మరియు






ప్రశాంత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ఉచిత డెంటల్ మరియు వైద్య శిబిరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డాక్టర్ పి. వసంత్ మాట్లాడుతూ పొగాకు వినియోగం క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుందని హెచ్చరించారు.పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యకర జీవనశైలి అలవాటు చేసుకోవాలని, మద్యపానం, మత్తు పదార్థాలు మరియు ప్రమాదకర పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణ ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. గాయత్రి, డాక్టర్ పి. వసంత్ ఆధ్వర్యంలోని ఎమ్మెన్నార్ వైద్య బృందం, వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ జోష్ణ, డాక్టర్ వల్లి సౌభాగ్యం, పేరెంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుజాత, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కోర్టు ఆవరణలో న్యాయ చైతన్య సదస్సు..

**-మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన -పాల్గొన్న మెజిస్ట్రేట్ సూరి రెడ్డి**

మణుగూరు మే 14 (భారతశక్తి) : మండల లీగల్ ఎయిడ్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు కోర్ట్ ఆవరణలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల లీగల్ అథారిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, వాణిజ్య దోపిడీ నిరోధక పథకం-2015 కింద బాధితులకు అందే న్యాయ సహాయం, రక్షణ చర్యలు, ప్రభుత్వ పునరావాస అవకాశాలను వివరించారు. అలాగే జాగృతి పథకం-2025లో భాగంగా సురక్షిత్ బచ్‌పన్ -- సురక్షిత్ భవిష్య కార్యక్రమం ద్వారా చిన్నారుల రక్షణ, పోక్సో చట్టం నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది వీరంకి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో






పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి సూచనలు అందించారు. ప్రజలు తమ హక్కుల పరిరక్షణకు చట్టాలను తెలుసుకుని అవసరమైనప్పుడు లీగల్ ఎయిడ్ సేవలను వినియోగించుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పద్మావతి సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురు కృష్ణ, న్యాయవాదులు కందిమల్ల నరసింహారావు, జాడి చొక్కారావు, కుర్మ విజయ్, మేదరమెట్ల శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, ఈర్ల రాము, పోశం భాస్కర్, బిక్కసాని శ్రీనివాస్, బొంతు సునీత, తాటి వందన, వాసవి, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా

**- 1లక్షా 25 వేల ఎల్ఓసి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి మే 14: సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణానికి చెందిన బొడుగు స్వరూప అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (నిమ్స్)లో చికిత్స పొందుతున్నారు.

చికిత్స ఖర్చుల కారణంగా కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు.బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు రూ.1 లక్ష 25 వేల ఎల్ వో సి ఆర్థిక సహాయం మంజూరుకు కృషి చేసి, సంబంధిత చెక్కును సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వరూప కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ జాఫర్ తదితరులు ఉన్నారు.



# జనగణనలో తప్పులు ఉండొద్దు

**ప్రతి ఇంటి సమాచారం పక్కాగా నమోదు చేయాలి**

**కందుకూరులో ఇంటింటి సర్వేను పరిశీలించిన**

**రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి**



కందుకూరు, మే 12, భారత శక్తి: జనగణన – 2027లో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కందుకూరు మండలంలో కొనసాగుతున్న గృహ గణన సర్వేను ఆయన స్వయంగా పరిశీలించారు. ఎన్యుమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకుని, క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### నిబంధనల మేరకే డేటా సేకరణ

సర్వే సందర్భంగా డేటా సేకరణ, వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్.. ఎన్యుమరేటర్లు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. "ఎన్యుమరేటర్లకు కేటాయించిన బ్లాక్ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లాలి. ఏ ఒక్క కుటుంబాన్ని వదలకుండా పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలి" అని ఆదేశించారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని, ఆన్లైన్ ఎంట్రీలలో జాప్యం ఉండకూడదని సూచించారు.

### ప్రజలకు అవగాహన కల్పించాలి

ఫీల్డ్ స్థాయిలో పనిచేసే సిబ్బంది ప్రజలతో మర్యాదగా ఉంటూ, జనగణన యొక్క ప్రాధాన్యతను వారికి వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సహకారం పొంది సమాచారాన్ని పారదర్శకంగా సేకరించాలన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నిర్దేశిత గడువులోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

### క్షేత్రస్థాయిలో పరిశీలన

మండలంలోని ఒక ఇంటి వద్ద ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేస్తున్న తీరును కలెక్టర్ దగ్గరుండి గమనించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహశీల్దార్, ఎంపీడీఓతో పాటు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

- కలెక్టర్ నారాయణ రెడ్డి
- కందుకూర్ మండలంలో వరి, మొక్కజొన్న కేంద్రాల ఆకస్మిక తనిఖీ
- రైతులకు ఇబ్బంది కలిగితే చర్యలు తప్పవు
- లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని ఆదేశం



కందుకూర్, మే14, భారత శక్తి రైతులు పండించిన పంటను అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కందుకూర్ మండలంలోని వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, లోడింగ్, లిఫ్టింగ్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### - లోడింగ్‌లో జాప్యం వద్దు

కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోకుండా, తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అవసరమైన లారీలు, హమాలీలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రవాణాలో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

### పారదర్శకంగా నాణ్యత పరీక్షలు:

ధాన్యం తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. రైతులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. అదేవిధంగా, కొనుగోలు వివరాలను వెంటనే ట్యాబ్‌లలో నమోదు (ట్యాబ్ ఎంట్రీ) చేయాలని, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

### కేంద్రాల్లో వసతులు కల్పించాలి:

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్ని బ్యాగులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు.

ఈ తనిఖీలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్, మార్క్ ఫెడ్ అధికారులు, మండల వ్యవసాయ అధికారి మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 15 నుండి బాలసంస్కార్-2026 ప్రారంభం

**హన్మకొండ (భారత శక్తి)**: శ్రీరామకృష్ణ సేవా మందిరం, కె ఎల్ ఎన్ రెడ్డి కాలనీ, హనుమకొండ యందు "బాలసంస్కార్–2026 వేసవి శిక్షణా శిబిరం" ఈ నెల 15 నుండి పది రోజులు ప్రతి రోజు ఉదయం 6 నుండి 11 గంటలవరకు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షులుకటంగూరి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం నుండి జరుగనున్న "బాల సంస్కార్ 2026" కార్యక్రమంలో ఈ 10 రోజులపాటు ఉదయం గం. 5:40 ల నుండి గం 11:30ల వరకు తమ సమయాన్ని కెటాయించి, స్వచ్ఛంద వాలంటీర్ గా తమ సేవలు అందించాలన్న తపన, అభిలాష కలవారి కొరకు నిన్న (తేది:14.05.2026 శనివారం) సాయంత్రం 5 గంటలకు "వాలంటీర్ల శిక్షణ సమావేశము" మన సేవా మందిరంలో ఏర్పాటు చేయనైనది. అందులో వాలంటీర్లకు వారి బాధ్యతల పంపిణీ మరియు పాటించాల్సిన నియమనిబంధనల గురించి చర్చించి సరైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించు కోవడం జరిగింది. శిక్షణ సమావేశంలో పాల్గొన్న వాలంటీర్లు వేసవి శిబిరంలో పాల్గొనే అర్హత పొందడంతో పాటుగా తమ అమూల్య సేవలతో మూర్తిత్రయ ఆశీస్సులు పొంది 10 రోజుల బాలసంస్కార్–2026 వేసవి శిబిరాన్ని విజయవంతం చేయాలని కటంగూరి సత్యనారాయణ రెడ్డి కోరారు.

# నిపుణులుగా ఎదిగి, వృత్తిలో రాణించండి

**- గీతం విద్యార్థులకు విభాగాధిపతి**

**ప్రొఫెసర్ సంజీవ్ కుమార్ సూచన**






సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి మే 14 : ఎంపిక చేసుకున్న రంగంలో నిపుణులుగా ఎదిగి, ఆయా వృత్తులలో మేటివారిగా రాణించాలని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని టెలివిజన్ ప్రసార కోర్సులు, ప్రయోగాత్మక యానిమేషన్, మీడియా నిర్వహణ పద్ధతులు విభాగాధిపతి ప్రొఫెసర్ సంజీవ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. పూణేలోని ఎంఐటీ–డబ్ల్యూపీయూ విశ్వవిద్యాలయ సహకారంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో నిర్వహించిన రెండు వారాల 'జాతీయ విద్యా ఇమ్మర్షన్ కార్యక్రమం' గురువారంతో ముగిసింది. భవిష్యత్ తరానికి చెందిన మీడియా నిపుణులను తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన ఈ కార్యక్రమ ముగింపు వేడుకలో డాక్టర్ సంజీవ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం యొక్క నిజమైన విలువ కేవలం విద్యాపరమైన వినిమయంలోనే కాకుండా, పాల్గొనేవారి మధ్య ఉన్న జిజ్ఞాస, సహకారం, పరస్పర సంభాషణ స్ఫూర్తిలో కూడా ఉందని అన్నారు. నూతన ఆవిష్కరణలను, అర్థవంతమైన విద్యాపరమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే వేదికను కల్పించినందుకు ఆయన ఎంఐటీ వర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చొరవ రెండు సంస్థల మధ్య మరింత బలమైన సహకారానికి నాంది పలికిందన్నారు.ఎంఐటీ–డబ్ల్యూపీయూ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ అను నాయర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో 71 మంది విద్యార్థుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. గీతంతో మరిన్ని సహకార కార్యక్రమాల కోసం తమ సంస్థ ఎదురు చూస్తోందని ఆమె తెలిపారు. విద్యార్థులు ఆయా సెషన్లలో చురుకుగా పాల్గొన్నారని, ముఖ్యంగా ఆచరణాత్మక అభ్యాస అనుభవాలను ఆస్వాదించారని చెప్పారు. మే 1 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన ఈ ఇమ్మర్షన్ కార్యక్రమం, విద్యార్థులకు సమకాలీన మీడియా పద్ధతులు, కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్ స్టోరీటెల్లింగ్, పరిశ్రమ ఆధారిత శిక్షణపై విస్తృతమైన అవగాహనను అందించింది.?

నిపుణుల ఉపన్యాసాలు, కార్యశాలలు, ముఖాముఖీ కార్యక్రమాలు, ఆచరణాత్మక అభ్యాస అనుభవాల ద్వారా, విద్యాపరమైన జ్ఞానానికి, వృత్తిపరమైన మీడియా పరిశ్రమ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడమే ఈ లక్ష్యంగా ఇది కొనసాగింది.రెండు విద్యా సంస్థల అధ్యాపకులు, ప్రముఖులు ఈ ఉమ్మడి కృషిని ప్రశంసించారు. సామాజిక బాధ్యత కలిగిన, పరిశ్రమకు సిద్ధంగా ఉన్న మీడియా నిపుణులను తీర్చిదిద్దడంలో అనుభవపూర్వక అభ్యాసం, వివిధ రంగాల పరిజ్ఞానం, విద్యా భాగస్వామ్యాల ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు.తమ ప్రతిస్పందనలో విద్యార్థులు ఈ కార్యక్రమం గురించి సానుకూల స్పందనను పంచుకున్నారు. ముఖ్యంగా ప్రయోగాత్మక యానిమేషన్ తరగతులు, మోషన్ గ్రాఫిక్స్ సెషన్లు, ఆడియో ప్రొడక్షన్–సౌండ్ డిజైన్ కార్యశాలలు, అలాగే పీసీఆర్ గదిలో మూడు ప్రాజెక్టులను రూపొందించిన ప్రత్యక్ష అనుభవాన్ని వారు ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన రెండు లఘు వీడియోలను కూడా ప్రదర్శించారు.ఇందులో పాల్గొన్నవారు తమ అభ్యాస అనుభవాలను సమీక్షించుకోవడంతో వీడ్కోలు కార్యక్రమం ముగిసింది. అనంతరం సామూహిక ఛాయాచిత్రాల (గ్రూపు ఫోటో) కార్యక్రమం జరిగింది.

# సర్కారీ చదువు.. ప్రగతికి మెట్టు!

## రాజీవ్ గాంధీ నగర్ స్కూల్లో ఘనంగా ప్రతిభా పురస్కారాలు

**బడిబాట కార్యక్రమంలో రాక్ టౌన్ లో ఉన్న గవర్నమెంట్ స్కూల్ స్టాఫ్ తో పాటు 'రాక్‌టౌన్ కాలనీ' అధ్యక్షులు.. ఎర్ర వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...**






మన్సూరాబాద్, మే 14: భార శక్తి, "ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ బడే ముద్దు" అనే నినాదంతో సర్కారీ విద్యను బలోపేతం చేసేందుకు గవర్నమెంట్ స్కూల్ స్టాఫ్ తో పాటు రాక్‌టౌన్ కాలనీ నడుం బిగించింది. రాజీవ్ గాంధీ నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత 3 సంవత్సరాలనుండి పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు సాధించిన అద్భుత విజయాలు, ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని పెంచాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు మరియు కొత్త అడ్మిషన్లను పెంచేందుకు స్కూల్ స్టాఫ్ మరియు రాక్‌టౌన్ కాలనీ సంక్షేమ సంఘం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది.

### ప్రతిభకు పట్టం.. విద్యార్థులకు సన్మానం

పదో తరగతి ఫలితాల్లో 500లకు పైగా మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటిన విద్యార్థులకు స్కూల్ స్టాఫ్ తో పాటు మరియు రాక్‌టౌన్ కాలనీ అధ్యక్షులు లిఎర్ర వినోద్ రెడ్డిలి మరియు కమిటీ సభ్యులు విద్యార్థులను ఘనంగా సన్మానం చేశారు. అలాగే వారికి ఇంటర్ లో కావాల్సిన పాఠ్య పుస్తకాలు, ఇతర అవసరాలకు సహకరిస్తామని విద్యార్థులకు తెలియజేసారు , వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్నికి ధన్యవాదాలు తెలియజేసారు. మెరుగైన ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిదని ఈ సందర్భంగా ఆయన వారిని కొనియాడారు.

### కాలనీ వీధుల్లో చైతన్య యాత్రలో

విద్యార్థులు, స్కూల్ స్టాఫ్ మరియు కాలనీ అసోసియేషన్ కమిటీ కలిసి స్థానిక వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. "బడికి పోదాం.. భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం" అంటూ నినాదాలు చేస్తూ, ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు."ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు. మన పిల్లల భవిష్యత్తు ఇక్కడ సురక్షితంగా ఉంటుంది. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి."అని ఎర్ర వినోద్ రెడ్డిలి, రాక్‌టౌన్ కాలనీ అధ్యక్షులు తెలియజేశారు.

### ప్రభుత్వ విద్య బలోపేతం - సూచనలు & భవిష్యత్ కార్యాచరణ

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మరియు స్థానిక సంఘాలు సమన్వయంతో చేయాల్సిన పనులు:

**డిజిటల్ విప్లవం:** ప్రతి తరగతి గదిని స్మార్ట్ క్లాస్ రూమ్‌గా మార్చడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని పెంచవచ్చు.

**మౌలిక సదుపాయాల కల్పన:** 'మన ఊరు – మన బడి' వంటి పథకాల ద్వారా నాణ్యమైన తాగునీరు, మరుగుదొడ్లు, మరియు ఆటస్థలాలను మెరుగుపరచాలి.

**నైపుణ్యాభివృద్ధి:** కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.

**ప్రభుత్వ సహకారం:** ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మరియు మధ్యాహ్న భోజన పథకంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి.

**కమ్యూనిటీ భాగస్వామ్యం:** రాక్‌టౌన్ కాలనీ తరహాలోనే స్థానిక సంక్షేమ సంఘాలు పాఠశాలలను దత్తత తీసుకుని, విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలి.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీత గారు మరియు ఉపాధ్యాయ బృందం, సంక్షేమ సంఘం నాయకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంధనాన్ని పొదుపు చేద్దాం..

# విదేశీ మారకద్రవ్యాన్ని కాపాడుకుందాం

**యుద్ధ మేఘాల నేపథ్యంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపు**

**కాన్వాయ్ వాహనాల తగ్గింపు.. 'నషా ముక్త తెలంగాణ' దిశగా అడుగులు**





హైదరాబాద్, మే 14 భారత శక్తి అమెరికా–ఇరాన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని పొదుపు చేయాలని, విదేశీ మారకద్రవ్య సంరక్షణకు సహకరించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ మేరకు గురువారం లోక్ భవన్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేసింది.

### ఆదర్శంగా నిలుస్తున్న ప్రధాని

దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ స్వయంగా ఆచరణలో ముందున్నారని గవర్నర్ పేర్కొన్నారు. భద్రతాపరమైన అవసరాలు ఉన్నప్పటికీ, తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను ఆయన తగ్గించుకున్నారని వెల్లడించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఇంధన సంక్షోభం దృష్ట్యా, డాలర్ల వినియోగాన్ని తగ్గిస్తూ రూపాయి విలువను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని గుర్తుచేశారు.

### వాహనాల వాడకం 50 శాతం తగ్గింపు

తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వాహనాల వినియోగాన్ని నియంత్రించానని, తాజాగా ప్రధాని పిలుపుతో రాజ్‌భవన్ వాహనాల వినియోగాన్ని మరో 50 శాతం మేర తగ్గించాలని నిర్ణయించుకున్నట్లు గవర్నర్ తెలిపారు.

- ప్రభుత్వ శాఖల్లోనూ వాహనాల వాడకం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి సూచించనున్నట్లు పేర్కొన్నారు.
- రాజకీయ నాయకులు భారీ కాన్వాయ్‌ల సంస్కృతికి స్వస్తి పలకాలని హితవు పలికారు.
- కేంద్ర మంత్రులు ఆదర్శంగా నిలుస్తున్న తీరును ప్రజాప్రతినిధులు అనుసరించాలని కోరారు.

### 'నషా ముక్త తెలంగాణ' లక్ష్యం

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై గవర్నర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. గతంలో హిమాచల్ ప్రదేశ్‌లో తాను చేపట్టిన డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమం సత్ఫలితాలను ఇచ్చిందని, అదే తరహాలో 'నషా ముక్త తెలంగాణ' లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

- **విద్యాసంస్థల్లో ప్రతిజ్ఞ:** పాఠశాలలు, కళాశాలల ప్రవేశ పత్రాల్లోనే 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం' అనే నిబంధనను చేర్చాలని సూచించారు.
- **మీడియా పాత్ర:** ఈ సామాజిక ఉద్యమంలో మీడియా క్రియాశీలకంగా వ్యవహరించాలని, యువతలో అవగాహన కల్పించడంలో పత్రికలు, ఛానళ్లు కీలక పాత్ర పోషించాలని కోరారు.



# బెల్లంతో చర్మ సౌందర్యం..

## ఇలా చేస్తే నవ యవ్వనం మీ సొంతం..!

సాధారణంగా బెల్లం తీపి వంటకాల కోసం ఉపయోగిస్తారు కానీ మీకు తెలియని ఒక విషయం ఏమిటంటే బెల్లం చర్మ సమస్యలకు కూడా ఉపయోగపడుతుంది. అవును మీరు చదివింది నిజమే.. చర్మ సమస్యలను తగ్గించుకోవడానికి బెల్లం ఉపయోగపడుతుందని, ఇది ఎఫెక్టివ్‌గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. చక్కెరకు ప్రత్యామ్నాయం బెల్లం. బెల్లంలో మినరల్స్, ఐరన్, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. బెల్లంలో మినరల్స్, ఐరన్, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. బెల్లం ఆరోగ్యానికి చాలా మంచిది. కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాదు..బెల్లంతో చర్మం కూడా మెరుస్తుందట. బెల్లం ఉండే గ్లైకాలిక్ యాసిడ్ మాయిశ్చరైజర్ గా పనిచేస్తుంది. చర్మాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. బెల్లం ఉండే గ్లైకాలిక్ యాసిడ్ మాయిశ్చరైజర్ గా పనిచేస్తుంది. చర్మాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. గ్రాన్యుయల్స్ చర్మం మీద డెడ్ సెల్స్ ని తొలగిస్తుంది. చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. గ్రాన్యుయల్స్ చర్మం మీద డెడ్ సెల్స్ ని తొలగిస్తుంది. ఇది ముఖంపై నల్ల మచ్చలు, మొటిమలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెల్లం ముఖంపై ముడతలు, గీతలు, దురద వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఒక చెంచా బెల్లం తీసుకుని అందులో ఒక చెంచా తేనె, నిమ్మరసం కలిపి పేస్ట్ లా చేసి ముఖానికి రాసుకుని మర్దన చేసి ఐదు నిమిషాలు అలాగే ఉంచి కడిగేస్తే ముఖం మెరిసిపోతుంది. చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. బెల్లంలోని యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్, జింక్, సెలీనియమ్ ముఖంపై ముడతలు రానివ్వకుండా చేస్తుంది. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ ప్రాపర్టీస్ మొటిమలు రాకుండా చేస్తుంది. చర్మంపై బ్యాక్టీరియాను తొలగిస్తుంది. రోజు బెల్లం తింటే.. బ్లడ్ సర్క్యులేషన్ పెరగుతుంది. దీంతో సెల్ టర్నోవర్ ఎక్కువ అవుతుంది. స్కిన్ బ్రైట్ అవుతుంది.బెల్లంలో ఉండే పోషకాల వల్ల ఎండలోకి వెళ్లినప్పుడు స్కిన్ పాడవ్వదు. అంతేకాదు, ఇందులో ఉండే మినరల్స్, విటమిన్స్ వల్ల దెబ్బ తగిలితే తొందరగా మానేలా చేస్తుంది.



# మొబైల్ స్పీకర్‌లోకి వాటర్ వెళ్లాయా..


ప్రస్తుతం రాష్ట్రంలో రోజూ వర్షం పడుతున్న విషయం తెలిసిందే. అయితే ఎంత వర్షం పడినా మనం మన జాబ్ కోసం లేదా ఏదైనా పని మీద తప్పకుండా బయటకు వెళ్తాం. అయితే చాలా మంది వర్షంలో బయటకు వెళ్లినప్పుడు తమ స్మార్ట్ ఫోన్‌ను జాగ్రత్తగా చూసుకుంటారు. తాము తడిచినా మంచిదే కానీ, ఫోన్ మాత్రం తడవకూడదు అనుకుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో మనకు తెలియకుండానే, ఫోన్‌లోకి వాటర్ వెళ్తాయి. మొబైల్ స్పీకర్‌లెరి వాటర్ వెళ్లడ జరుగుతుంది. ఇంకొన్ని సందర్భాల్లో పొలం పనులు చేస్తున్నప్పుడు ఫోన్ నీళ్లల్లో పడటం లేదా, చిన్నపిల్లలు ఫోన్‌ను తెలియకుండా నీళ్లలో పడేయడం జరగుతుంది. దీంతో మొబైల్ స్పీక్ హెూల్స్‌లోకివాటర్ వెళ్తాయి. దీంతో వాయిస్ వినబడకపోవడం, సాంగ్స్ , ఆడియో వినబడదు. దీంతో మీరు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు. తితే అప్పుడు మనం ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. ఏ మొబైల్‌లోకి వాటర్ వెళ్లాయో, ఆ మొబైల్‌లో గూగుల్‌కి వెళ్లి, ఇట్స్ మై స్పీకర్ అని సెర్చ్ చేయాలి. ఫస్ట్ వచ్చిన వెబ్ సైట్ మీద క్లిక్ చేయాలి. దీంతో మీకు ఒక స్పీకర్ సింబల్ కనిపిస్తుంది. దీంతో మీరు దాని మీద ప్రెస్ చేయాలి. మీరు ప్రెస్ చేయగానే లౌడ్‌గా సౌండ్ వస్తుంది. దీంతో అక్కడి నుంచి వచ్చే సౌండ్‌కు మీ మొబైల్‌లో ఉన్న వాటర్ అన్నీ బయటకు వచ్చేస్తాయి. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మీ వినబడుతుంది.

# పడుకునే ముందు లైట్లు ఆర్పడం లేదా?



స్లీపింగ్ హాబిట్స్ అందరిలో ఒకేలా ఉండవు. ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిని అనుసరిస్తుంటారు. చాలా మంది రాత్రిపూట లైట్లు ఆర్పేసి పడుకుంటారు. కొందరు బెడ్ లైట్లు వేసుకుంటే.. మరి కొందరు వేసుకోరు. ఇంకొందరు అసలు లైట్లే ఆర్పరు. అయితే లైట్లను ఆర్పకుండా పడుకోవడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. అధ్యయనంలో భాగంగా ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీకి చెందిన రీసెర్చర్స్ రాత్రిళ్లు లైట్లు వేసుకొని పడుకోవడం కారణంగా ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకోవడానికి సుమారు 85 వేల మందిని, 9 ఏండ్ల పాటు స్టడీ చేశారు. అర్ధరాత్రి 12:30 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లైట్ల కాంతికి గురయ్యే వారిలో, అలాగే లైట్లు ఆర్పేసి పడుకున్న వారిలో ఎలాంటి ప్రాబ్లమ్స్ తలెత్తుతున్నాయో అబ్జర్వ్ చేశారు. దీంతోపాటు 13 మిలియన్ గంటలకు సంబంధించిన ఓవరాల్ లైట్ సెన్సార్ డేటాను కూడా ఎనలైజ్ చేశారు. అయితే దీర్ఘకాలం లైట్లు ఆర్పకుండా నిద్రిస్తున్న వారిలో టైప్ 2 డయాబెటిస్ త్వరగా డెవలప్ అయినట్లు ఈ సందర్భంగా పరిశోధకులు గుర్తించారు. కాంతికి ఎక్స్‌పోజ్ అవడంవల్ల సిర్కాడియన్ రిథమ్‌కు ఆటంకం కలగడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలం పాటు కాంతికి గురయ్యేవారిలో ఇన్సులిన్, గ్లూకోజ్ మెటబాలిజంలో మార్పులు సంభవిస్తాయని, ఇవి రక్తంలో షుగర్ లెవల్స్‌ను నియంత్రించే శారీరక సామర్థ్యాన్ని దెబ్బతీడంవల్ల టైప్ 2 డయాబెటిస్ పెరిగేందుకు కారణం అవుతాయని రీసెర్చర్స్ కనుగొన్నారు. కాబట్టి రాత్రిళ్లు లైట్లను ఆర్పేసి పడుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# పూజ గదిలో గ్లాసు నీళ్లు తప్పనిసరిగా పెట్టాలా..



మన ఇంట్లో ఉండే పూజ గదిలో దేవుడి ఫోటోలు విగ్రహాలతో పాటు దీపారాధన అగరత్తులు ఇంకా దేవుళ్లకు సంబంధించిన పూజా సామాగ్రి ఉంటాయి. అన్నిటికంటే ముఖ్యంగా చాలామంది పూజ గదిలో నీటితో నింపిన రాగి చెంబు లేదంటే గాజు పాత్రను పంచ పాత్రను ఉంచుతూ ఉంటారు.పూజ గదిలో నీటిని ఎందుకు ఉంచుతారు అన్న విషయం చాలామందికి తెలియదు. మనం ఇలా గాజు గాని లేదంటే పంచ పాత్రలో నీరు పెట్టడం అన్నది వ్యాపార స్థలాలలో ఎక్కువగా చూసి ఉంటాం. వ్యాపార ప్రదేశాలలో గాజు గ్లాసులో మంచినీరు పెట్టి అందులో నిమ్మకాయ పువ్వు వంటివి పెడుతూ ఉంటారు. మరి పూజ గదిలో ఈ విధంగా నీరు ఎందుకు పెట్టాలి? దీని వెనుక ఉన్న రీజన్ ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. హిందూ సంప్రదాయాల ప్రకారం, దేవతలను పూజించే ముందు, విగ్రహాలను నీటితో కడిగి, గదిలో నీరు చల్లి శుభ్రం చేయాలి. కొన్ని తులసి ఆకులను నీటిలో వేసి ఆ నీటిని పూజా గదిలో ఉంచాలి. ఇది ప్రదేశాన్ని శుద్ధి చేయడంతో పాటు దేవతలను ప్రసన్నం చేస్తుందట.

అయితే పూజ ప్రారంభించే ముందు ప్రతి ఇంట్లో నీళ్లు చల్లుతారన్న విషయం మనందరికీ తెలిసిందే. సాధారణ నీరు కాకుండా ఈ విధంగా తులసి నీళ్లతో చల్లడం ఇంకా మంచిదటీ. హిందూ మతంలో వరుణుడు నీటి రూపాన్ని తీసుకుంటాడు. పూజ గదిలో నీటిని ఉంచడం వల్ల వరుణదేవుడు ప్రసన్నం చేసుకుంటాడు. ఇలా చేయడం వల్ల ఇంట్లో ఐశ్వర్యం వస్తుందట. రోజు పూజ తర్వాత మనము దేవతలకు పండ్లు, స్వీట్లు లేదా పంచామృత వంటి ప్రసాదం లేదా నైవేద్యాన్ని అందిస్తాము. నైవేద్యాన్ని సమర్పించిన తర్వాత ఆ నీటిని దేవతలకు ప్రసాదంగా సమర్పిస్తారు. ఇది శ్రేయస్సును ఆహ్వానిస్తుందని చెబుతున్నారు. హారతి పళ్లెంలో నీళ్లు పోసి నాలుగు దిక్కులూ చల్లుతారు. పూజానంతరం దేవతల పాదాలను కడిగే శరణామృతాన్ని అందరికీ అందజేస్తారు. పూజా స్థలంలో నీటి కుండను ఉంచడం వల్ల ఆ ఇంటి ఐశ్వర్యం పెరుగుతుందట. అలాగే ఆ నీరు పాజిటివ్ ఎనర్జీని పెంచుతుంది. అందువల్ల, పూజా గదిలో నీటిని ఉంచేటప్పుడు వాస్తు సూత్రాలను గుర్తుంచుకోవాలట. ఇంటి ఉత్తరం లేదా ఈశాన్య మూలలో నీటి పాత్రను ఉంచాలట. నీటిని నిల్వ చేయడానికి రాగి లేదా ఏదైనా లోహపు పాత్రను ఎంచుకోవాలట. రాగి మంచి ఎంపిక ఎందుకంటే ఇది ప్రతికూలతను గ్రహిస్తుందట. అదనంగా, ఇది ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుందట. అలాగే ప్రతి పూజ తర్వాత నీటిని తప్పకుండా మార్చాలట.

# లింగ సమానత్వంలో 131వ ర్యాంక్

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలలో పురుషులు, మహిళల మధ్య వివిధ రంగాల్లో లింగ సమానత్వం బేరీజు వేసే గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ 2025లో భారతదేశం 131 స్థానానికి పడిపోయింది. పురుషులు, మహిళలు మధ్య ముఖ్యం గా ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాలు, విద్య, ఆరోగ్యం, మనుగడ, రాజకీయ సాధికారత వం టి రంగాల్లో పొందుతున్న అవకాశాలు, రాణిస్తున్న తీరును బేరీజు వేసేదే గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్. వరల్డ్ ఎకనమిక్ ఫోరం గ్లోబల్ జెండర్ గ్లాప్ రిపోర్ట్ 2025 విడుదల చేసింది. మొత్తం 148 దేశాలలో నిర్వహించిన సర్వేలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. నిరుడుక న్నా రెండు స్థానాలు దిగజారింది. గురువారం విడుదలైన నివేదిక ప్రకారం భారతదేశంలో లింగ సమానత్వ స్కోరు కేవలం 64.1శాతం. దక్షిణాసియాలో అత్యల్పర్యాంక్ సాధించిన దే శాలలో మనదేశం ఒకటి. భారత ఆర్థికవ్యవస్థ పనితీరు మొత్తం మీద 0.3 పాయింట్లు మెరుగుపడినట్లు నివేదిక తెలిపింది. భారతదేశంలో లింగ సమానత్వాన్ని పెంచే కోణాలలో ఒకటి ఆర్థిక భాగస్వామ్యం. అది ప్లస్ 9 శాతం పా యింట్లు మెరుగుపడి 40.7 శాతానికి చేరింది. అంటే ఆదాయంలో సమానత్వం కాస్త మెరుగుపడింది. శ్రామిక శక్తి విషయంలో పురుష లు, మహిళల భాగస్వామ్య రేటు గతసంవత్స రం మాదిరిగానే 45.9 శాతం ఉంది. విద్యా రంగంలో భారతదేశం ఏకంగా 97.1శాతం స్కోర్ సాధించింది. భారతీయ మహిళలు అక్షరాస్యత విషయంలో మెరుగైన శ్రద్ధ కన్పిస్తోంది. ఉన్నత విద్యలోనూ మహిళల వాటా పెరిగింద ని నివేదిక సూచిస్తోంది. శిశుమరణాలు తగ్గా యి. జననాల్లో లింగ నిష్పత్తి, ఆరోగ్యకరమైన ఆయుర్దాయం మెరుగుపడింది. భారతదేశం ఆరోగ్యం, మనుగడలో అధిక సమానత్వాన్ని నమోదు చేసింది. రాజకీయ సాధికారత విషయంలో భారతదేశంలో సమానత్వం స్వల్పం గా తగ్గింది. పార్లమెంటులో మహిళల ప్రాతిని ధ్యం 2025లో 14.7 శాతం నుంచి 13.8 శా తానికి పడిపోయింది. ముఖ్యంగా భారతదేశం ఇండెక్స్ దిగజారడానికి ఇదో కారణం.మంత్రి పదవుల్లో మహిళల వాటా 6.5 శాతం నుంచి 5.6 శాతానికి పడిపోయింది. అదే 2019లో 30 శాతంగా ఉంది. లింగ సమానత్వం మెరుగ్గా నిర్వహిస్తున్న దేశాలలో ఐస్లాండ్ వరుసగా 16ఏళ్లుగా నెంబర్ 1 స్థానంలో ఉంది. తర్వాత ఐస్‌లాండ్, నార్వే, బ్రిటన్, న్యూజిలాం డ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# ఫ్యాషన్ ప్రపంచంలో నయా ట్రెండ్!



'క్వైట్ లగ్జరీ' గురించి మీరు ఎప్పుడైనా విన్నారా? ఒక్క మాటలో చెప్పాలంటే 'లగ్జరీ స్టేటస్'కు బదులుగా సింప్లిసిటీని ఫాలో అవడం. ఇటీవల సోషల్ మీడియా వేదికల్లో దీని గురించి చాలా మంది యువతీ, యువకులు డిస్కస్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా మార్క్ జుకర్ బర్గ్ లాంటి ప్రముఖులు కూడా ఈ సరికొత్త ఫ్యాషన్‌ను ఫాలో అవుతున్నారు. ఈ లేటెస్ట్ ట్రెండ్ మరింత విస్తరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇన్నాళ్లు చాలా మంది ప్రముఖులు, సెలబ్రిటీలు ఖరీదైన బ్రాండెడ్ దుస్తులను ధరించాలని, తాము విలాసవంతమైన జీవితాన్ని గడిపే వారిగా గుర్తింపు పొందాలని ఆరాట పడేవారు. కానీ ఇటీవల పలువురిలో అభిప్రాయాలు మారుతున్నాయి. ఆర్థికపరమైన ఇబ్బందులు లేకున్నా, అనేక విషయాల్లో విలాసవంతమైన జీవన శైలిని కలిగి ఉన్నా దుస్తులు ధరించడంలో మాత్రం సింప్లిసిటీని అనుసరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంటే ధనవంతులు సాధారణ వ్యక్తులను ఫాలో అయ్యే సరికొత్త ధోరణి. 'క్వైట్ లగ్జరీ' రీసెంట్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్‌గా అనిపించవచ్చు కానీ ఇది గతంలో కూడా ఉండేదని, కాకపోతే చాలా తక్కువగా ఉండేదని పలువురు ఫ్యాషన్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దశాబ్దాలుగా వినియోగదారులు తమ వార్డ్‌రోబ్‌లో కొన్ని హై క్వాలిటీ పీసెస్ కలిగి ఉన్నప్పటికీ సింప్లిసిటీనే అనుసరించే వారు కూడా అరుదుగానైనా ఉండేవారట. కాకపోతే 2024లో రిచ్ అండ్ ఫేమస్ ఐటమ్స్ ప్రయారిటీని తగ్గించడం ద్వారా ప్రముఖులు కూడా ఈ నయా ట్రెండ్‌కు దగ్గరవుతున్నారు. దుస్తులు ధరించడంలో, ఫ్యాషన్ ఫాలోయింగ్‌లో బాహ్య సౌందర్యానికంటే మానసిక సౌందర్యానికి, మానసికి స్థితికే అధిక ప్రాధాన్యత ఇవ్వడం క్వైట్ లగ్జరీలో ప్రముఖంగా ఉంటుంది. అయినప్పటికీ ఇక్కడ కొన్ని విజువల్ ఎలిమెంట్స్ కూడా ఉంటున్నాయి. ఉదాహరణకు న్యూట్రల్ కలర్స్, అలాగే స్ట్రీమ్ లైన్డ్ సిల్హౌట్స్ వంటి దుస్తుల ఎంపికకు ప్రయారిటీ ఇస్తున్నారు పలువురు. మరికొందరు క్వైట్ లగ్జరీ అనేది కొన్ని నిర్దిష్టమైన బ్రాండ్‌లతో స్థిరమైన, నిజమైన రిలేషన్‌షిప్‌ను డెవలప్ చేయడం లాంటిదని కూడా అంటున్నారు. ఒక విధంగా ఇది యాంటీ ఫ్యాషన్‌గా, మల్టిపుల్ యూజ్‌గానూ ఉంటుంది. క్వైట్ లగ్జరీ ఫ్యాషన్ కేవలం డిస్కషన్ వరకే పరిమితం కాలేదు. దీనికి రియల్ లైఫ్ ఎగ్జామ్‌పుల్స్ చాలానే ఉన్నాయి. ఉదాహరణకు మీరు ప్రపంచ ప్రసిద్ధి చెందిన సెలబ్రిటీలు గ్వినేత్ పాల్ట్రో, ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్ బర్గ్ వంటి వారిని గమనించారా? వీరు గొప్ప ధనవంతులే కావచ్చు. కానీ వారు ధరించే దుస్తులు, ప్రవర్తన సామాన్య వ్యక్తుల మాదిరే ఉంటుంది. లైఫ్ స్టైల్ చాలా సింప్లిసిటీగా అనిపిస్తుంది. జుకర్ బర్గ్ అయితే ఎక్కువగా ఒక గ్రే కలర్ టీ షర్టునే ధరిస్తుంటాడు. క్వైట్ లగ్జరీలో ఫాస్ట్ ఫ్యాషన్ కంటే కూడా సౌలభ్యం, సౌకర్యం, మానసిక ఆనందం ప్రధాన అంశాలుగా ఉంటున్నాయని నిపుణులు చెప్తున్నారు. న్యూట్రల్ కలర్స్ కలిగిన సౌంకర్యవంతమైన దుస్తులను ఎంచుకోవడాన్ని చాలా మంది ఇష్టపడుతున్నారు. సింపుల్‌గా ఉండటం, ఒకే తరహా దుస్తులు, యాక్సెసరీస్, నగలు వంటివి ధరించడం క్వైట్ లగ్జరీలో అంతిమ లక్ష్యంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం దుస్తులకే పరిమితమైన ఈ ట్రెండ్ భవిష్యత్తులో అన్ని విషయాల్లోనూ విస్తరిస్తూ సింప్లిసిటీని ప్రతిబింబిస్తుందని పేర్కొంటున్నారు.

# పాలిచ్చే తల్లులకు బిగ్ అలర్ట్..



అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. తల్లి తన కడుపులో బిడ్డ పెరుగుతుందని తెలిసినప్పటి నుంచి ఆ బిడ్డ పెరిగి పెద్దది అయినా తన ఆరోగ్యం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటుంది. ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటుంది. అంతే కాకుండా బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఎందుకంటే తాను తీసుకునే ఆహారం వలన బిడ్డకు ఎక్కడ అనారోగ్య సమస్యలు వస్తాయో అని ఆ తల్లి భయపడుతుంది. అయితే కొంత మంది ప్రెగ్నెన్సీ సమయంలో లేదా, బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఎక్కువ స్వీట్ తింటే బిడ్డకు షుగర్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. అందువలన స్వీట్స్ అస్సలు తినకూడదు అని చెబుతారు. కాగా, దీని గురించి ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.వైద్యుల సూచన ప్రకారం.. గర్భధారణ సమయంలో, బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా మహిళా తప్పకుండా మంచి పోషకాహారం తీసుకోవాలంట. అంతే కాకుండా ఇద్దరికీ సరిపడా ఆహారం తీసుకున్నప్పుడే బిడ్డ, తల్లి ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారంట. లేకపోతే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ఛాన్స్ ఎక్కువగా ఉంటుందంట. అయితే కొంత మంది పాలిచ్చే తల్లులు, ప్రెగ్నెంట్ ఉమెన్స్ ఎక్కువగా స్వీట్స్, కూల్ డ్రింక్స్, జంగ్ ఫుడ్ తినడానికి ఇంట్రెస్ట్ చూపుతారు. కానీ దీని వలన శిశువులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. స్వీట్ ఎక్కువగా ఉన్న ఆహారాలు తీసుకోవడం వలన శిశువు ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అందుకే బాలింతలు, ప్రెగ్నెంట్ ఉమెన్స్ వారు తీసుకునే ఆహారం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు

భారత శక్తి
VOICE OF INDIAN
శుక్రవారం, మే 15, 2026

# బెంగాల్ సీన్ రిపీట్ అవుతుందా

**హైదరాబాద్, (భారత శక్తి)** తెలంగాణా రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకుని రావాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. తమ పార్టీకి ఒక్క చాన్స్ ఇవ్వాలని ఆయన తెలంగాణా ప్రజలకు వినతి చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ కి అధికారం ఇస్తే తెలంగాణా ప్రగతిపథంలో దూసుకుని పోతుందని మోడీ చెప్పుకొచ్చారు. తెలంగాణా రాష్ట్రాన్ని పాలకులు అవినీతి మయం చేశారు అని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ఏలుబడిలో ఎక్కువ అవినీతి జరిగిందని అన్నారు. అందుకే ఆ పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దించారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ళు పై దాటిందని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అభివృద్ధి చేయకుండా నమ్మించి మోసం చేస్తోంది అని నరేంద్ర మోడీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ప్రజలు తరిమికొట్టి కాషాయానికి పట్టం కట్టాలని ఆయన కోరారు.పశ్చిమ బెంగాల్ ప్రజలు అక్కడ అవినీతి ప్రభుత్వాన్ని ఓడించి బీజేపీ పాలనకు పట్టం కట్టారు అని మోడీ చెప్పుకొచ్చారు. దేశమంతటా బీజేపీ ప్రభంజనం వీస్తోందని ఆయన చెప్పారు. ఇక బీఆర్ఎస్ కాంగ్రెస్ లను ఓడించి ఈసారి చాన్స్ బీజేపీకి ఇవ్వమని ఆయన కోరారు.

ఒక్క చాన్స్ ఇస్తే చాలు అద్భుతమైన ఫలితాలను అందిస్తామని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పెడతామని కూడా అంటున్నారు. అయితే ప్రజలు సిద్ధంగా ఉన్నారా అన్నది పక్కన పెడితే తెలంగాణా బీజేపీ రెడీగా ఉందా అన్న చర్చ ముందుకు వస్తోంది. బాధ్యతగల పౌరుడిగా గుర్తించండి.మిగిలిన రాష్ట్రాలలో బీజేపీ గెలుపు కోసం పార్టీ క్యాడర్ అంతా రోడ్డున ఉంటారు. నాయకులు సైతం వీధుల్లోకి వస్తారు. బెంగాల్ లో గత పదేళ్ళుగా బీజేపీ పడిన కష్టమే ఈ రోజు విజయం. ఒక్కో నాయకుడిదీ ఒక్కో వీరోచిత పోరాటం. బెంగాల్ లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ని ఎదిరించి నిలబడడం అంటే మాటలు కాదు, కానీ తెగించి వచ్చారు. అలా చేయడం వల్లనే పార్టీ బతికింది. ప్రజా సమస్యల మీద పోరాటం చేయడం వల్లనే బీజేపీ వైపు జనాలు చూశారు. ఆ విధంగా ప్రభుత్వ వ్యతిరేకత కాస్తా బీజేపీ వైపు మళ్ళింది. తెలంగాణాలో బీజేపీ చూస్తే మూడు గ్రూపులూ ఆరు వర్గాలుగా ఉంది. అందరూ నాయకులే అన్నట్లుగా ఉంది గతంలో కాంగ్రెస్ ఏ విధంగా ఉందో ఆ పరిస్థితి ఉందని అంటున్నారు. ఇపుడు తెలంగాణా కాంగ్రెస్ ఏకీకృతం అవుతోంది. రేవంత్ రెడ్డి అందరినీ కలుపుకుని పోతున్నారు. కానీ బీజేపీలో మాత్రం ఆ పరిస్థితి లేదని అంతా అంటున్నారు నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగి బీజేపీని కదిలించాల్సి వస్తోంది. కానీ ఈ తరహా ఉత్సాహాన్ని సభలు పెట్టి పార్టీ నేతలు చేయాల్సి ఉంది కదా అని అంటున్నారు. మొత్తానికి చూస్తే సౌత్ కి గేట్ వేగా తెలంగాణాను బీజేపీ పెద్దలు భావిస్తున్నారు కానీ తెలంగాణా బీజేపీ నేతలు సమాయత్తం అయితేనే అది సాధ్యపడుతుంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ఆగని మిల్లర్ల మాయజాలం

**నిజామాబాద్,(భారత శక్తి)** మిల్లర్ల మాయజాలానికి రైతన్నలు బలవుతున్నారు. ప్రభుత్వం ఒక వైపు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని అమ్ముకొని మద్దతు ధర పొందాలని చెప్తున్నా ఆచరణలో మాత్రం రైతన్న లు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ప్రతి సీజన్లో లక్షల క్వింటాళ్ల ధాన్యం తరుగు పేరిట కొనుగోలు కేంద్రాల్లో నొక్కేయడమే కాకుండా మిల్లర్లు సైతం తరుగు తీసి కాంటా పెట్టుకుంటున్నారు. దీంతో రెండు చోట్ల రైతన్నలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కామారెడ్డి జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు అసలే ఆలస్యంగా ఏర్పాటు చేసిన అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తెచ్చిన ధాన్యాన్ని తరువు పేరుట నిలువు దోపిడికి గురిచేస్తున్నారు. క్వింటాలకు నాలుగు కిలోల నుంచి 10 కిలోల వరకు తరుగు తీస్తు తూకం వేస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం క్వింటాలకు నాలుగు కిలోలు మాత్రమే తరుగు తీస్తున్నట్లు నటిస్తున్నారు. నిత్యము మాత్రం రైతులను తరుగు పేరిట నిలువు దోపిడికి గురిచేస్తున్నారు.రైస్ మిల్లర్లు, అధికారులు, కొనుగోలు కేంద్రాల సెంటర్ నిర్వాహకులు సైతం కుమ్మక్కై రైతులను దోపిడీకి గురి చేస్తున్నారు. దీంతో రైతులు నిలువునా నష్టపోతున్నారు. అధికారులకు చెప్పినా కూడా పట్టించుకోకపోవడంతో దాన్యం కాంట కావడమే తమ కష్టాలు తీరుతున్నాయని రైతులు సర్దుకుంటున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చిన నుంచి రైతన్నలకు తంటాలు తప్పడం లేదు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం నిర్వాకులు, అధికారులు చూడాలని ఒకవైపు కలెక్టర్ కొనుగోలు కేంద్రాల సందర్శనాల్లో చెబుతున్న ఆచరణలో మాత్రం అధికారులు అమలు చేయడం లేదు. వర్షాకాలం, వేసవికాలంలో వరి ధాన్యం చేతికి రాగానే ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని భావిస్తున్న రైతులకు అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై తరుగూ పేరిట దోపిడి చేస్తున్నారని రైతు లు ఆరోపిస్తున్నారు.కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చిన తర్వాత తేమా శాతం వచ్చిన తర్వాతే ధాన్యాన్ని కాంటా పెడుతున్నారు. దీంతోపాటు మరికొంత తరుగు తీయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మిల్లర్ వద్దకు వెళ్తే ధాన్యం తరు గు ఏర్పడుతుందని సాకుతో రైతుల నుంచి బస్తాకు నాలుగు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. దీంతో ఒక రైతు 50 కింటల ధాన్యం పండిస్తే కొనుగోలు కేంద్రంలో తరుగు పేరిట క్వింటాల్ వరకు స్వాహా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.ధాన్యం కొనుగోలులో కొనుగోలు సెంటర్ నిర్వాహకులతో పాటు పర్యవేక్షణ చేస్తున్న అధికారులు, రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతుల నుంచి తరుగు పేరిట నిలువు దోపిడికి గురి చేస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం నామమాత్రంగా సూచనలిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సీజన్లో వేల క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు పేరిట దోపిడి చేసి ఆ డబ్బులను రైస్ మిల్లర్లు, అధికారులు పంచుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మితే ధర తక్కువ వస్తుందొచ్చు కానీ తరుగు తీయరని రైతులంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తరుగు పేరిట దోపిడీ చేస్తున్న తీరును ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దోపిడీకి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రతి సీజన్లో లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తరుగు పేరిట దోపిడీ చేస్తే డబ్బులు దండుకుంటున్నారు. తరువు పేరిట జరుగుతున్న దోపిడీ తతంగాన్ని జిల్లా ఉన్నతాధికారులు అరికట్టాలని రైతులు కోరుతున్నారు. కామారెడ్డి జిల్లాలో దాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట దోపిడీ జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు విజయ క్రాంతి ప్రతినిధి దృష్టికి తీసుకెళ్లగా సాక్షాదారాలతో ఫిర్యాదు చేస్తే దోపిడీకి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మిల్లర్లు కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. రైతులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. క్వింటాల్కు రెండు కిలోల వరకు తరు గు తీస్తున్నారని, ఎక్కువ మొత్తంలో తరుగు తీసే చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు నష్టపోకుండా చూస్తామన్నారు.

# రామగుండం-మణుగూరు రైల్వే లైన్

**కరీంనగర్, (భారత శక్తి)** ఉత్తర తెలంగాణ ప్రజల పాతికేళ్ల నిరీక్షణకు తెరపడింది. రామగుండం-మణుగూరు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడమే కాకుండా.. 2026-27 బడ్జెట్లో ఏకంగా రూ.2911.84 కోట్ల నిధులు కేటాయించింది. సుమారు 208 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే మార్గం సింగరేణి బొగ్గు రవాణాకు కీలకమైన 'కోల్ కారిడార్'గా మారనుంది. మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు అనుసంధానం కల్పిస్తూనే, భద్రాచలం-రామగుండం మధ్య ప్రయాణ దూరాన్ని 90 కిలోమీటర్ల మేర తగ్గించనుంది. ప్రస్తుతం ఈ లైన్ నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి.ఉత్తర తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చే సరికొత్త రైల్వే ప్రాజెక్టు పట్టాలెక్కడానికి సర్వం సిద్ధమైంది. రామగుండం-మణుగూరు మధ్య రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న పాతికేళ్ల నాటి కల ఇప్పుడు సాకారమవుతోంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడమే కాకుండా.. పనుల వేగవంతానికి 2026-27 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్లో రూ.2911.84 కోట్ల భారీ నిధులను కేటాయించింది. దీంతో దశాబ్దాల కాలంగా సాగుతున్న ప్రజల నిరీక్షణకు తెరపడటమే కాకుండా.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సరికొత్త బాటలు పడనున్నాయి.ఈ రైల్వే మార్గం కేవలం ప్రయాణికుల కోసమే కాకుండా.. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాలను కలుపుతూ ఒక వ్యూహాత్మక కోల్ కారిడార్ రూపుదిద్దుకోనుంది. దీనివల్ల బొగ్గు రవాణా వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, రవాణా ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ప్రస్తుతం భద్రాచలం నుంచి రామగుండం చేరుకోవడానికి సుమారు 286 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉండగా.. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే ఆ దూరం 90 కిలోమీటర్ల మేర తగ్గిపోనుంది. ఇది ఇటు సింగరేణి సంస్థకు, అటు ప్రయాణికులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.మొత్తం 207.80 కిలోమీటర్ల పొడవైన ఈ నూతన బ్రాడ్ గేజ్ మార్గం పెద్దపల్లి జిల్లాలోని రాఘవాపూర్ వద్ద ప్రారంభమై మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, కాటాపూర్ మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు సాగనుంది. ముఖ్యంగా ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం వంటి మారుమూల ప్రాంతాలకు రైలు సౌకర్యం కలగడం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టం. గతేడాది మే నెలలోనే భూసేకరణ ప్రకటన వెలువడగా.. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో సర్వేలు, భూపరీక్షలు పూర్తి కావడంతో పనులు వేగంగా మొదలుకానున్నాయి.ఈ ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వస్తే న్యూఢిల్లీ-చెన్నై గ్రాండ్ ట్రంక్, నాగ్‌పూర్-విజయవాడ సెక్షన్లకు ఇది ఒక బలమైన ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తుంది. భవిష్యత్తులో దీనిని భద్రాచలం-కొవ్వూరు మార్గంతో అనుసంధానించడం ద్వారా విశాఖపట్నం పోర్టు వరకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచవచ్చని అధికారులు భావిస్తున్నారు. రూ.4 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టును వచ్చే 10-15 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కాగా, రామగుండం-మణుగూరు రైల్వే మార్గం ఆమోదం శుభవార్త అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడారం వంటి పుణ్యక్షేత్రాలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడుతాయని చెప్పారు. అనేక పర్యాయాలు కేంద్ర రైల్వే శాఖకు విన్నవించాం.. పార్లమెంట్‌లోనూ మాట్లాడినట్లు ఎంపీ ఈటల రాజేందర్ చెప్పుకొచ్చారు.

# వర్క్ ఫ్రమ్ హోమ్‌తో రోజుకు 4 కోట్ల ఆదా

**హైదరాబాద్,(భారత శక్తి)** మనదేశంలో పేరుపొందిన ఐటి నగరాలలో హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుంది. ఫార్మా లో కూడా హైదరాబాద్ నగరానికి తిరుగులేని స్థాయి ఉంది. అతిపెద్ద కంపెనీలు.. అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఫలితంగా హైదరాబాద్ స్థాయి గ్లోబల్ రేంజ్ ను మించిపోయింది. మన దేశ ఆర్థిక రాజధాని ముంబైతో హైదరాబాద్ పోటీ పడుతుంది. హైదరాబాద్ నగరంలో పెద్ద పెద్ద కంపెనీలు ఏర్పాటైన నేపథ్యంలో.. ఉద్యోగులు కూడా అదే స్థాయిలో ఉన్నారు. హైదరాబాదులోనే వారు స్థిర నివాసం ఏర్పరచుకోవడంతో.. హైదరాబాద్ నగరం అంతకంతకు విస్తరిస్తోంది.హైదరాబాదు నగరంలోని ఐటీ కారిడార్ ప్రాంతంలో దాదాపు తొమ్మిది లక్షల మందికి పైగా పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది సొంత వాహనాలలో ఆఫీస్ కు వస్తుంటారు. కొన్ని కంపెనీలు గతంలో ప్రయాణ సౌకర్యాన్ని అందించేవి. ఖర్చులను తగ్గించుకోవడానికి చాలావరకు కంపెనీలు ప్రయాణ సౌకర్యాన్ని తగ్గించేశాయి. దీంతో ఉద్యోగులు మొత్తం సొంత వాహనాలలో కార్యాలయాలకు వస్తున్నారు. దీంతో హైదరాబాద్ నగరంలో పెట్రోల్ వినియోగం పెరిగిపోయింది.. పెట్రోల్ వినియోగం పెరిగిపోవడం వల్ల సహజంగానే కాలుష్యం కూడా పెరిగిపోతూ ఉంటుంది.ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్క్ ఫ్రం హోం చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయంగా యుద్ధ ప్రభావాలు ఇంకా తగ్గలేదని.. దీనివల్ల మన దేశం మీద తీవ్రమైన ఒత్తిడి ఉందని.. అందువల్ల ఉద్యోగులు ఇంటి నుంచి పని చేయడానికి ఆసక్తిని చూపించాలని సూచించారు. ప్రధానమంత్రి కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోం విధానానికి మరోసారి శ్రీకారం చుడుతున్నట్టు తెలుస్తోంది.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఒకసారి హైదరాబాద్ లో ఉన్న పరిస్థితిని అంచనా వేస్తే..హైదరాబాదు నగరంలో ఐటి కారిడార్ ప్రాంతంలో 9 లక్షల మందికిపైగా పనిచేస్తూ ఉంటారు. వీరిలో చాలామంది సొంత వాహనాలలో ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఇందులో సగం మంది(4.5 లీటర్లు) కి వర్క్ ఫ్రం హోం ఇచ్చినా.. రోజుకు 3.6 లక్షల లీటర్ల పెట్రోల్ ఆదా అవుతుంది. ఒక్కో వ్యక్తి సగటున 20 కిలోమీటర్లు ప్రయాణిస్తారు అనుకుంటే మొత్తం 90 లక్షల కిలోమీటర్లు అవుతుంది. లీటర్ కు సగటున 25 కిలోమీటర్ల మైలేజీ వస్తుంది అనుకుంటే 3.87 కోట్లు ఆదా అయినట్టే. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర 107.50 గా ఉంది. హైదరాబాద్ నగరంలోనే ఇలా ఉంటే, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్ కతా, వంటి నగరాలలో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తే మరింత పెట్రోల్ ఆదా అవుతుందని.. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## పట్టణంలో ట్రాఫిక్ పునరుద్ధరణకు


# పోలీస్ చర్యలు



**కోదాడ (భారత శక్తి)** కోదాడ పట్టణంలో ముఖ్య కూడల వద్ద ట్రాఫిక్ క్రమవృద్ధీకరణ చర్యలను ఎస్పీ నర్సింహ స్థానిక పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సామాన్య ప్రజలకు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండే విధంగా ట్రాఫిక్ పునరుద్ధరణ చర్యలను పటిష్టంగా చేపట్టాలని తెలిపారు. రోడ్లు ఆక్రమించి ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి స్థానిక మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని సర్దుబాటు చేయాలని రోడ్లపై దుకాణ సామాగ్రి పెట్టకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులను పట్టణ పోలీసులను ఆదేశించారు. కోదాడ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణ కోసం ఆపరేషన్ రోప్ అనే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలు వాహనదారులు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు. పట్టణ కేంద్రంలో వాహనాలు నడిపేటప్పుడు ఇతరులకు ఇబ్బంది కలగకుండా క్రమ పద్ధతిలో నడపాలని కోరారు. అవసరమైనచోట రోడ్డు మరమ్మతులు చేపిస్తున్నామని అన్నారు. ఎస్పీ వెంట స్థానిక డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పోలీసు సిబ్బంది ఉన్నారు.

## శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా


# బాధ్యతలు స్వీకరించిన ముండ్లపాటి చంద్రశేఖర్



**బ్రహ్మంగారిమఠం(భారత శక్తి)** బ్రహ్మంగారి మఠంలోని స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా ముండ్లపాటి చంద్రశేఖర్ గురువారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా స్థానిక సోషల్ మీడియాలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల మీద వస్తున్న వార్తలకు స్వస్తి పలుకుతూ కళాశాల కరస్పాండెంట్ ఎస్ కే వల్లి గారు నాకు ప్రిన్సిపల్ గా బాధ్యతలు అప్పుచెప్పారు కళాశాల కరస్పాండెంట్ ఆదేశాల మేరకు నేను నేటి నుండి కళాశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరిస్తున్నానని నేటి నుండి నేను శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆశీర్వచనములతో మీడియా మిత్రులు పెద్దల సహాయ సహకారాలతో బ్రహ్మంగారి మఠం మండల వ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థులకు అందరికీ విజ్ఞప్తి చేస్తూ మా కళాశాల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా నియమ నిబంధనలు పాటిస్తూ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడం నా బాధ్యతని అంతేకాకుండా డిగ్రీ కళాశాల ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పన కు అవకాశం కలిగేలాగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లతో మా కళాశాలను అనుసంధానం చేసుకొని ఇక్కడ చదివిన విద్యార్థులకు చదువు అయిపోగానే ఉద్యోగం పొందే లాగా కృషి చేస్తానని నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చిన కళాశాల కరస్పాండెంట్ ఎస్ కే వల్లి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మండల ప్రజల సహాయ సహకారాలతో మీ అందరి సలహాలు తీసుకొని కళాశాల అభివృద్ధికి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తానని వారు తెలియజేశారు.

## తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో

# ఏసీబీ అధికారులు దాడులు



**తాడేపల్లిగూడెం (భారత శక్తి)** పట్టణ ఎస్.ఐ పి.నాగరాజు, కానిస్టేబుల్ బాలకృష్ణ లను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. . ఒక ప్రేమ జంట పెళ్లి వ్యవహారంలో బెదిరించి 70 వేలు డబ్బులు అడిగినట్లుగా సమాచారం.ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులను బాధితులు ఆశ్రయించారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

# భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి



**మధురవాడ (భారత శక్తి)** అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ప్రక్కన నిర్మాణంలో ఉన్న ఓ భవనం పై నుండి ప్రమాదవశాత్తు పడి భవన నిర్మాణ కార్మికుడు ఉంకుల రాము(47)మృతి చెందాడు శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీకూర్మానికి చెందిన రాము,గత కొంత కాలంగా ఇక్కడ మేస్త్రీగా పనిచేస్తున్నాడు.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేక రించారు మృతునికి డిగ్రీ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు కుమారుడు యుగంధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ జి.బాలకృష్ణ ఆదేశాలతో ఎస్.ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాధా రంగ మిత్రమండలి

# వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్ఐసీ రాంబాబు

**గుడివాడ(భారత శక్తి)** స్థానిక గుడ్లవల్లేరు మండలంలో వేమవరంలో రాధా రంగా మిత్ర మండలిలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ఐసి రాంబాబును స్టేట్ రాధా రంగ మిత్రమండలి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండు తెలుగు రాష్ట్రాల రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు పాల్గొన్నారు బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ రంగా అంటే ఒక సామాన్యమైన వ్యక్తి కాదు ఒక కులానికో మతాన్ని కో ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తి కాదు అన్ని కులాలకు మతాలకు సంబంధించిన ఒక శక్తి అంటూ ఆయన తెలియజేశారు వంగవీటి మోహన రంగా ఆశయాలకు అనుగుణంగా ఈరోజు పనిచేయడానికి ముందుకు వస్తున్న ప్రతి ఒక్కరికి కూడా పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు మన రాష్ట్రంలో దేశంలోనే కాక ఇతర దేశాలలో కూడా రంగా అభిమానులు ఆయన ఆశయాల కోసం పని చేస్తున్నారు అని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ రాధా రంగ మిత్రమండలి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎల్ఐసి రాంబాబు ని నియమించడం ఎంతో గర్వకారణంగా ఉంది అంటూ ఆయనను కొనియాడారు ఆయన గతంలో 2009లో మచిలీపట్నం అసెంబ్లీ బిజెపి తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు అలాగే ఏపీ శాలివాహన సంఘం కన్వీనర్గా ఏపీ ఎంబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఏపీ బీసీ సంఘం జాయింట్ సెక్రెటరీగా ఏపీ స్టేట్ అంబేద్కర్ పూలే సంఘం స్టేట్ ఫౌండర్ ఆయన కొనసాగుతున్నారు ఎల్ఐసి రాంబాబు మాట్లాడుతూ రాధా రంగా మిత్రమండలి లో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా నన్ను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందంటూ ఎల్ఐసి రాంబాబు తెలియజేశారు రంగా ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాను ఎటువంటి చిన్న సమస్య వచ్చినా కూడా మా పెద్దలు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తాను అంటూ నాకు ఈ పదవి ఇచ్చిన బుల్లెట్ ధర్మారావు మరియు రాధా రంగ మిత్రమండలి సభ్యులకు అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు రాధా రంగా మిత్రమండలి గుడివాడ అధ్యక్షులు వడ్డే గిరి, రాధా రంగ మిత్రమండలి నాయకులు మహిళలు కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

**సికింద్రాబాద్.(భారత శక్తి)** పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షంనేతలు మెట్టుగూడా కూడలి వద్ద నిరసన చేశారు. బండి సంజయ్ ని కేంద్రమంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మైనర్ అమ్మాయిపై అఘాయిత్యానికి పాల్పడిన భగీరథ్ కేంద్రమంత్రి కొడుకు కావడంతో అరెస్ట్ చేయడం లేదా అని ప్రశ్నించారు. సామాన్యులకు ఒక చట్టం, పెద్దోలకు ఒక చట్టం ఉందా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని లేని యెడల అఖిలపక్షం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# హాస్టల్‌లో మహిళ అనుమానస్పద స్థితిలో మృతి

**హైదరాబాద్ (భారత శక్తి)** మధుర నగర్ పోలీస్ స్టేషన్ పరిధి మధురానగర్ మధురానగర్ లో భార్గవి లేడీస్ హాస్టల్లో హారిక ( 40 ) బాత్రూంలో పడి అనుమానాస్పద మృతి చెందింది, ఆమె .. చనిపోయి రెండు రోజులు అయ్యి ఉంటుందని పోలీసుల సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న మధుర నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించారు. గుంటూరు కి చెందిన మృతురాలు. హాస్టల్ టెర్రస్ పైన సింగిల్ గా ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు.

# భర్తపై పోక్సో కేసు..

## విడుదల చేయాలంటూ టవర్ ఎక్కిన యువతి

ఒక జంట ఇంటి నుంచి పారిపోయి పెళ్లి చేసుకున్నారు. యువతి తల్లి ఫిర్యాదుతో యువకుడిపై కిడ్నాప్ కేసు తోపాటు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన ఆ వ్యక్తిని కోర్టుకు తరలిస్తుండగా ఆ యువతి సమీపంలో ఉన్న టవర్ ఎక్కింది. తన భర్తను విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. 2025 అక్టోబర్‌లో యువతీ, యువకుడు కలిసి తమ ఇళ్ల నుంచి పారిపోయారు. వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు.కాగా, తన కుమార్తెను కిడ్నాప్ చేసినట్లు యువతి తల్లి ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో యువతి మైనర్ కావడంతో కిడ్నాప్‌తో పాటు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.మరోవైపు మే 12న జైలులో ఉన్న ఆ వ్యక్తిని కేసు విచారణ కోసం కోర్టుకు తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆ యువతి, పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న హై టెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ ఎక్కింది. తన భర్తను విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేసింది.ఇది తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఆ యువతికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో కోర్టు అనుమతితో ఆ వ్యక్తిని అక్కడకు తీసుకువచ్చారు. తన భర్తను చూసిన తర్వాత ఆ యువతి టవర్ నుంచి కిందకు దిగింది. ఆ తర్వాత వారిద్దరూ కౌగిలించుకుని భావోద్వేగంలో మునిగిపోయారు.అనంతరం పోలీసులు ఆ వ్యక్తిని జైలుకు తరలించారు. టవర్ ఎక్కి నిరసన తెలిపిన ఆ యువతికి నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ ఇస్తామని పోలీస్ అధికారి తెలిపారు.

## సాతులూరు వద్ద కాలేజీ బస్సు ఢీకొని

# ఇద్దరు యువకుల మృతి

**నాదెండ్ల:(భారత శక్తి)** మండల పరిధిలోని సాతులూరు సమీపంలో హైవేపై గురువారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వస్తున్న ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల బస్సు టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో, డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న పుణుగుపాడు గ్రామానికి చెందిన అశోక్ (34), సీతారామయ్య (21) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రత ఎంతలా ఉందంటే, ఒక వ్యక్తి బస్సు టైరు కింద పడిపోగా, అతడిని బస్సు కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. సమాచారం అందుకున్న నాదెండ్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# గోదావరి జిల్లాల్లో యంగ్ లీడర్లు...

**ఏలూరు, (భారత శక్తి)** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే సభ్యత్వ నమోదును స్పీడప్ చేసింది జనసేన పార్టీ. అయితే అనారోగ్యం, సర్జరీ కారణంగా రెస్ట్ తీసుకుంటున్న పవన్ కళ్యాణ్..పార్టీ ఇంచార్జ్‌ల మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జనసేనకు కంచుకోట లాంటి ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆయన వ్యూహ రచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నియోజకవర్గ ఇంచార్జ్ మార్పుపై పవన్ సీరియస్‌గా ఫోకస్ పెట్టినట్లు టాక్. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కనీసం ముగ్గురు కొత్త ముఖాలకు..ఈ సారి కొత్తగా ఇంచార్జ్‌లుగా అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి.ముఖ్యంగా గోపాలపురం, చింతలపూడి నియోజకవర్గాల్లో పాత ఇంచార్జ్‌లను మార్చి కొత్త వారికి బాధ్యతలు ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్‌గా ఉన్న సువర్ణరాజును తొలగించి మహిళా నేత ఫాతిమారాణికి అవకాశం ఇవ్వొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అలాగే చింతలపూడి నియోజకవర్గంలో మేక ఈశ్వరయ్యను తప్పించి ఓ ఎన్నారైకి ఇంచార్జ్ పోస్ట్ ఇస్తారని..ఆయన దూకుడుతో పార్టీని పటిష్టం చేసేలా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తుంది.సామాజిక సమీకరణాలతో పాటు, ఈ సారి కొత్త ఇంచార్జ్‌ల ఎంపికలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని జనసేన అధినేత భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆచంట, తణుకు నియోజకవర్గాల్లోనూ కొత్త ఇంచార్జ్‌ల నియామకంపై జన సైనికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే పనితీరు బాగున్న వారికే పట్టం కట్టాలని పవన్ గట్టి పట్టుదలతో ఉన్నారట. ఇంచార్జ్‌ల మార్పునకు ప్రధానంగా రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారట. ఒకటి నియోజకవర్గంలో వారి పనితీరు, రెండోది సభ్యత్వ నమోదులో చూపిన చొరవ. ఎవరు పార్టీ కోసం కష్టపడి జనాల్లోకి వెళ్తున్నారో వారికే బాధ్యతలు దక్కనున్నాయనే ప్రచారం జరుగుతుంది.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఉన్న పరిస్థితులను, ఇంచార్జ్‌ల మార్పు అవసరాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. పవన్ కళ్యాణ్ స్వల్ప అనారోగ్యంతో ఉన్నప్పటికీ, పార్టీ భవిష్యత్తు దృష్ట్యా ఈ కూర్పుపై సీరియస్‌గా చర్చిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న జనసేన, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తన సత్తా చాటాలని భావిస్తోంది. ఈ ప్రక్షాళన ద్వారా క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపి, క్షేత్రస్థాయిలో పార్టీని తిరుగులేని శక్తిగా మార్చడమే పవన్ అసలు లక్ష్యంగా కనిపిస్తోంది. త్వరలోనే ఈ కొత్త ఇంచార్జ్‌ల జాబితాపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# నీట్‌గా లీక్ చేసేశారు..

**జైపూర్, (భారత శక్తి)**ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్ష నీట్ 2026ను రద్దుచేశారు. పరీక్షకు రెండు రోజుల ముందే ప్రశ్నాపత్నం లీక్ కావడంతో కేంద్ర ప్రభుత్వం సూచనలతో ఎన్టీఏ రద్దుచేసిన సంగతి తెలిసిందే. అయితే, తొలుత ఈ పరీక్షా పత్రాన్ని పుణేకు చెందిన అనుమానితుడు నుంచి ఓ విద్యార్థి కొనుగోలు చేశాడు. అతడు రూ.10 లక్షలకు కొని, దానిని రూ.15 లక్షలు తిరిగి అమ్మినట్టు సీబీఐ దర్యాప్తులో వెల్లడయ్యింది.ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలతో యూజీ నీట్ 2026ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం రద్దుచేసింది. ఈ ప్రభావం 22 లక్షల మంది విద్యార్థులపై పడింది. ఈ కుంభకోణం మహారాష్ట్రలోని నాసిక్‌లో ప్రారంభమైంది. అక్కడ పేపర్ మొదటి డిజిటల్ కాపీ బయటపడింది. నివేదికల ప్రకారం.. పుణేకు చెందిన అనుమానితుడి నుంచి లీక్ అయిన పేపర్‌ను కొనుగోలు చేసి, ఆపై దానిని రూ. 5 లక్షల లాభంతో విక్రయించాడనే ఆరోపణలపై నాసిక్‌కు చెందిన శుభమ్ ఖైర్నార్‌ను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అదుపులోకి తీసుకుంది.మహారాష్ట్ర తర్వాత హర్యానాలోని గురుగ్రామ్, రాజస్థాన్‌లోని ప్రధాన కోచింగ్ సెంటర్ జైపూర్, సికార్ అలాగే జమ్మూ కశ్మీర్, బీహార్, కేరళతో సహా అనేక రాష్ట్రాలకు వ్యాపించింది. నాసిక్‌లోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల శుభమ్ ఖైర్నార్ బీఏఎంఎస్ విద్యార్థి. లీకైన నీట్ పర్‌ను పుణేకు చెందిన అనుమానితుడి నుంచి రూ.10 లక్షలకు కొనుగోలు చేసి హర్యానాలోని ఓ వ్యక్తికి? రూ.15 లక్షలకు విక్రయించి రూ.5 లక్షల లాభం పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ అప్లికేషన్ ద్వారా పేపర్ సర్క్యులేట్ అయిందని నివేదికలు చెబుతున్నాయి.మంగళవారం మధ్యాహ్నం శుభమ్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది. తనను గుర్తించకుండా జుత్తు కత్తిరించి తన రూపురేఖలను మార్చుకున్నాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. అయితే, అధికారుల ముందు అతడి ప్రయత్నాలు ఫలించలేదు. సాంకేతికత సాయంతో అతడిని గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకున్న తరువాత... తండ్రి మధుకర్ ఖైర్నార్ తన కొడుకుపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. పేపర్ లీక్ రాకెట్‌తో శుభమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. కానీ, నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.పేపర్ లీక్‌లో పోర్టబుల్ స్కానర్‌లు, క్లిష్టమైన టెలిగ్రామ్ నెట్‌వర్క్, షాడో సర్వర్‌లతో సహా అధునాతన సాంకేతికతలను ఉపయోగించినట్టు నివేదికలు పేర్కొన్నాయి. నివేదికల ప్రకారం, పరీక్షకు దాదాపు 45 గంటల ముందు పేపర్ సర్క్యులేట్ అయ్యింది. కేరళలో చదువుతున్న సికార్ విద్యార్థి హాస్టల్ నడుపుతున్న తన తండ్రికి "గెస్ పేపర్" పీడీఎఫ్ పంపినట్లు ఆరోపణలు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

పరీక్ష రోజు ఉదయం హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు పేపర్ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. వారు అప్పటికే సెంటర్లకు వెళ్లిపోయారని సమాచారం. పరీక్ష ముగిసిన తర్వాత, పేపర్‌ను కెమిస్ట్రీ, బయాలజీ లెక్చర్లకు చూపించడంతో 108 కెమిస్ట్రీ ప్రశ్నలకు 45, 204 బయాలజీ ప్రశ్నలకు 90 అసలు పరీక్ష పేపర్‌తో సరిపోలింది. సికార్‌లోని కొన్ని కోచింగ్ కేంద్రాలు గెస్ పేపర్స్ ఉపయోగించి నీట్‌కు సిద్ధం కావాలని కోరినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. కొందరికి పీడీఎఫ్ కాపీలు అందగా, మరికొందరికి లీకైన పేపర్‌కి సంబంధించిన అసలు కాపీలు ఇచ్చినట్లు సమాచారం.ఫిర్యాదు చేయడానికి ఉపాధ్యాయులు ప్రయత్నించినా.. సికర్ పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరాకరించారు. దీంతో వారు నేరుగా ఔంకి మెయిల్ పంపడంతో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎః)కి సమాచారం అందించింది. చివరకు రాజస్థాన్ పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు చేపట్టడంతో గుట్టు బయటపడింది.

# 18నుంచి పెద్ది ప్రమోషన్స్

**హైదరాబాద్,(భారత శక్తి)** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరో గా నటించిన 'పెద్ది' చిత్రం పై అభిమానుల్లో ప్రేక్షకుల్లో ఉన్నటువంటి అంచనాలు ఏ రేంజ్ అనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. సంక్రాంతి తర్వాత నాలుగు నెలల నుండి సరైన సినిమా లేక ఇబ్బంది పడుతున్న బయ్యర్స్ ఈ సినిమా మీదనే బోలెడన్ని ఆశలు పెట్టుకున్నారు. అభిమానులు కూడా ఈ చిత్రం తో రామ్ చరణ్ కుంభస్థలం బద్దలు కొడుతాడు అనే బలమైన నమ్మకంతో ఉన్నారు. పాన్ ఇండియా లెవెల్ లో రంగస్థలం రేంజ్ హిట్ గా నిల్చి, వెయ్యి కోట్ల గ్రాస్ ని రాబడుతుందని అంటున్నారు. ప్రొమోషన్స్ ని కూడా ఈ నెల 18 నుండి చాలా అగ్రెసివ్ గా మొదలు పెట్టబోతున్నారు. ముందుగా 18 న ముంబై లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ని ఏర్పాటు చేయబోతున్నారు, ఆ తర్వాత భోపాల్ లో స్పెషల్ సాంగ్ ని విడుదల చేసి మ్యూజికల్ నైట్ ఈవెంట్ ని ఏర్పాటు చేయనున్నారు.ఈ ఈవెంట్ లో ంఖీ రెహమాన్ లైవ్ పెర్ఫార్మన్స్ కూడా ఉండబోతుంది. ఇదంతా పక్కన పెడితే , ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్ షోస్ అప్డేట్ ఒకటి ఇప్పుడు సోషల్ మీడియా లో లీకై బాగా వైరల్ అయ్యింది. జూన్ 3 న ఇండియా వైడ్ గా ప్రీమియర్ షోస్ ని ఏర్పాటు చేయబోతున్నారు మేకర్స్. అందుకే తెలంగాణ లో ప్రీమియర్ షోస్ టికెట్ రేట్ 600 కి పెట్టుకునేలా అనుమతిని ఇవ్వాలంటూ ప్రభుత్వానికి రిక్వెస్ట్ పెట్టుకున్నారు మేకర్స్. అదే విధంగా సింగిల్ స్క్రీన్ థియేటర్స్, మల్టీ ప్లెక్స్ థియేటర్స్ కి ప్రస్తుతం ఉన్న రేట్స్ మీద 100 రూపాయిలు పెంచాల్సిందిగా కోరారు.

మరి ప్రభుత్వం అనుమతి ఇస్తుందా లేదా అనేది చూడాలి. ఒకవేళ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, హై కోర్టు ఆ అనుమతిని నిరాకరించే అవకాశాలు ఉన్నాయి. చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది.అయితే ప్రీమియర్ షోస్ కి 600 రూపాయిలు పెట్టాలనే ఆలోచన కచ్చితంగా స్వాగతించబడినది. పవన్ కళ్యాణ్ ఓజీ చిత్రానికి 800 రూపాయిల టికెట్ రేట్స్ పెట్టారు. కానీ ఈ చిత్రానికి కేవలం 600 రూపాయిలు మాత్రమే పెట్టారు . ఈ రేంజ్ హైప్ ఉన్న సినిమాకు ఇంత తక్కువ పెట్టడం వల్ల, ఫుట్ ఫాల్స్ భారీగా పెరిగే అవకాశం ఉంది, గ్రాస్ కూడా అద్బురంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది.

# ప్రయాణికులపై దూసుకెళ్లిన కారు

## – మహిళ మృతి

**సిరిసిల్ల (భారత శక్తి)** సిరిసిల్లలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులపైకి కారు దూసుకెళ్లింది. గంభీరావుపేట మండలం రాజరాజేశ్వర రావు కాలనీలోని గజసింగారం స్టేజి వద్ద ప్రమాదం జరిగింది. ప్రమాదంలో లక్ష్మి(35) అనే మహిళ మృతి చెందింది. మరో మహిళ, ఓ బాలుడు గాయాలపాలవ్వగా, స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# జలరక్షణలో హైటెక్ విప్లవం

## ఇక నీటి నాణ్యతపై ఏఐ నిఘా!

**- హైదరాబాద్‌లో అత్యాధునిక వాటర్ మానిటరింగ్ సిస్టమ్.. - ఐఐటీ ఖరగ్‌పూర్, ఎయిమ్స్ ఢిల్లీతో జీహెచ్ఎంసీ ఒప్పందం**







**హైదరాబాద్, మే 14: భారత శక్తి** భాగ్యనగర వాసులకు సరఫరా అయ్యే నీటి నాణ్యతను పరీక్షించే విధానంలో పెనుమార్పు రానుంది. అత్యాధునిక సాంకేతికతను జోడించి, కలుషితాలను వెనువెంటనే గుర్తించేలా 'అడ్వాన్స్‌డ్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్' ప్రాజెక్టును గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పట్టాలెక్కించింది. ఈ మేరకు ఐఐటీ ఖరగ్‌పూర్, ఎయిమ్స్ ఢిల్లీ సంస్థలతో జీహెచ్ఎంసీ గురువారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

### కృత్రిమ మేధతో కలుషితాల వేట

సాధారణంగా నీటి పరీక్షలు ప్రయోగశాలల్లో జరగడానికి సమయం పడుతుంది. కానీ ఈ కొత్త వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) మరియు లినాన్-థర్మల్ ప్లాస్మా స్పెక్ట్రోస్కోపీ సాంకేతికతను ఉపయోగిస్తారు. ఇది నీటి నమూనాలోని ఆప్టికల్ సిగ్నేచర్‌ను విశ్లేషించి, అందులోని లోపాలను ఇట్టే పట్టేస్తుంది. భారీ లోహాలు, పారిశ్రామిక రసాయనాలు, సూక్ష్మజీవులు వంటి కలుషితాలను అత్యంత తక్కువ పరిమాణంలో (పార్ట్స్ పర్ బిలియన్) ఉన్నా గుర్తించే సామర్థ్యం దీనికి ఉంది.

### ఏడాదిలో 25 వేల నమూనాల విశ్లేషణ

ఈ ఏడాది మూడవ త్రైమాసికం నుంచి ప్రారంభం కానున్న ఈ పైలట్ ప్రాజెక్ట్ 12 నెలల పాటు సాగుతుంది. నగరం నలుమూలల నుంచి సేకరించే సుమారు 25,000 నీటి నమూనాలను ఈ ప్రాజెక్ట్ కింద పరీక్షించనున్నారు. ద

దీని ద్వారా దాదాపు 19 లక్షల డేటా పాయింట్లు విశ్లేషించి, నీటి స్వచ్ఛతపై ఒక సమగ్ర నివేదికను రూపొందిస్తారు. ఏదైనా ప్రాంతంలో నీరు కలుషితమైనట్లు తేలితే, వెంటనే సంబంధిత అధికారులకు అలర్ట్ వెళ్లేలా ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ఏర్పాటు చేస్తారు.

### శాస్త్రీయ సారథ్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్

ఈ బృహత్తర ప్రాజెక్టుకు ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని 'స్కూల్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్' శాస్త్రీయ మార్గదర్శకత్వం వహించనుంది. కాలుష్య కారకాలను గుర్తించడమే కాకుండా, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, మౌలిక సదుపాయాల బలోపేతంపై ఈ సంస్థ తెలంగాణ ప్రభుత్వానికి సహకరిస్తుంది. క్షేత్రస్థాయిలో నమూనాల సేకరణ, డేటా నిర్వహణను హైదరాబాద్ మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (మీఖ) పర్యవేక్షిస్తుంది.

### దేశానికే ఆదర్శంగా తెలంగాణ

నీటి భద్రత మరియు ప్రజారోగ్య రక్షణలో సాంకేతికతను వినియోగించుకోవడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని జయేష్ రంజన్ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం అయ్యాక, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల ప్రజారోగ్య వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులను ముందే అరికట్టే అవకాశం ఉంటుంది.

# బెంగాల్ రాజకీయాల్లో నందిగ్రామ్ రెండో అంకం

**కోల్ (భారత శక్తి)** పశ్చిమ బెంగాల్ రాజకీయం ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సువేందు అధికారి అటు మమతా బెనర్జీ సొంత గడ్డ భవానీపూర్‌లోనూ, ఇటు తన కంచుకోట నందిగ్రామ్‌లోనూ ఘనవిజయం సాధించి జెయింట్ కిల్లర్ గా నిలిచారు. అయితే, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు. ఏదో ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉండటంతో, ఆయన భవానీపూర్‌ను అట్టి పెట్టుకుని నందిగ్రామ్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఇప్పుడు నందిగ్రామ్‌కు ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానం ఇప్పుడు మమతా బెనర్జీకి రాజకీయ పునర్వైభవం కోసం, మరో అగ్నిపరీక్ష కోసం వేచి చూస్తోంది.ఎమ్మెల్యేగా ఓడిపోయిన మమతా బెనర్జీకి, పార్టీని తిరిగి గాడిలో పెట్టాలంటే అసెంబ్లీలో అడుగుపెట్టడం అనివార్యం. ప్రస్తుతం ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఎంపీగా ఉన్నారు. అసెంబ్లీకి వెళ్లలేరు. దీదీ స్వయంగా సభలో ఉంటేనే టీఎంసీ శ్రేణుల్లో ఉత్సాహం పెరుగుతుంది. అయితే, నందిగ్రామ్ నుంచి పోటీ చేయడం ఆమెకు ఒక పెను సవాల్. 2021లో ముఖ్యమంత్రిగా ఉండి కూడా అక్కడ సువేందు చేతిలో ఓటమి పాలైన ఆమెకు, ఇప్పుడు అధికారం లేని స్థితిలో, విపక్ష నేతగా అక్కడికి వెళ్లడం అంటే కత్తి మీద సామే అని భావిస్తున్నారు.నందిగ్రామ్ అనేది కేవలం ఒక నియోజకవర్గం కాదు, అది బెంగాల్ పోరాట పటిమకు చిహ్నం. సువేందు అధికారి అక్కడ తన పట్టును నిరూపించుకున్నారు. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా ఉండి, తన అభ్యర్థిని అక్కడ నిలబెడితే ప్రభుత్వం ఉన్న అడ్వాంటేజ్ బీజేపీకి అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ఈ తరుణంలో మమత అక్కడ పోటీ చేసి మళ్లీ ఓడిపోతే, ఆమె రాజకీయ భవిష్యత్తు , టీఎంసీ మనుగడ మరింత క్లిష్టంగా మారుతుంది.

అందుకే ఆమె సేఫ్ సీటు కోసం చూస్తారా లేక నందిగ్రామ్ సవాల్‌ను స్వీకరిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. మమతా బెనర్జీ సహజంగానే పోరాట యోధురాలు. ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదల ఆమెలో ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. బీజేపీ 207 సీట్ల భారీ మెజారిటీతో అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ క్యాడర్ నైరాశ్యంలో ఉండటం ఆమెకు ప్రతికూలాంశాలు. ఒకవేళ ఆమె నందిగ్రామ్‌లో రిస్క్ చేయకూడదని భావిస్తే ఆమె పోటీ చేసే అవకాశం ఉండదు. సువేందు అధికారి తన వ్యూహాన్ని చాలా స్పష్టంగా అమలు చేస్తున్నారు. తాను నందిగ్రామ్‌ను వదులుకున్నప్పటికీ, అక్కడి ప్రజలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని, తన వారసుడిని గెలిపించుకోవడం ద్వారా మమతకు మళ్లీ చుక్కలు చూపిస్తానని ఆయన బహిరంగంగానే సవాల్ విసురుతున్నారు. ఆరు నెలల్లో జరగబోయే ఈ ఉపఎన్నిక బెంగాల్ రాజకీయాల్లో కీలక పోరాటంగా మారబోతోంది. మమతా బెనర్జీ అసెంబ్లీలో అడుగుపెట్టకపోతే, బెంగాల్‌లో టీఎంసీ ప్రాభవం క్రమంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. నందిగ్రామ్ మరోసారి యుద్ధభూమిగా మారబోతోంది. మమతా బెనర్జీ తీసుకునే నిర్ణయం ఆమె పార్టీ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఆ బెంగాల్ అసెంబ్లీలో దీదీ గళం వినబడాలంటే ఆమె ఈ గండం గట్టెక్కక తప్పదు

# దేశంలో వేల కోట్ల లీటర్ల పెట్రోల్-డీజిల్ వాడకం

**న్యూఢిల్లీ (భారత శక్తి)** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ టీవీలో హైదరాబాద్ పర్యటన సందర్భంగా దేశ ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. అందులో ఇంధన పొదుపు ఒకటి. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన వినియోగం తగ్గించాలని సూచించారు. వర్క్ ఫ్రం హోం చేయాలన్నారు. ప్రధానమంత్రి పిలుపునిచ్చిన నేపథ్యంలో, తన కాన్వాయ్‌లో ఉపయోగించే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ఆదేశించారు. ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లుగా, ఇది సాధారణ పెట్రోల్-డీజిల్ వాహనాలను తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వాడకాన్ని పెంచడానికి దిశానిర్దేశం. భారతదేశంలో వార్షికంగా 2 వేల కోట్ల లీటర్ల పెట్రోల్-డీజిల్ వాడకం జరుగుతున్న నేపథ్యంలో, ఇటువంటి చర్యలు లక్షలాది కోట్ల రూపాయల ఆదాను తీసుకొస్తాయని నిపుణులు అంచనా. పొదుపు తన నుంచే మొదలు పెట్టాలని మోడీ కీలక ఆదేశాలు ఇచ్చారు.స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్ పీ జీ) ఈ ఆదేశాన్ని అమలు చేస్తూ, ప్రధాని భద్రతా ప్రోటోకాల్‌కు ఎటువంటి భంగం రాకుండా చూస్తోంది. అధునాతన ఈవీలు గట్టి బాడీలు, రాడార్ సెన్సార్లు, డ్రోన్ డిటెక్షన్ వంటి ఫీచర్లతో సిద్ధమవుతాయి. ఇది మాత్రమే కాకుండా, కాన్వాయ్‌లో 30-40 వాహనాలను 15-20కి తగ్గించడం ద్వారా రోడ్డు ట్రాఫిక్‌ను సులభతరం చేస్తుంది.ఈ చర్య ఇంధన ఆదాతో పాటు పర్యావరణానికి లాభదాయకం. ఒక ఈవీ వాహనం సంవత్సరానికి 5-7 టన్నుల ఊ2 ఉద్గారాలను తగ్గిస్తుంది. భారతదేశం 2030 నాటికి 30 శాతం ఈవీలకు మారాలనే లక్ష్యంలో కేంద్రం చర్యలు చేపట్టింది. ఆర్థికంగా, పెట్రోల్ ధరలు రూ.100కి పైబడిన ఈ సమయంలో, కాన్వాయ్ ఖర్చు 40 తగ్గుతుంది.ఈ నిర్ణయం దేశవ్యాప్త ఈవీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వేగవంతం చేస్తుంది, ముఖ్యంగా ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ టెక్నాలజీలో పెట్టుబడులు పెరుగుతాయి. సవాళ్లుగా రహస్యత, ఛార్జింగ్ సమయాలు, సైబర్ సెక్యూరిటీ మిగిలాయి. అయినప్పటికీ, ఇది ప్రభుత్వ వాహనాలు, పౌరుల వాహనాలకు ఆదర్శంగా మారి, 'గ్రీన్ మొబిలిటీ'కి ఊతమిస్తుంది.

# బండి చుట్టూ రాజకీయం

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వ్యక్తిగత స్థాయికి చేరుకున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు కేవలం ఒక నేరపూరిత దర్యాప్తుగా మిగలకుండా, రాష్ట్రంలో రాజకీయ సెగలు పుట్టిస్తోంది. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి వంటి ప్రధాన ప్రాంతాల్లో బండి భగీరథ్ పరారీ అంటూ వెలిసిన పోస్టర్లు ఈ వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాయి. అసలు ఈ పోస్టర్లు ఎవరు వేశారు? దీని వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఏవి? అన్నది పక్కన పెడితే, ప్రత్యర్థిని దెబ్బతీయడానికి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.ఈ వ్యవహారం రెండు భిన్నమైన కథనాల మధ్య నలుగుతోంది. ఒక వైపు, ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిందని, ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని ప్రాసిక్యూషన్ చెబుతోంది. మరోవైపు, ఇది పక్కాగా ప్లాన్ చేసిన హనీ ట్రాప్ అని, రూ. 5 కోట్ల వరకు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేశారని భగీరథ్ తరపున కౌంటర్ ఫిర్యాదు నమోదైంది. చట్టం తన పని తాను చేసుకుపోవాల్సి ఉండగా, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ట్రోలింగ్ ఈ కేసులో అసలు బాధితులు ఎవరో తేల్చలేనంత గందరగోళాన్ని సృష్టిస్తోంది.సాధారణంగా ఏదైనా కేసు నమోదైనప్పుడు దర్యాప్తుకు సహకరించాల్సిన బాధ్యత నిందితులపై ఉంటుంది. అయితే, బుధవారం సిట్ విచారణకు భగీరథ్ హాజరుకాలేదు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ పూర్తయిన తర్వాత వచ్చేలా రెండు రోజుల తరవాత వస్తానని సమాచారం పంపారు. బండి సంజయ్ రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే తన కుమారుడిని బలి చేస్తున్నారని, ఇది తనపై జరుగుతున్న పొలిటికల్ హిట్ జాబ్ అని ఆరోపిస్తున్నారు. అధికార పక్షం మాత్రం.. నేరం చేసింది ఎవరైనా చట్టం ముందు సమానమేనని, బాధితురాలికి న్యాయం జరగాల్సిందేనని పట్టుబడుతోంది. మరో వైపు బీఆర్ఎస్ నేతలు బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలంటున్నారు. ఈ రాజకీయ యుద్ధంలో బాధితురాలి కుటుంబానికే ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు బురద చల్లుకునే క్రమంలో, బాధితురాలి గుర్తింపును గానీ, ఆమె మానసిక స్థితిని గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు ఈ సమస్యను పరిష్కరించడానికి వివాహం వంటి వింత సలహాలు ఇవ్వడం, దానికి టీపీసీసీ ఖండన తెలపడం వంటివి చూస్తుంటే.. ఈ అంశం ఎంతటి అయోమయానికి గురైందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో నేతలను వ్యక్తిగతంగా దెబ్బతీయడానికి వారి పిల్లలను, కుటుంబ సభ్యులను వాడుకునే సంస్కృతి పెరిగిపోవడం ఆందోళనకరమన్న అభిప్రాయం వినిపిస్తోంది. అది భగీరథ్ అయినా, మరెవరైనా.. నేరం నిరూపితమైతే చట్టపరమైన శిక్ష అనుభవించాలి. కానీ, దర్యాప్తు పూర్తికాకముందే పోస్టర్లతో వేధించడం , రాజకీయ కుట్రలంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. చివరకు కోర్టులో తేలాల్సిన అంశాన్ని వీధి పోరాటంగా మార్చడం వల్ల వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళనవ వ్యక్తమవుతోంది.

# అమెరికాలో 'శాండ్‌విచ్ జనరేషన్ నిరసనలు

**న్యూఢిల్లీ (భారత శక్తి)**అమెరికాలో లక్షలాది మంది తీవ్రమైన ఆర్థిక, మానసిక, వృత్తిపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఒకే సమయంలో వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూసు కుంటూ, మరోవైపు పిల్లల ఆలనాపాలనలో మునిగిపోవడంతో వారి జీవితాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. 'శాండ్‌విచ్ జనరేషన్'గా పిలుస్తున్న ఈ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల అమెరికా సెనేట్ కమిటీ ఆన్ ఏజింగ్ ప్రత్యేక విచారణ చేపట్టింది. వీరికి ఫెడరల్ ప్రభుత్వం నుంచి మరింత మద్దతు అవసరమని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయ పడ్డారు. సెనేట్ కమిటీ చైర్మన్ రిక్ స్కాట్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుమారు 11 మిలియన్ల మంది అమెరికన్లు వృద్ధ తల్లిదండ్రులు, పిల్లల బాధ్యతలతో సతమతమవుతున్నారని తెలిపారు. వీరిలో ప్రతి ఐదుగురిలో ఒకరు తమ ఉద్యోగ వేళలు తగ్గించుకోవడం లేదా పూర్తిగా మానేయడం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలో వేతనం లేని ఈ సంరక్షణ విలువ ఏటా 600 బిలియన్ డాలర్లకు పైగా ఉంటుందని ఆయన అంచనా వేశారు.ఈ విచారణలో సెనేటర్ ఆండీ కిమ్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. తన తండ్రికి అల్జీమర్స్ వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత తాను కూడా 'శాండ్‌విచ్ జనరేషన్'లో చేరానని, ప్రస్తుతం ఆయన బాగోగులు చూసుకోవడానికి ఒక కేర్‌గివర్‌ను నియమించాల్సి వస్తోందని వివరించారు.ఫ్లోరిడాకు చెందిన మేగన్ మహేర్ అనే మహిళ మాట్లాడుతూ.. తన మొదటి బిడ్డ పుట్టిన కొన్ని వారాలకే తల్లికి క్యాన్సర్ అని తేలడంతో ఒకేసారి మాతృత్వం, కేర్‌గివర్ బాధ్యతలు మోయాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ బాధ్యతల కారణంగా తాను సంప్రదాయ ఉద్యోగాలు చేయలేక స్వయం ఉపాధిపై ఆధారపడాల్సి వచ్చిందని తెలిపారు.

## కేంద్ర మంత్రివర్గంలో మార్పులు..?

**విజయవాడ,(భారత శక్తి)** కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఖాయమని తెలుస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రావడం.. ప్రభుత్వాలు కొలువు తీరడం జరిగిపోయింది. ఇక 2029 సార్వత్రిక ఎన్నికలపై బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ఫోకస్ పెట్టింది. బిజెపితోపాటు ఎన్డీఏ ను మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారు. అందుకే కేంద్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్నారు. ఈసారి యువతకు ప్రాధాన్యం ఇచ్చి 2029 ఎన్నికలపై గురిపెట్టనున్నారు. ఎన్డీఏ లోని మిత్రులకు ఈసారి మంత్రివర్గంలో స్థానం కల్పించనున్నారు. ప్రధానంగా ఈసారి జనసేనకు చాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ఇప్పటికే మంత్రుల పనితీరు నివేదిక ప్రధాని నరేంద్ర మోడీ కి చేరింది. దానికి అనుగుణంగా కొత్తవారికి ఛాన్స్ ఇస్తారు ప్రధాని నరేంద్ర మోడీ. ఈనెల 15న ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. తిరిగి ఈనెల 20న చేరుకోనున్నారు. వచ్చిన వెంటనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. అయితే ఈసారి దక్షిణాది రాష్ట్రాలకు ఛాన్స్ ఇవ్వచ్చు అనే సమాచారం ఉంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యం ఉంటుందని సమాచారం. ఏపీ నుంచి ఈసారి జనసేనకు ఒక మంత్రి పదవి ఇస్తారని తెలుస్తోంది. అప్పట్లోనే జనసేనకు ఒక మంత్రి పదవి ఇస్తామంటే పవన్ కళ్యాణ్ పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేదు. అయితే ఈసారి మాత్రం మంత్రి పదవి తీసుకునేందుకు పవన్ కళ్యాణ్ ఆసక్తిగా ఉన్నారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జనసేనకు ఏపీ నుంచి ఒక మంత్రి పదవి ఖాయమని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది.తెలుగుదేశం పార్టీ నుంచి ప్రస్తుతం ఇద్దరు ఎంపీలు కేంద్ర మంత్రివర్గంలో ఉన్నారు. అయితే ఈసారి కింజరాపు రామ్మోహన్ నాయుడు శాఖ మార్పు ఖాయమని తెలుస్తోంది. టిడిపికి కానీ మరో మంత్రి పదవి ఇస్తే.. హిందూపురం ఎంపీకి కానీ.. చిత్తూరు ఎంపీ కి కానీ ఛాన్స్ ఇస్తారని సమాచారం. రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలనుకుంటే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేరును పరిగణలోకి తీసుకుంటారని తెలుస్తోంది. మరోవైపు బిజెపి ఎంపీ కి ఛాన్స్ ఇవ్వాలనుకుంటే రాజమండ్రి ఎంపీ పురందేశ్వరికి అవకాశం దొరికే పరిస్థితి కనిపిస్తోంది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సైతం ఆశావహుడుగా ఉన్నారు.. ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత మంత్రివర్గ విస్తరణ పై ఒక క్లారిటీ వస్తుంది. చూడాలి అవకాశం ఎవరికి దక్కుతుందో..

## వర్క్ ఫ్రమ్ హోమ్ రియాల్టీ


**తిరుపతి,(భారత శక్తి)** పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావం మనదేశంలోనూ కనిపిస్తోంది. అందుకే ముందస్తు సన్నాహంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ పొదుపు సూచనలు చేశారు. ఇందన వినియోగాన్ని తగ్గించాలని, సొంత వాహనాలకు బదులు కార్ పూలింగ్, ప్రభుత్వ రవాణా వ్యవస్థలను ఉపయోగించుకోవాలని.. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని.. ఇలా పలు రకాల సూచనలు చేశారు ప్రధాని నరేంద్ర మోడీ. అయితే ప్రధాని సూచనలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ప్రకటించిన ఎనిమిది అంశాలను పాటించాలని ప్రజలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఒక కార్యాచరణ ప్రకటించనున్నట్లు చెప్పారు. వర్క్ ఫ్రం హోం విధానంపై మాట్లాడారు సీఎం చంద్రబాబు. కరోనా వచ్చిన తరువాత వర్క్ ఫ్రం హోం అనేది వెలుగులోకి వచ్చింది. కంపెనీలు ఆర్థిక భారం నుంచి తప్పించుకునేందుకు.. కోవిడ్ వ్యాప్తి నియంత్రణకు గాను అప్పట్లో వర్క్ ఫ్రం హోం అమలు చేశారు. అయితే ఇప్పటికీ వర్క్ ఫ్రం హోం అమలవుతూనే ఉంది. అందుకే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వర్క్ ఫ్రం హోం అంటూ ఒక సర్వే చేపట్టింది. ఇంట్లో ఉండి ఉపాధి పొందేందుకు వీలుగా ఈ సర్వే సాగింది. గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ వర్క్ ఫ్రం హోం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని చూసింది. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 8 అంశాల్లో పొదుపు పాటించాలని పిలుపునివ్వడంతో.. వర్క్ ఫ్రం హోం ను పక్కాగా అమలు చేయాలని భావిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. గజగదానిపై కీలక వ్యాఖ్యలు చేశారు.వర్క్ ఫ్రం హోం అనేది రియాలిటీ. ఇంటి నుంచి ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి ఉంటుంది. దీనికి ఎంతగానో ప్రోత్సాహం అందిస్తామని సీఎం చంద్రబాబు చెప్పడం విశేషం. ప్రభుత్వంలోనూ ఈ తరహా విధానం తెస్తామని.. తద్వారా దుబారా ఖర్చును తగ్గిస్తామన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు హోంమంత్రి అమిత్ షా తమ కాన్వాయ్ వాహన శ్రేణిని తగ్గించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా సెక్యూరిటీ తగ్గించుకునే పనిలో ఉన్నట్లు సీఎం చంద్రబాబు సంకేతాలు ఇచ్చారు. ప్రపంచ పర్యాటక ప్రాంతాలకు వెళ్లే కంటే మన దేశంతో పాటు సొంత రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్న విషయాన్ని కూడా గుర్తు చేశారు. విదేశీ పర్యటనలకు వెళ్ళొద్దని ప్రధాని నరేంద్ర మోడీ పరోక్షంగా సూచించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే విషయాన్ని చెబుతున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా పొదుపు మంత్రం పై కీలక సూచనలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న ప్రపంచ ఇంధన ధరల నేపథ్యంలో కేంద్రం పొదుపు, మితమైన వినియోగం కోసం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అయినప్పటికీ ఎలక్ట్రానిక్స్ దిగుమతులపై ఎలాంటి ఆంక్షలు విధించే ప్రణాళికలు లేవని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. తయారీ, ఎగుమతులు, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణతో సహా ఆర్థిక వ్యవస్థలోని ఉత్పాదక రంగాలలో ఎలక్ట్రానిక్స్ దిగుమతులు కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నాయని అధికారులు తెలిపారు. పెరుగుతున్న ప్రపంచ మెమరీ చిప్ ధరలు సమీప భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ దిగుమతుల విలువను పెంచవచ్చని, అదే సమయంలో భారతదేశంలో కొనసాగుతున్న డేటా సెంటర్ల నిర్మాణం, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ఏఐ (ఎఐ) సర్వర్లు అత్యవసరంగా అవసరమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2026 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఎలక్ట్రానిక్స్ దిగుమతులు 116.17 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కాగా సాధ్యమైన చోటల్లా ఉద్యోగులను రిమోట్‌గా పని చేయడానికి అనుమతించాలని ఈ మేరకు ఐటీ, ఐటీ ఆధారిత సేవల కంపెనీలకు సలహా ఇవ్వాలని కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖను నూతన సమాచార సాంకేతిక ఉద్యోగుల సెనేట్ (నైట్స్) కోరింది. ఇంధనాన్ని ఆదా చేయాలని, అనవసర ప్రయాణాలను తగ్గించాలని ప్రధాని ఇచ్చిన పిలుపునకు ఈ చర్య అనుగుణంగా ఉంటుందని ఆ సంఘం పేర్కొంది.

### ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు పొదుపు..

ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో బీజేపీ బహిరంగ సభలో మాట్లాడుతూ పొదుపు చర్యల గురించి ప్రస్తావించారు. దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించడానికి, పెరుగుతున్న ప్రపంచ చమురు ధరల నుండి ఆర్థిక వ్యవస్థను కాపాడటానికి, దిగుమతి చేసుకున్న పెట్రోలియం ఉత్పత్తులను తెలివిగా ఉపయోగించాలని పౌరులను కోరారు ప్రధాని మోదీ. ఇందులో భాగంగా వర్క్-ఫ్రమ్-హోమ్ ఏర్పాట్లు, వర్చువల్ సమావేశాలు, ఆన్‌లైన్ కాన్ఫరెన్స్‌లతో సహా కోవిడ్ రోజుల నాటి అనేక పద్ధతులను పునరుద్ధరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అలాగే ప్రజా రవాణా (పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్), కార్-పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాలు, రైలు సరుకు రవాణ వినియోగాన్ని ప్రోత్సహించారు. "చినీతీని ఈతీనీఎ ఊనీఎవ" అనేది ఇక ఫ్యూచర్ కాదు? అది ఇప్పుడు రియాలిటీ. ఇంట్లో కూర్చొని ప్రపంచం మొత్తం కోసం పని చేసే రోజులు ఇంకా పెరుగుతాయి. డబ్బు సంపాదించే అవకాశాలు కూడా ఎక్కువ అవుతాయి.

## ఒంగోలులో దారుణం

### - లాడ్జిలో అంధురాలైన ప్రభుత్వ ఉద్యోగిని గొంతు కోసి హత్య



**(భారత శక్తి)** ఒంగోలులో దారుణం జరిగింది. ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న అంధురాలు ఆదిలక్ష్మి ఓ లాడ్జిలో హత్యకు గురైంది. ట్టణంలోని డిపో సెంటర్ సమీపంలో ఉన్న శ్రీరామ్ లాడ్జిలో ఓ మహిళ గొంతు కోసి హత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతురాలు ఆదిలక్ష్మి అని, ఆమె అంధురాలని పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలక్ష్మి ఒంగోలులోని ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తోంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో భర్త మల్లికార్జున్ ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా ఆదిలక్ష్మి వెంకటరమణ అనే వ్యక్తితో కలిసి డిపో సెంటర్ వద్ద ఉన్న శ్రీరామ్ లాడ్జిలో దిగినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని లాడ్జి గదిని తెరిచి చూడగా ఆదిలక్ష్మి రక్తపు మడుగులో మృతిచెందిన స్థితిలో కనిపించింది. ఆమె గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎస్పీ.. "భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యేకంగా మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాం. లాడ్జిలో మహిళ మృతదేహం లభించింది. ఆమెతో కలిసి ఉన్న వెంకటరమణ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి" అని తెలిపారు. పోలీసులు లాడ్జి సిబ్బందిని ప్రశ్నిస్తూ, సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. హత్యకు గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు

# తల్లికి వందనం పథకం

## 78 లక్షల మంది అర్హులు

**విజయవాడ (భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకానికి సంబంధించిన కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ఏడాది సుమారు 78 లక్షల మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించింది ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం నిధులు మరికొన్ని రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధమవుతోంది. 2026 విద్యాసంవత్సరానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల జాబితా రూపకల్పన, నగదు జమ ప్రక్రియపై విద్యాశాఖ అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే ఉన్నత లక్ష్యంతో సాగుతున్న ఈ పథకం ద్వారా ఈ ఏడాది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక ఊరట కలగనుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 78 లక్షల మంది విద్యార్థులను తల్లికి వందనం పథకానికి ప్రాథమికంగా అర్హులుగా తేల్చారు. పాఠశాలల నుంచి సేకరించిన విద్యార్థుల డేటాను ఇప్పటికే క్రోడీకరించి, తుది వడపోత కోసం క్షేత్రస్థాయి అధికారులకు పంపారు. ప్రస్తుతం గ్రామ, వారు సచివాలయాల్లోని సంక్షేమ కార్యదర్శులు ఈ వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీ ప్రక్రియలో భాగంగా, విద్యార్థుల హాజరు, కుటుంబ ఆర్థిక స్థితిగతులు, ఇతర అర్హత ప్రమాణాలను సరి చూస్తున్నారు. అనర్హులను తొలగించి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఈ పరిశీలన సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే అర్హుల తుది జాబితాను విడుదల చేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగదును విడుదల చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాలలకు వెళ్లడం మానేయకూడదనేది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపేలా ప్రోత్సహించడానికి, వారి విద్యా అవసరాల కోసం ప్రభుత్వం నేరుగా తల్లుల ఖాతాల్లోనే నగదును జమ చేస్తోంది. రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి, డ్రాపౌట్స్ సంఖ్యను తగ్గించడానికి తీసుకున్న ఒక సామాజిక విప్లవం. తల్లికి వందనం నిధులు ఎటువంటి సాంకేతిక అడ్డంకులు లేకుండా నేరుగా ఖాతాల్లో జమ కావాలి అంటే లబ్ధిదారులు కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మీ బ్యాంకు ఖాతా యాక్టివ్‌గా ఉంచుకోవాలి.

అలా ఉందో లేదో చూడాలి. చాలా కాలం నుంచి లావాదేవీలు జరపని ఖాతాలు ఇన్ యాక్టివ్ అయ్యే అవకాశం ఉంది. విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాకు ఆధార్ నెంబర్ తప్పనిసరిగా లింక్ అయ్యి ఉండాలి. ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కీలకమైన అంశం. ప్రభుత్వ పథకాల నగదు డైరెక్ట్‌గా బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అందాలంటే, ఖాతాకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పూర్తి అయి ఉండాలి. పాఠశాల రికార్డుల్లో, సచివాలయ డేటాలో విద్యార్థి, తల్లి వివరాలు ఒకే విధంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ వివరాలను లేదా ఎన్‌పీసీఐ స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో లేదా స్థానిక గ్రామ వార్డు సచివాలయంలో చెక్ చేసుకోవచ్చు. ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని అధికారులు




కోరుతున్నారు. ఆర్థిక సంవత్సరం ఏపీ ప్రభుత్వం సుమా3రు రూ. 8, 711 కోట్లను విద్యార్థుల కుటుంబాల ఖాతాల్లో జమ చేసింది. ఈ భారీ మొత్తం రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల విద్యా అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించింది. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో లేదా అంత కంటే ఎక్కువ మొత్తంలో నిధుల విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

## స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. కొత్త ఎస్‌ఈసీ అనిల్ కుమార్ పునేఠా నిర్వహించిన సమీక్షా సమావేశం రాష్ట్రంలో ఎన్నికల వేడిని ఒక్కసారిగా పెంచింది. వచ్చే మూడు నెలల కాలంలో పెండింగ్‌లో ఉన్న పంచాయతీ, పరిషత్ , మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఏకపక్ష ఎన్నికల ఆరోపణల కారణంగా , ఈసారి అత్యంత పారదర్శకంగా ఎన్నికలు జరపాలని యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక ఎన్నికల నిర్వహణ కూటమి ప్రభుత్వానికి అంత సులభం కాదు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి అద్భుత విజయం సాధించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు ఇప్పుడు అతిపెద్ద సవాల్‌గా మారింది. ముఖ్యంగా జనసేన, బీజేపీలు ఈసారి గతంలో కంటే ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు పట్టుబట్టే అవకాశం ఉంది. పొత్తులో భాగంగా తమకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీల కిందిస్థాయి నేతలు ఇప్పటికే ఒత్తిడి పెంచుతున్నారు. ఐదేళ్లుగా క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని నిలబడిన టీడీపీ గ్రామస్థాయి కార్యకర్తలు.. ఇప్పుడు తమకు రావాల్సిన పదవులను పొత్తుల పేరుతో ఇతర పార్టీలకు వదులుకోవాల్సి వస్తుందన్న ఆందోళనలో ఉన్నారు. క్షేత్రస్థాయిలో బలమైన నెట్‌వర్క్ ఉన్న టీడీపీ క్యాడర్‌ను కాదని జనసేన లేదా బీజేపీకి ఎక్కువ స్థానాలు కేటాయిస్తే, అది తిరుగుబాటుకు దారితీయవచ్చు. ఇదే జరిగితే కూటమి ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉందని చంద్రబాబు నాయుడు గ్రహించారు. ఎన్నికల నిర్వహణపై ప్రకటనలు వస్తున్నప్పటికీ, లోలోపల చంద్రబాబు కొంత జాప్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం పార్టీల మధ్య సమన్వయం కుదర్చడమేనని తెలుస్తోంది. ముందుగా నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీలను వేసి, అసంతృప్తిని తగ్గించిన తర్వాతే నోటిఫికేషన్‌కు వెళ్లాలని ఆయన భావిస్తున్నారు. అందుకే ఎస్‌ఈసీ కసరత్తు చేస్తున్నా, ప్రభుత్వం నుండి గ్రీన్ సిగ్నల్ రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన ఈసారి స్థానిక సంస్థల్లో తన బలాన్ని నిరూపించుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో తమకు గౌరవప్రదమైన సంఖ్య దక్కాలని ఆ పార్టీ కోరుతోంది. అటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా ఏపీలో తన ఉనికిని చాటుకోవడానికి ఈ ఎన్నికలను వేదికగా మార్చుకోవాలని చూస్తోంది. ఈ మూడు పార్టీల డిమాండ్లను సమతూకం చేయడం చంద్రబాబుకు కత్తిమీద సాము లాంటిదే. వచ్చే మూడు నెలలు ఏపీ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి. అటు వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవడం కంటే, ఇటు కూటమిలోని పార్టీల మధ్య సఖ్యతను కాపాడుకుంటూ సీట్ల పంపిణీ పూర్తి చేయడమే చంద్రబాబు ముందున్న ప్రధాన లక్ష్యం. ఒకవేళ ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని చోట్ల 'ఫ్రెండ్లీ కాంటెస్ట్ జరిగే అవకాశాలను కూడా తోసిపుచ్చలేం.

## జూన్ నుంచి పీఎంఈవై ఇళ్ల నిర్మాణం

**నెల్లూరు,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ లో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న వారి కల నెరవేరే వార్త తెలిసింది. ఏపీ పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద రాష్ట్రంలో కొత్త ఇళ్ల మంజూరుకు సంబంధించి కీలక ప్రకటన వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలకు విడతల వారీగా ఇళ్లు మంజూరు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రక్రియ ప్రారంభించాయి. మే, జూన్ నెలల్లో మొదటి విడతగా లక్ష ఇళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. ఏపీలో సొంతింటి కోసం అర్హులైన వారు లక్షలాది మంది పీఎంఏవై కింద దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తులను వీఆర్వో, ఎమ్మార్వో, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ వారీగా పరిశీలించి, అర్హుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సుమారు 10 లక్షల మంది ఇంటి కోసం అప్లై చేసుకోగా, పరిశీలించిన అధికారులు దాదాపు 7 లక్షల మందిని అర్హులుగా గుర్తించబడినట్లు తెలుస్తోంది. వీరిలో మొదటి విడతగా లక్ష మందికి. ఏపీ పీఎంఏవై గ్రామీణ్ 2.0 కింద సొంతింటిని మంజూరు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి చర్యలు చేపట్టనుంది. మే చివరికల్లా కేంద్రం ఆమోదం లభిస్తే, జూన్ నెల నుంచి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. దీంతో గ్రామాల్లో పేదలకు సొంతింటి కల నెరవేరనుంది. ఏపీ పీఎంఏవై గ్రామీణ్ 2.0 స్కీమ్ కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు ఆర్థిక సాయం చేయనున్నారు. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అందిస్తాయి. ముఖ్యంగా స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలనుకునే వారికి ఈ సాయం అందిస్తాయి. నివేదికల ప్రకారం, కేంద్రం రూ.72 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.28 లక్షలు, టాయిలెట్ల నిర్మాణానికి అదనపు సాయంతో మొత్తం రూ.2.39 లక్షలు అందించే అవకాశం ఉంది. ఈ ఆర్థిక సాయాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. దరఖాస్తుదారులు ఆధార్, బ్యాంక్ అకౌంట్ లింక్, భూమి వివరాలు, ఇతర పత్రాల వివరాల్లో తప్పులు లేకుండా చూసుకోవాలి. లబ్ధిదారుల లిస్ట్ లను గ్రామ సచివాలయంలో ఉంచుతారు.

## ఆశల పల్లకిలో చిన్నమ్మ

**రాజమండ్రి (భారత శక్తి)** చిన్నమ్మకు స్పీకర్ దక్కనిది అందుకే.. పెద్ద కారణమే సాధారణ మెజారిటీకి కొద్ది దూరంలో ఆగిపోవడమే కాదు.. ప్రతిపక్ష కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమికి మెరుగైన సీట్లు దక్కాయి. గత రెండు పర్యాయాలు సొంతంగా మెజారిటీ సాధించి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీకి ఈసారి ఎన్నికలు మాత్రం చుక్కలు చూపించాయి. సాధారణ మెజారిటీకి కొద్ది దూరంలో ఆగిపోవడమే కాదు.. ప్రతిపక్ష కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమికి మెరుగైన సీట్లు దక్కాయి. ఇలాంటి పరిస్థితుల్లో లోక్ సభ స్పీకర్ పదవి అత్యంత కీలకం. బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వంలో కీలక పదవులు దక్కాలంటే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) నేపథ్యం ఓ పెద్ద అర్హత. గవర్నర్ వంటి పదవులు సంఘీయులకే దక్కుతాయి. అలాంటిది కీలకమైన పరిస్థితుల్లో లోక్ సభ స్పీకర్ అంటే.. మరో చాన్స్ ఉండదు. కాగా, ఇటీవల స్పీకర్ గా మరోసారి ఓం బిర్లాకే అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఈ పదవి ఎవరికి దక్కుతుందోనని కొద్ది రోజుల పాటు సస్పెన్స్ నెలకొంది. ఓ దశలో ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పేరు ప్రముఖంగా వినిపించింది. టీడీపీ.. బీజేపీ వయా కాంగ్రెస్ పురంధేశ్వరి దివంగత మహా నటుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ కుమార్తె. ఆమెది టీడీపీ నేపథ్యం. అయితే, తన తండ్రిని పదవీచ్యుతుడిని చేశాక.. చంద్రబాబు నాయుడతో విభేదాల రీత్యా ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. 2004 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ లో చేరారు. 2014 వరకు కేంద్రంలో మంత్రిగా పనిచేశారు. ఏపీ విభజనతో కాంగ్రెస్ కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఇదే నేపథ్యం పురంధేశ్వరికి బీజేపీలో మరింత ఉన్నత పదవులు దక్కేందుకు అడ్డంకిగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పురంధేశ్వరికి ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, బీజేపీ మహిళా మోర్చా పదవులు ఇచ్చినా.. పదేళ్ల నుంచి ప్రభుత్వంలో పదవులు మాత్రం దక్కలేదు. ఇటీవలి ఎన్నికల్లో ఆమె రాజమహేంద్రవరం నుంచి ఎంపీగానూ గెలిచారు. కేంద్ర కేబినెట్ లోనూ చోటివ్వలేదు. ఇక డిప్యూటీ స్పీకర్ పదవిని బీజేపీ మిత్రపక్షానికి కేటాయించే ఆలోచన ఉంది. మరి పురంధేశ్వరిని పార్టీ బాధ్యతల్లోనే కొనసాగిస్తారా? లేక మున్ముందు కేబినెట్ లో చోటిస్తారా? అనేది చూడాలి.

### పంచాయితీరాజ్ శాఖకు

## అవార్డుల పంటలు

**కాకినాడ (భారత శక్తి)** ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ పాలన పరంగా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు సంచలనంగా మారాయి. ముఖ్యంగా ఆయన ఆద్వర్యం లో నడుస్తున్న పంచాయితీ రాజ్ శాఖ లో అద్భుతాలు జరుగుతున్నాయి. 2024 వ సంవత్సరం లో దేశం లోనే 24 వ స్థానంలో ఉన్నటువంటి పంచాయితీ రాజ్ శాఖ, పవన్ కళ్యాణ్ చేపట్టిన అద్భుతమైన సంస్కరణల కారణంగా మొదటి స్థానానికి చేరుకొని సంచలనం సృష్టించింది. గడిచిన 23 నెలల్లో ఈ శాఖకు 19 నేషనల్ అవార్డ్స్ వచ్చాయి, ఇది సాధారణమైన విషయం కాదు. గతంలో ఎప్పుడూ కూడా ఇలాంటివి జరగలేదు. నిజాయితీ తో పని చేసే నాయకుడు సాధించే ఫలితాలు ఎంతటి అద్భుతంగా ఉంటాయో చెప్పడానికి ఇదొక నిదర్శనం అని చెప్పొచ్చు. ప్రతీ నెల ఈ శాఖకు ఎదో ఒక అవార్డు వస్తూనే ఉంది. అయితే ఇప్పటి వరకు వచినటువంటి ఆ 19 అవార్డులు ఏంటో ఒకసారి చూద్దాం పదండి:సీఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజగవర్గాన్ని దేశం లోనే టాప్ 3 పంచాయితీగా గుర్తించారు. అందుకు గుర్తుగా నానాజీ దేశముఖ్ పురస్కార్ అనే అవార్డుని అందించారు. అదే విధంగా విశాఖపట్నం జిల్లాకు చెందిన శృంగవరం అనే పంచాయితీ కి దేశం లోనే మొదటి స్థానం దక్కింది. 'పంచాయత్ విత్ గుడ్ గవర్నెన్స్' జాబితాలో ఈ అవార్డు ని కేటాయించారు. అదే విధంగా చిత్తూరు జిల్లాలోని కందులపల్లి గ్రామా పంచాయితీ కి 'క్లైమేట్ యాక్షన్ స్పెషల్ పంచాయత్' క్యాటగిరీ లో మొదటి స్థానం దక్కింది. చిత్తూరు జిల్లాలో ఇలాంటి పంచాయితీలు ఎన్నో అభివృద్ధి చెందడం వల్ల 'పంచాయత్ క్షమత నిర్మాణ్ సర్వోత్తమ్ సంస్థాన్ పురస్కార్' అనే మరో జాతీయ అవార్డు దక్కింది. ఇకపోతే కేవలం ఈ ఒక్క నెలలోనే మరో మూడు జాతీయ పురస్కారాలు దక్కాయి. ఆత్మా నిర్భర్ పంచాయత్ స్పెషల్ అవార్డు క్యాటగిరీ లో చిత్తూరు జిల్లాకు చెందిన కానీపాకం కి 2 వ స్థానం లో నేషనల్ అవార్డు దక్కింది. కానీపాకం లో ఈ స్థాయి అభివృద్ధి గతంలో ఎప్పుడూ కూడా జరగలేదు. ఇలా వివిధ శాఖల్లో పంచాయత్ రాజ్ కి జాతీయ అవార్డుల వెల్లువ కురుస్తూనే ఉంది. దేశం లోనే ప్రస్తుతం ప్రతీ ఒక్కరు పంచాయత్ రాజ్ శాఖ ని ఒక రోల్ మోడల్ గా తీసుకొని అభివృద్ధి చేసే పరిస్థితి కి ఈ శాఖ ని తీసుకొచ్చాడు పవన్ కళ్యాణ్. రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్ ఈ శాఖలో ఇంకెన్ని అద్భుతాలు సృష్టిస్తాడో చూడాలి. మరోపక్క సీఎం చంద్రబాబు నాయుడు కూడా పవన్ కళ్యాణ్ పంచాయత్ రాజ్ శాఖని వృద్ధి చేస్తున్న విధానం పై ప్రశంసల వర్షం కురిపిస్తూ పవన్ కళ్యాణ్ కి అభినందనలు తెలియజేసారు.

## యార్నగూడెంలో రోడ్డు ప్రమాదం..ఒకరు మృతి

**కాకినాడ (భారత శక్తి)** తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ను టిప్పర్ లారీ ఢీకొట్టింది. బస్సు రాజాం నుంచి విజయవాడ వెళుతున్న శ్రీ వెంకటరమణ ట్రావెల్స్ గా గుర్తించారు,. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. 15 మందికి గాయాలు అయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో చిన్నారులు ఎక్కువగా ఉండడంతో పోలీసులు అలెర్ట్ అయ్యారు. స్వల్ప గాయాలతో చిన్నారులతో రోడ్డుపై ఉన్న మరికొంత ప్రయాణికులు వుండిపోయారు. రోడ్డు ప్రమాదం పై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్పందించారు.

మృతి చెందిన వారికి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందుతాయని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. గాయపడిన వారు ధైర్యంగా ఉండాలని కోరారు. బస్సులో మిగిలిన ప్రయాణికులను వెంటనే వేరే బస్సులో ఎక్కించి పంపించే విధంగా చర్యలు చేపట్టాలని సి ఐ నాయక్ ను ఆదేశించారు.



భారత శక్తి
శుక్రవారం, మే 15, 2026





## శర్వానంద్ సరసన ఛాన్స్ కొట్టేసిన

# మానస వారణాసి!

టాలీవుడ్ స్టార్ శర్వానంద్, వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను పెంచుకుంటున్నారు. తాజాగా ఆయన సీనియర్ దర్శకుడు శ్రీనువైట్లతో చేతులు కలపడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. శ్రీనువైట్ల అంటేనే మనకు గుర్తొచ్చేది కడుపుబ్బ నవ్వించే వినోదం. అయితే ఈసారి ఆయన కేవలం కామెడీకే పరిమితం కాకుండా, దానికి 'టైమ్ ట్రావెల్' అనే సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌ను జోడిస్తున్నారు. శర్వానంద్ టైమింగ్‌కు, శ్రీనువైట్ల మార్క్ హ్యూమర్‌కు తోడు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త మేజిక్ జరుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జులైలో సెట్స్ పైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఈ సినిమాను నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడినట్లు కనిపిస్తోంది. మొదట స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, చివరకు మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు సమాచారం. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న మానసకు, శర్వానంద్ పక్కన ఇది ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ కొత్త జోడీ వెండితెరపై ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఎత్తుల భయాన్ని జయించా: రష్మిక

ప్రస్తుతం కొచ్చిలో 'మైసా' చిత్ర షూటింగ్‌లో ఉన్న రష్మిక, తనకు ఎంతో కాలంగా ఉన్న 'ఎత్తుల భయాన్ని' అధిగమించినట్లు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ఆమె డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ క్రమంలో ఆమె చేతులు, కాళ్లకు గాయాలైనా లెక్కచేయకుండా షూటింగ్‌ను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం. అడవులు, ట్రెక్కింగ్‌లు, వర్షాల మధ్య ఈ షూటింగ్ తనకు కొత్త శక్తిని ఇచ్చిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.మరోవైపు, రష్మిక - విజయ్ దేవరకొండ జోడీ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. వీరిద్దరూ కలిసి నటించిన ఒక వాణిజ్య ప్రకటన ఇన్‌స్టాగ్రామ్‌లో 9.1 మిలియన్లకు పైగా లైక్స్ సాధించి, ప్రపంచవ్యాప్తంగా అత్యధిక లైక్స్ పొందిన రెండో ప్రకటనగా రికార్డు సృష్టించింది. విశేషమేమిటంటే, ఈ జాబితాలో 11.5 మిలియన్ల లైక్స్‌తో మొదటి స్థానంలో ఉన్నది కూడా ఈ జోడీకి సంబంధించిన మరో ప్రకటన కావడం విశేషం. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి 'రణబాలి' అనే చిత్రంలో నటిస్తున్నారు.

## వయసుపై చర్చ..

### - టబు అసహనం



సినీ రంగంలో నటీమణుల వయసుపై సమాజం, పరిశ్రమ చూపిస్తున్న అత్యుత్సాహంపై టబు ఘాటుగా స్పందించారు. "మన వయసు గురించి మనకంటే ఇతరులకే ఎక్కువ ఆందోళన ఉంటుంది" అని ఆమె ఎద్దేవా చేశారు. వయసు పెరగడం అనేది సహజమైన ప్రక్రియ అని, అది ఒక్క రోజులో జరిగేది కాదని ఆమె గుర్తు చేశారు. మహిళలు సాధిస్తున్న విజయాల కంటే వారి వయసు గురించి చర్చించడం బాధాకరమని, దీనివల్ల నటీమణులపై అనవసరమైన ఒత్తిడి పెరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలను తిరస్కరించే విషయంలో తాను అనుసరించే పద్ధతిని కూడా ఆమె వివరించారు. చాలా మంది డేట్స్ లేవని అబద్ధం చెప్పమని సలహా ఇచ్చినా, తాను మాత్రం స్క్రిప్ట్ నచ్చకపోతే ఆ విషయాన్ని ముఖం మీదనే చెప్పేస్తానని టబు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె తన తాజా చిత్రం 'భూత్ బంగ్లా' విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న 'స్లమ్ డాగ్' చిత్రంలో నటిస్తున్నారు. నాగార్జున 100వ చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించబోతున్నారు.

## 'జన నాయగన్' కోసం రంగంలోకి

# సీఎం విజయ్..

### - కేన్స్ వెళ్లిన నిర్మాతకు పిలుపు!



తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర నటుడు విజయ్ తన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు మార్గం సుగమం చేసేందుకు స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సెన్సార్ సమస్యల కారణంగా విడుదల ఆగిపోయి ప్రస్తుతం రివైజింగ్ కమిటీ వద్ద ఉన్న ఈ సినిమా అడ్డంకులను తొలగించే పనిపై ఆయన దృష్టి సారించారు. ఇందులో భాగంగా, ఫ్రాన్స్‌లో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్ర నిర్మాతను తక్షణమే చెన్నైకి తిరిగి రావాలని విజయ్ సూచించినట్టుగా కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.విజయ్ నటుడిగా చేస్తున్న చివరి చిత్రం కావడంతో 'జన నాయగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ఒకవైపు పాలనలో సంచలన నిర్ణయాలు తీసుకుంటూనే తన సినిమా విడుదలకు ఉన్న అడ్డంకులను తొలగించాలని భావిస్తున్నారు.


ఈ క్రమంలోనే కేవీఎన్ బ్యానర్ నిర్మాత వెంకట్ ను కేన్స్ పర్యటన మధ్యలోనే ముగించుకుని చెన్నై బయల్దేరి రావాలని విజయ్ కోరినట్లు సమాచారం. విజయ్ పిలుపుతో నిర్మాత చెన్నైకి పయనమైనట్లు తెలియడంతో, త్వరలోనే 'జన నాయగన్' విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పరిణామంతో విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఓటీటీకి వచ్చేసిన భారీ యాక్షన్ థ్రిల్లర్!



కోలీవుడ్ లో యాక్షన్ హీరోల జాబితాపై ఒక లుక్ వేస్తే, 'ఆర్య' పేరు ముందు వరుసలోనే కనిపిస్తుంది. ఒక యాక్షన్ హీరోకి ఉండవలసిన లక్షణాలు పుష్కలంగా ఉన్న హీరో అనే విషయం ఆయనను చూడగానే అర్థమైపోతుంది. అందువల్లనే ఆయన ఆ తరహా సినిమాలు ఎక్కువగా చేస్తూ వెళుతున్నాడు. కెరియర్ పరంగా చాలా నిదానంగా ముందుకు వెళుతూ, తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలతోనే ఫ్యాన్స్ ను మెప్పిస్తున్నాడు. అలాంటి 'ఆర్య' నుంచి రీసెంటుగా వచ్చిన సినిమానే 'మిస్టర్ ఎక్స్'. మను ఆనంద్ తెరకెక్కించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ ఇది. లక్ష్మణ్ కుమార్ – వినీత్ జైన్ భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, ఏప్రిల్ 17వ తేదీన థియేటర్లకు వచ్చింది. మిక్స్డ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, నెల తిరిగేలోగానే ఓటీటీకి వచ్చేసింది. ఈ రోజు (మే 14)నుంచి ఈ సినిమా జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ భాషల్లో అందుబాటులో ఉంది. 1965 నాటి కాలంతో ముడిపడిన ఒక స్పై మిషన్ నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. గౌతమ్ కార్తీక్ .. శరత్ కుమార్ .. మంజు వారియర్ .. అనఘ .. అతుల్య రవి .. రైసా విల్సన్ ఇతర ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. కనిపించకుండా పోయిన న్యూక్లియర్ క్యాప్సిల్స్ చుట్టూ తిరిగే ఈ కథ, యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారిని మెప్పిస్తుందనే టాక్ వచ్చింది. విజువల్స్ .. యాక్షన్ సీన్స్ .. భారీతనం ఈ సినిమాలో ప్రధానమైన బలంగా నిలిచాయి. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఎన్ని మార్కులు దక్కించుకుంటుందనేది చూడాలి మరి.

## 'పెద్ది' సినిమాతో కొత్త బిజినెస్ లోకి హోంబలే ఫిల్మ్స్!




'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' వంటి భారీ విజయాలతో దేశవ్యాప్తంగా పేరు పొందిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మరో కీలక ముందడుగు వేసింది. నిర్మాణ రంగంలో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ, ఇప్పుడు అంతర్జాతీయ పంపిణీ రంగంలోకి అడుగుపెడుతోంది. ఈ ప్రయాణంలో తమ తొలి చిత్రంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది'ని ఎంచుకుంది.భారతీయ కథలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు చేరవేయాలనే లక్ష్యంతో హోంబలే ఫిల్మ్స్ తన ఓవర్సీస్ పంపిణీ విభాగాన్ని ప్రారంభించింది. దీనికి నాందిగా 'పెద్ది' చిత్రాన్ని ఎంచుకోవడం విశేషం. ఈ నిర్ణయంతో రామ్ చరణ్ సినిమాకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ ప్రచారం లభించనుంది. హోంబలే వంటి పెద్ద సంస్థ నేరుగా పంపిణీ చేస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా కీలక దేశాల్లో భారీ స్థాయిలో విడుదల ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రామ్ చరణ్ ఇంటెన్స్ మేకోవర్, పవర్‌ఫుల్ విజువల్స్‌తో కూడిన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. దీనికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ కూడా తోడవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy